Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews com | Journalism first!

సంపుటి: 56 • సంచిక: 134 • గురువారం 24 ఆగస్టు 2017 • హైదరాబాద్ ✻ పేజీలు: 12+12 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad | Khammam

ముహూర్తం | శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, తిథి: శుద్ధ తదియ రా. 9.30 వరకు, అనంతరం చవితి; నక్షత్రం: ఉత్తర సా. 4.01 వరకు, అనంతరం హస్త; అమృతకాలం: ఉ. 8.45 నుండి 10.20 వరకు; వర్జ్యం: రా. 12.38 నుండి రా.2.16 వరకు; దుర్ముహూర్తం: ఉ. 9.59 నుండి 10.50 వరకు; అనంతరం మ. 3.05 నుండి 3.57 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు

వచ్చే నెల 15 నుంచి

భూముల లెక్క

- 3600 బృందాలు • ఒక్కో బృందం 3నెలలు...3 ఊళ్లు • రైతుకు వెన్నుదన్నుగా భూ సర్వే
- సెప్టెంబర్ 15 నుంచి డిసెంబర్ ఆఖరు వరకు • రాష్ట్రం మొత్తం 1100 యూనిట్లుగా విభజన
- డిసెంబర్ తర్వాత ఆన్‌లైన్‌లో రికార్డులు • గ్రామ సభ, గ్రామ రైతు సంఘం కీలకం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భూముల లెక్క పక్కాగా చేసి రైతుకు వెన్నుదన్నుగా నిల్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ నిర్దేశించుకున్నది. ఇందుకు కీలకమైన భూ రికార్డుల ప్రక్షాళన, రైతు సంఘాల ఏర్పాటు, రైతు సదస్సుల నిర్వహణకు షెడ్యూల్ ఖరారైంది. సెప్టెంబర్ 15నుంచి డిసెంబర్ నెలాఖరుకు గ్రామం యూనిట్‌గా భూ రికార్డుల ప్రక్షాళనకు తేదీలను ఖరారు చేసింది. సెప్టెంబర్ 15న ఏకకాలంలో రాష్ట్రమంతటా ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందుకుగానూ రాష్ట్రం మొత్తాన్ని 1100 యూనిట్లుగా నిర్దేశించి, 3600 బృందాలను ఎంపిక చేయనున్నారు. ఒక్కో బృందంలో రెవెన్యూ అధికారి, వ్యవసాయ అధికారి, గ్రామ రైతు సంఘం సమన్వయంతో సర్వే కొనసాగించాలని సర్కార్ నిర్ణయం తీసుకుంది. రైతుల సహకారంతో ఒక్కో గ్రామంలో నెల రోజులపాటు సర్వే నిర్వహించి వివాదరహిత భూముల రికార్డులను పక్కాగా సరిచేస్తారు. గ్రామ సభ ఆమోదంతో వాటిని ఆన్‌లైన్ చేసే ఒక్కో బృందం మూడు గ్రామాల్లో మూడు నెలల పాటు రికార్డుల ప్రక్షాళనా కార్యక్రమంలో పాలుపంచుకుంటాయి. భూముల సమగ్ర సర్వే, రిజిస్ట్రేషన్ల విధానంలో సంస్కరణలు, భూ రికార్డుల నిర్వహణపై కీలక చర్యలను అమలులోకి తెచ్చేందుకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పలు ఆదేశాలను జారీ చేశారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా తెలంగాణ అంతటా భూ రికార్డుల ప్రక్షాళన చేయాలని బుధవారం ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భూమి రికార్డుల నిర్వహణ, రిజిస్ట్రేషన్ విధానంలో పారదర్శకత, సరళత్వం ఉండాలని నిర్ణయించారు. కీలక అంశాలపై ప్రగతి భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ నెలాఖరు నాటికి రికార్డులన్నీ సరిచేసి ఆన్లైన్‌లో పొందుపర్చాలని సర్కార్ లక్ష్యంగా పెట్టుకున్నది. ఆ తర్వాతే ఈ లెక్కల ఆధారంగా రైతులకు పెట్టుబడి పథకం అమలు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా

➩ 2వ పేజీలో...

రైతు శ్రేయోభిలాషి కేసీఆర్‌కు సన్మానం



హైదరాబాద్: అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డుకు ఎంపికైన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సన్మానిస్తున్న వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, అధికారులు 10

అన్నదాతది అరిగోస

- వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతుది అప్పుల కూడే • వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు • భార్యకు చీర కొనలేని దుస్థితి • స్కూలు ఫీజులూ కట్టలేని దౌర్భాగ్యం • అప్పుల కోసం తిప్పలు • రైతుల దీనావస్థ మార్చేందుకోసం సర్కార్ ఆపన్నహస్తం • ప్రతి ఎకరాకు రూ. 8 వేలు: ముఖ్యమంత్రి కేసీఆర్

2 లో

ఓబీసీలకు కేంద్రం మరో వరం

వర్గీకరణకు పచ్చజెండా!

- క్రీమీలేయర్ పరిమితి పెంపు • త్వరలో కమిషన్ ఏర్పాటు • కేంద్ర మంత్రివర్గం ఆమోదం • వివరాలు వెల్లడించిన అరుణ్‌జైట్లీ



న్యూఢిల్లీ: మీడియాకు కేంద్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయాలు వెల్లడిస్తున్న ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తదితరులు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: దేశంలో వెనుకబడిన తరగతుల ప్రజలకు మేలు చేసే కీలక నిర్ణయం కేంద్ర మంత్రివర్గం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడి అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఓబీసీల వర్గీకరణకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఓబీసీలను వర్గీకరించేందుకు ఒక కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో అమలవుతున్న వర్గీకరణను జాతీయ స్థాయిలో అమలు చేసేందుకు కేంద్రం సంకల్పించింది. దీంతో వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రజలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు అనేక ఇతర రిజర్వేషన్ ఫలాలను సమానంగా అందుకునే వెసులుబాటు ఏర్పడనుంది. క్రీమీలేయర్

➩ 10వ పేజీలో...



6

త్వరలో మార్కెట్లోకి రూ. 200 నోటు?



6

ఇన్ఫీ చైర్మన్‌గా నందన్ నీలేకని

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణ

పెద్దపల్లిలో రసాభాస



పెద్దపల్లి: కుర్చీలతో దాడి చేసుకుంటున్న ఇరు పార్టీల శ్రేణులు

- కుర్చీలు విసురుకున్న తెరాస, కాంగ్రెస్ శ్రేణులు
- పోలీసులు రంగప్రవేశం... లాఠీచార్జ్...
- పోలీస్‌స్టేషన్‌లో మాజీ మంత్రి శ్రీధర్‌బాబు ధర్నా
- పోటాపోటీగా నినాదాలు.. పరిస్థితి ఉద్రిక్తం
- మిగిలిన జిల్లాలో ప్రజాభిప్రాయసేకరణ ప్రశాంతం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి పర్యావరణ అనుమతులకు సంబంధించి నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ రెండవ రోజు బుధవారం పెద్దపల్లి, యాదాద్రి జిల్లాల్లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీయగా, సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్, నల్గొండ జిల్లాల్లో ప్రశాంతంగా అధికారులు ఈ కార్యక్రమాన్ని పూర్తిచేశారు. పెద్దపల్లిలో ఏకంగా ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన కేంద్ర అధికారుల ఎదుటే తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస), కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాహాబాహికి దిగారు. ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకోవడంతో పరిస్థితి చేయిదాటింది. దీంతో పోలీసులు రంగప్రవేశంచేసి ఇరు వర్గాలను శాంతింపజేశారు. యాదాద్రి జిల్లా రాయగిరిలో

➩ 2వ పేజీలో...

హైదరాబాద్‌లో పేదల కోసం

టౌన్‌షిప్!

- 15 వేల కుటుంబాలు నివాసముండేలా బహుళ అంతస్థుల భవనాలు • మునిసిపల్ శాఖ కసరత్తు... రెండు మూడు నెలల్లో ప్రాజెక్టు పనులు ప్రారంభం • మలిదశలో రాష్ట్రవ్యాప్తంగా అమలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పేదల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరో వినూత్న పథకానికి శ్రీకారం చుట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన కసరత్తు శరవేగంగా జరుగుతోంది. దేశంలోనే తొలిసారిగా పేదల కోసం ప్రత్యేకంగా ఒక టౌన్‌షిప్‌ను నిర్మిస్తే ఎలా ఉంటుందన్న అంశంపై సమాలోచనలు చేస్తోంది. ఇప్పటికే పేదలకు ఉచిత డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళ నిర్మాణాలను చేపడుతూ ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ప్రభుత్వం ఆదర్శంగా నిలిచిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. అయితే ఉచిత డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళ నిర్మాణానికి హైదరాబాద్ వంటి పట్టణంలో స్థలం సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో తెరాస ప్రభుత్వం నగరంలో ఆశించిన స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్ళలేకపోతున్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రేటర్ పరిధిలో లభించేఖాళీ స్థలాలను దృష్టిలోపెట్టుకుని ఒకే చోట భారీ టౌన్‌షిప్

➩ 10వ పేజీలో...

తప్పుకుంటా... అనుమతించండి

9 లో

- ప్రధానమంత్రికి రైల్వే మంత్రి సురేష్ ప్రభు వినతి
- వేచి ఉండాలంటూ మోడి సూచన... • శాఖ మార్పు?



నంద్యాల ఉప ఎన్నిక

79 శాతం పోలింగ్!

7 లో



జగన్ వ్యాఖ్యలపై

ఈసీ ఆగ్రహం

7 లో

కేసు నమోదుకు ఆదేశాలు



ఏసీబీ వలలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్

- రూ. 3 కోట్ల మేర ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు గుర్తింపు
- హైదరాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో ఏకకాలంలో సోదాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల ఫుడ్ ఇన్‌స్పెక్టర్ బాపూజీ ఇళ్లలో ఏసీబీ సోదాలు చేసింది. ఆదిలాబాద్ పట్టణం ద్వారకానగర్‌లోని నివాసం, ఆహార భద్రత, ప్రమాణాల కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. రికార్డులను సీజ్ చేసి స్వాధీనం చేసుకుంది. అలాగే, హైదరాబాద్‌లోని సోమాజిగూడ, బండ్లగూడ, జాగీర్, మేడ్చల్‌లోని ఇళ్లలో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. సోమాజీగూడలోని ఇంట్లో రూ.2 లక్షల నగదు, 260 గ్రాముల బంగారం, అరకిలో వెండితో పాటు బండ్లగూడలో రూ.1.50 కోట్ల విలువైన విల్లా, మేడ్చల్‌లో వ్యవసాయ స్థలం, రెండు బ్యాంకుల్లో ఖాతాలతో ఒక లాకర్‌ను ఏసీబీ అధికారులు గుర్తించారు. ఏసీబీ డీఎస్పీ పాపలాల్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.



వెంకయ్య నిర్ణయాలకు

స్మృతి చెక్



- సమాచార ప్రసారాల శాఖలో ప్రక్షాళన • కీలక పదవుల్లో మార్పులు, గత కమిటీల రద్దు
- వెంకయ్య హయాంలో నిర్ణయాలపై పున:సమీక్ష • సెన్సార్ బోర్డులో మార్పులు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఏ శాఖలో ఉన్నా వివాదాలకు కేంద్ర బిందువుగా నిలుస్తారు. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో వివాదాలే ఆమెను ఆ శాఖకు దూరం చేశాయి. తాజాగా ఆమె సమాచార ప్రసారాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మరుక్షణం నుంచే సంచలన నిర్ణయాలతో మళ్లీ వివాదాలకు తెర లేపారు. నిజానికి జౌళి శాఖ మంత్రిగా ఉన్న స్మృతికి సమాచార ప్రసారాల శాఖను అదనంగా అప్పగించిన విషయం తెలిసిందే. త్వరలో జరిగే కేబినెట్ విస్తరణలో ఆమెను ఇదే శాఖలో కొనసాగిస్తూ, జౌళి శాఖను వేరే ఎవరికైనా అప్పగించే అవకాశం ఉంది. ఈ విషయంలో ఆమెకు

➩ 10వ పేజీలో...

వచ్చేనెల15 నుంచి భూముల లెక్క

(మొదటిపేజీ తరువాయి)

భూ రికార్డుల ప్రక్షాళనకు అవలంభించాల్సిన పద్దతులపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావు నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన అధ్యయన నివేదికను సీఎం కేసీఆర్ పరిశీలించారు. రికార్డుల సక్రమంగా ఉంటేనే రైతులకు పెట్టుబడి పథకం విజయవంతమవుతుందన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు.

సర్వే ఇలా...

- సెప్టెంబర్ 1నుంచి 9 వరకు గ్రామ రైతుసంఘాల సమన్వయ సమితిల ఏర్పాటు
- ఇందులో గ్రామంలోని వ్యవసాయ భూమి కలిగిన రైతులందరూ సభ్యులు
- 11 మందితో సమన్వయ సమితిల ఏర్పాటు
- సెప్టెంబర్ 10నుంచి 15 వరకు మండలస్థాయిలో సమితి సదస్సులనిర్వహణ
- సెప్టెంబర్ 15నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు భూ రికార్డుల ప్రక్షాళన
- 1100 యూనిట్లుగా విభజన
- 3600 బృందాలు, ఒక్కో బృందం మూడు గ్రామాలు
- గ్రామ సభ, రైతుల అంగీకారంతో భూ రికార్డుల ప్రక్షాళన
- ముఖ్యమంత్రితోపాటు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒక్కో యూనిట్‌కు బాధ్యులుగా ఉంటారు

ముందుగా వివాద రహిత భూములు...

ఈ సర్వేలో భాగంగా రాష్ట్రంలో 85నుంచి 95 శాతం వరకు ఎలాంటి వివాదాలు లేని భూములు ఉంటాయని ప్రభుత్వం అంచనా వేసింది. ముందుగా వీటి రికార్డుల ప్రక్షాళన చేస్తారు. పేరు మార్పిడిలు, క్రయ విక్రయాలు జరిగిన వివరాలను అధికారుల బృందం సేకరిస్తుంది. ఆ తర్వాత రికార్డులకు తుది రూపం ఇస్తారు. ఈ రికార్డులనే ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ఆ తదనంతరమే రెండో దశగా వివాదాస్పద భూముల జోలికి వెళ్లనున్నారు. ఆయా భూములకు పరిష్కార మార్గాలు చూపి, కోర్టు వివాదాలు, కోర్టు తీర్పులననుసరించియాజమాన్య హక్కులను నిర్ణయించాలని షెడ్యూల్‌గా ప్రభుత్వం నిర్ధేశించుకుంది.

అన్ని భూముల ప్రక్షాళన

- ఏటీఎం తరహాలో రికార్డుల పద్దతి
- కోర్ బ్యాంకింగ్ తరహా విధానం
- రిజిస్ట్రేషన్‌కు క్రయవిక్రయదారులు ఇద్దరూ వెళ్లాలి
- ఎమ్మార్వోకే రిజిస్ట్రేషన్ అధికారం
- సెప్టెంబర్ 15న పెద్దఎత్తున పాల్గొనండి:సీఎం కేసీఆర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా అన్ని రకాల భూములపై సమగ్ర నివేదిక రూపొందించి రికార్డులు సరిచేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. సెప్టెంబర్ 15నుంచి ప్రారంభమయ్యే భూ రికార్డుల ప్రక్షాళనలో రైతుల ఆధీనంలోని వ్యవసాయ భూములతోపాటు గ్రామాల్లోని అటవీ, ప్రభుత్వ, దేవాదాయ, చెరువుల, కుంటల కింది భూములు, ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగిస్తున్న భూమి, ప్రభుత్వ భవనాల కింద ఉన్న భూమి వంటి అన్ని రకాల భూముల వివరాలను సేకరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ భూముల వ్యవసాయేతర అవసరాల కోసం బదలాయింపు జరిగితే ఆయా వివరాలను, ప్రభుత్వం సేకరించిన భూముల వివరాలను, ప్రభుత్వ అసైన్డ్ భూమి వివరాలను కూడా నమోదు చేయాలని ఆయన సూచించారు. అసైన్డ్ భూముల్లో వ్యవసాయం చేసుకునే రైతులకు కూడా పెట్టుబడి పథకం అందజేయాలని నిర్ణయించారు. ఈ కసరత్తులో భాగంగా గ్రామ కంఠాన్ని కూడా నిర్ధారించాలని స్పష్టం చేశారు. మొదటి దశలో వివాదరహిత భూముల రికార్డులను సరిచేసి, రెండో దశలో మొత్తం తెలంగాణ భూభాగాన్ని సర్వే చేయించి కొత్త మ్యాపులు రూపొందిస్తామని వెల్లడించారు. రెవెన్యూ వ్యవస్థ ఆధునీకరణలో భాగంగా ఎప్పటికప్పుడు తెలంగాణ భూభాగంలో జరిగే మార్పులు వెంటనే నమోదయ్యేలా సాంకేతి పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ఆదేశించారు. '1932-36 మధ్య నిజాం రాజ్యంలో భూ సర్వే జరిగింది. అప్పటినుంచి మళ్లీ జరగలేదు. ఈ ఎనిమిది దశాబ్దాల కాలంలో అనేక మార్పులు సంభవించాయి. కానీ అవన్నీ సరిగ్గా నమోదు కాలేదు. అందుకే రికార్డుల నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. వివాదాలకు ఇదే కారణంగా మారింది. వ్యవసాయ, రెవెన్యూశాఖలవద్ద ఉన్న వివరాలకు పొంతన లేకుండాపోయింది. దీంతో ప్రభుత్వం అందించాలనుకున్న పెట్టుబడి ఏ ప్రాతిపదికన అందించాలో తెలియని పరిస్థితి నెలకొంది. పొరపాటు జరిగితే వేల కోట్ల కుంభకోణం అయ్యే అవకాశముంది. మంచి చేయబోతే చెడు అయ్యేలా ఉంది. అందుకే ఏ భూమి ఎవరిదో...పెట్టుబడి ఎవరికి అందాలో ఖచ్చితంగా తెలియాలి. అందుకే భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం తీసుకున్నాం' అని ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ కార్యక్రమ ఆవశ్యకతను స్పష్టం చేశారు.

రికార్డుల సరిచేత తర్వాత ఆన్‌లైన్‌లో భూమి రికార్డులు ఉండాలన్నారు. చిన్న మార్పుకూడా ఆన్‌లైన్‌లో తెలిసిపోయేలా ఉండాలన్నారు. ఇందుకు బ్యాంకులు అవలంభిస్తున్న కోర్ బ్యాంకింగ్ విధానం లాంటిదే భూ రికార్డుల్లో అనుసరించాలన్నారు. ప్రతీది పారదర్శకంగా ఉండాలని, ప్రతీ రెవెన్యూ కార్యాలయంలో రికార్డులసరిచేత, నిర్వహణకు కోర్ బ్యాంకింగ్ లాంటి వ్యవస్థను నడిపేందుకు ఒక్కో అధికారిని నియమిస్తామని చెప్పారు. ఇందుకోసం కొత్తగా రెవెన్యూ శాఖలో వెయ్యి మందిని నియమించాలని సూచించారు. ఎక్కువ సామర్థ్యం ఉన్న కంప్యూటర్లు, ఎక్కువ బ్రాండ్ విడ్త్ కల్గిన నెట్ కనెక్షన్ కల్పించనున్నట్లు వెల్లడించారు. రెవెన్యూ కార్యాలయాలన్నీ ఒకదానితో మరొకటి అనుసంధానం అవుతాయని కేసీఆర్ పేర్కొన్నారు. 'క్రయవిక్రయాలు జరిపే రైతులిద్దరూ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాలి...రిజిస్ట్రార్‌కు ఇద్దరి పాస్ పుస్తకాలు ఇవ్వాలి...కొనేవారి పాస్ పుస్తకంలో భూమిని చేర్చి, విక్రయించేవారి పాస్ పుస్తకంనుంచి రికార్డుల్లో భూమిని తొలగించాలి. రిజిస్ట్రార్‌లే ఆ రెండు పాస్ పుస్తకాలను కొరియర్ ద్వారా ఎమ్మార్వోకు పంపాలి. నాలుగు పనిదినాల్లో ఎమ్మార్వో క్రయవిక్రయాలకు సంబంధించి వివరాలను తన కార్యాలయంలో నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత పాస్ పుస్తకాల్లో పేరు మార్పిడి చేయాలి. తిరిగి రిజిస్ట్రార్‌కు పంపాలి. రిజిస్ట్రార్ వాటిని రికార్డుల్లో నమోదు చేసుకొని తిరిగి రైతులకు కొరియర్ ద్వారా పంపాలి. రైతులు ఒక్కసారి మాత్రమే రిజిస్ట్రార్ ఆఫీస్‌కు రావాలి. పాస్ పుస్తకాలు కొత్తవి ఇవ్వాలి. వీటిని నాణ్యతా ప్రమాణాలతో రూపొందించాలి. పాస్ పుస్తకాల సైజును తగ్గించేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ చట్టాలను మార్చాలి. వీలైతే ప్రతీ మండలానికి ఒక రిజిస్ట్రేషన్ కార్యాలయం, ఎమ్మార్వోకే రిజిస్ట్రేషన్ అధికారం ఇచ్చే అవకాశాలు పరిశీలించాలి' అని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ప్రభుత్వ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయకుండా నిషేధిత భూముల జాబితా తయారు చేయాలన్నారు. భూ రికార్డుల ప్రక్షాళన పెద్ద సవాల్. చాలా పీటముడులుంటాయి...కానీ చిత్తశుద్ధితో అసాధ్యం సుసాధ్యం చేయొచ్చు. రికార్డుల ప్రక్షాళన జరిగితే భూ దందాలు బంద్ అవుతాయి' అని పేర్కొన్నారు. భూ రికార్డులను సరిచేసే కార్యక్రమం సెప్టెంబర్ 15న పెద్ద ఎత్తున ప్రారంభం కావాలి. అన్ని మండలాల్లో ప్రారంభ కార్యక్రమం నిర్వహించాలి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా తలా మూడు గ్రామాలను తీసుకుని కార్యక్రమంలో స్వయంగా పాల్గొనాలి. నేను కూడా మూడు గ్రామాలను ఎంపిక చేస్తా. అందరూ క్రియాశీల పాత్ర పోషించాలి..ఇందుకు కొంతకాలం ఉద్యోగులను తాత్కాలిక పద్ధతిపై తీసుకుంటాం' అని సీఎం కేసీఆర్ తెలిపారు.



రైతుది అరిగోస

- వ్యవసాయం గిట్టుబాటుగా లేదు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: 'వ్యవసాయాన్ని మాత్రమే నమ్ముకున్న రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఏ మాత్రం గిట్టుబాటు కావడంలేదు. వారు బతకడమే గగనంగా ఉంది. భార్యకు మంచి చీర కూడా కొనలేని దౌర్భాగ్యం వారిది...పిల్లలకు స్కూల్ ఫీజులూ కట్టలేడు...వ్యవసాయాన్ని మాత్రమే నమ్ముకున్న రైతుల దురవస్థ...పరువు కోసం తెల్లబట్టలేసుకుని తిరుగుతారు, కానీ పరిస్థితి ఏమీ బాగుండదు..పంట సీజన్ వస్తే అప్పుల కోసం తిరగని చోటుండదు' అని సీఎం కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల దుస్థితిపై బుధవారం ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రగతి భవన్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన కీలక వ్యాఖ్యలు చేసి రైతు ఉద్ధరణకు ఏమి చేయాలన్న కోణంలో కీలక సిఫార్సులను చేశారు. అప్పులకు వడ్డీలు పెరిగి రైతు బతుకు భారమవుతోందని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆందోళన చెందారు. 'అయితే ఈ పరిస్థితినుండి రైతును గట్టెక్కించాలని ఎప్పటినుంచో ఆలోచిస్తున్నా..రైతుల కోసం ఏం చేయాలనేదానిపై చాలా మందితో మాట్లాడిన..చివరకు వ్యవసాయానికి పెట్టుబడి ప్రభుత్వమే సమకూరిస్తే రైతులకు తిప్పలు తప్పుతాయని నిర్ణయించాము...కాలం కలిసిరాక పంటలు పండకపో యినా రైతులు పెట్టుబడి కోల్పోయే ప్రమాదం ఉండదు...ఫ లితంగా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోరు. అందుకోసమే ప్రభుత్వం ఎంత వ్యయమైనా భరించి ప్రతీ ఎకరాకు ఏడాదికి రూ. 8వేల పెట్టుబడి ఇవ్వాలని నిర్ణయించుకుంది' అని సీఎం కేసీఆర్ పంటల పెట్టుబడిపై తన మనోగతాన్ని విశదీకరించారు.

నదీ జలాల్లో దిగువ రాష్ట్రాలకు అన్యాయం

- ఉమా భారతికి ఎంపీ నర్సయ్య గౌడ్ లేఖ



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: దిగువ రాష్ట్రాల పాలిట శాపంగా మారిన నదీ జలాల పంపిణీ విధానాన్ని సమూలంగా మార్చాలని భువనగిరి ఎంపీ బూర నర్సయ్య గౌడ్ అన్నారు. కర్ణాటకలో రిజర్వాయర్లు నిండుగా ఉన్నా తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లో ప్రాజెక్టులు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కేంద్ర జల వనరుల శాఖ మంత్రి ఉమాభారతికి లేఖ రాసిన బూర నర్సయ్య గౌడ్ ఆ వివరాలను మీడియాకు వివరించారు. ప్రస్తుత జల విధానంతో దిగువ రాష్ట్రాలకు నష్టం జరుగుతున్నందున ఆ విధానాన్ని మార్చాలని కోరారు. దిగువ రాష్ట్రాల అవసరాలు తీరే విధంగా చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తెలుగు రాష్ట్రాల జలాశయాల్లో ప్రస్తుత నీటి మట్టానికి సంబంధించిన గణాంకాలను కూడా లేఖలో ప్రస్తావించారు. ఎగువ రాష్ట్రమైన కర్ణాటకలో ఆలమట్టి ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 129 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 121 టీఎంసీలు ఉంది. అలాగే నారాయణ్‌పూర్ జలాశయంలో 37 టీఎంసీల సామర్థ్యానికి ఇప్పటికే 34 టీఎంసీల నీటి నిల్వలున్నాయని వివరించారు. అదే దిగువ రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీశైలం ప్రాజెక్టులో 215 టీఎంసీల సామర్థ్యానికి కేవలం 21 టీఎంసీల నీరు మాత్రమే ఉందని పేర్కొన్నారు. 312 టీఎంసీల సామర్థ్యం కల్గిన నాగార్జున సాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 115 టీఎంసీలు మాత్రమే నీరుందని, దిగువ రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతున్నాయని అన్నారు. ఈ అంశంపై త్వరలోనే ఉమా భారతిని కలిసి తెలంగాణ అవసరాల రీత్యా కనీసం 20 టీఎంసీల నీళ్లు విడుదల చేయాలని కోరతానని తెలిపారు.

మెడిసిన్ సంస్థ కోసం హర్షవర్ధన్‌తో భేటీ

ఉమా భారతికి లేఖ రాసిన బూర నర్సయ్య బుధవారం మధ్యాహ్నం కేంద్ర సైన్స్ మరియు టెక్నాలజీ శాఖ మంత్రి హర్షవర్ధన్‌ను కలిశారు. బీబీనగర్‌లో మంజూరైన ట్రాన్స్‌లేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడిసిన్ సంస్థ కోసం తెలంగాణా ప్రభుత్వం 35 ఎకరాల స్థలం కేటాయించినా పనులు ప్రారంభం కాలేదని కేంద్ర మంత్రికి తెలిపారు. ఈ స్థలానికి దగ్గరలోనే ఎయిమ్స్ రాబోతున్నందున, ఈ సంస్థ నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కోరారు. వెంటనే తన శాఖ కార్యదర్శితో పాటు సీసీఎంబీ డైరక్టర్‌తో సంప్రదించి న్యాయపరమైన చిక్కులు లేని స్థలమైతే వెంటనే నిర్మాణాన్ని ప్రారంభిస్తామని హర్షవర్ధన్ హామీ ఇచ్చారు.

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణ

పెద్దపల్లిలో రసాభాస

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ సైతం రసాభాసగా మారింది. తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ కొందరు రైతులు నిరసన వ్యక్తం చేయడంతో కాసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. తొలుత తమ అభిప్రాయాలను సేకరించాకే ఇతరుల నుంచి తీసుకోవాలని భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరగడం లేదంటూ ప్రభుత్వానికి, ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన సభ్యులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో రాయగిరి ప్రాంతంలో ఉద్రిక్త వాతా వరణం నెలకొంది. భూ నిర్వాసితులను సముదాయించిన యాదాద్రి కలెక్టర్ అనితా రామచంద్రన్ గ్రామాల్లోకి వచ్చి ప్రజాభి ప్రాయాన్ని సేకరిస్తానని భరోసా ఇచ్చారు. రైతులకు ఇచ్చే పరిహారం విషయంలో ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ప్రభుత్వం అందరికీ న్యాయం చేస్తుందని ఆమె హామీ ఇవ్వడంతో భూ నిర్వాసితులు వెనక్కి తగ్గారు.

తెరాస, కాంగ్రెస్ బాహాబాహీ

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పర్యావరణ అనుమతుల కోసం బుధవారం పెద్దపల్లిలోని రెడ్డి కళ్యాణ మండపంలో రైతుల నుంచి ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఇందులో మంథనికి చెందిన భూనిర్వాసితులు ఉప్పల శ్రీనివాస్ రెఫరెండం నిర్వహణపై రైతులకు, భూ నిర్వాసితులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తే నష్టం వాటిల్లుతుందని శ్రీనివాస్ అభిప్రాయం వ్యక్తంచేస్తున్న సమయంలో అక్కడే ఉన్న తెరాస శ్రేణులు ఆగ్రహంతో శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులపై దాడికి యత్నించారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు తమ కార్యకర్తలపై చేయి చేసుకునేందుకు వచ్చిన తెరాస శ్రేణులను అడ్డుకున్నారు. దీంతో ఇరు పార్టీల నేతల మధ్య మాటామాట పెరగడంతో అక్కడ పరిస్థితి చేయి దాటింది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరు వర్గాలను చెదరగొట్టారు. పెద్దపల్లి ఎంపి బాల్క సుమన్, మంథని ఎమ్మెల్యే పుట్ట మధు, పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఇతర నాయకులు అక్కడే ఉన్నారు. ఇరు వర్గాలను సముదాయించి శాంతింపజేసే ప్రయత్నం చేశారు. తమ పార్టీ కార్యకర్తలపై తెరాస నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపి చేయి చేసుకున్నారని ఆరోపిస్తూ శ్రీధర్‌బాబు, ఇతర నేతలు పెద్దపల్లి ఏసీపీ కార్యాలయంలోకి చొరబడి ఆందోళన నిర్వహించారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును బూచిగా చూపి జేబులు నింపుకునేందుకే తెరాస ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు.



శ్రీధర్ బాబును అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ప్రాజెక్టులకు తాము వ్యతిరేకం కాదని, అయితే రైతులకు, భూ నిర్వాసితులకు వారు ఆశించిన స్థాయిలో పరిహారం ఇవ్వాలన్నదే తమ అభిమతమని శ్రీధర్‌బాబు తెలిపారు.

ప్రాజెక్టులను అడ్డుకునేందుకు కాంగ్రెస్ కుట్ర

తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రాజెక్టులను నిర్మిస్తుంటే కాంగ్రెస్ పార్టీ వాటికి అడ్డు తగులుతోందని మంథని ఎమ్మెల్యే పుట్ట మధు దుయ్యబట్టారు. రైతులకు పరిహారం చెల్లించే విషయంలో సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారని ఆయన చెప్పారు. అనునిత్యం భూ సేకరణ, పరిహారం విషయంలో సీఎం కేసీఆర్ ఆలోచిస్తున్నారని దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకు వస్తోందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ప్రజాభిప్రాయం సేకరించేందుకు అధికారుల బృందం వస్తోందని ముందస్తుగానే కలెక్టర్ కార్యాలయం సమాచారాన్ని అందించిందని అయినా కాంగ్రెస్ పార్టీ నేతలు గొడవ సృష్టించేందుకు ఏదో ఒక విషయాన్ని ముందుకు తెచ్చి ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని మధు దుయ్యబట్టారు.

బల సమీకరణ కార్యక్రమంగా మార్చేశారు

సిఎల్‌పి ఉపనేత జీవన్‌రెడ్డి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణపై మాట్లాడుతూ ఈ సేకరణ తెరాస బలసమీకరణ కార్యక్రమంగా మారిందని చెప్పారు. తెరాస నేతలు బాధితులతో బలవంతంగా ఒప్పంద పత్రాలపై సంతకాలు పెట్టిస్తు న్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో ప్రభుత్వం భూ నిర్వాసితులకు నష్టపరిహారాన్ని తగ్గిస్తోందని ఆరోపించారు. అంచనాల పెంపు పేరుతో కాంట్రాక్టర్లక దోచి పెడుతున్న ప్రభుత్వానికి రైతులకు మేలు చేయాలన్న బుద్ధి ఎందుకు వస్తుందని ప్రశ్నించారు.

రాయగిరిలో..

యాదాద్రి జిల్లా రాయగిరిలో చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ కాసేపు ఉద్రిక్తతకు దారితీసింది. తాము అధికారులకు తమ అభిప్రాయాలను చెబుకునేందుకు వస్తే పట్టించుకోవడం లేదని కొందరు రైతులు, భూనిర్వాసితులు ఆందోళనకు దిగారు. తొలుత తమ అభిప్రాయాలను తీసుకోవాలని, ఆ తర్వాతే ఇతరుల నుంచి సమాచా రం సేకరించాలని డిమాండ్ చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. 2013 భూసేకరణ చట్టం మేరకు పరిహారం ఇవ్వాలని, తొలుత నిర్వాసితుల సంగతి తేల్చాకే పనులపై ముందుకు వెళ్ళాలని కొందరు రైతులు డిమాండ్ చేశారు.

నల్గొండ జిల్లాలో ప్రశాంతంగా ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. రైతులు, భూ నిర్వాసితులు వెలిబుచ్చిన అభిప్రాయాలను అధికారులు నమోదు చేసుకున్నారు. తాము ప్రాజెక్టులకు వ్యతిరేకం కాదని కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్వాసితులకు ఇస్తున్న ప్యాకేజీని ఇక్కడి నిర్వాసితులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ప్రశ్నిస్తే అరెస్టులా?

- శ్రీధర్‌బాబు, వేణుగోపాల్ అరెస్టు అక్రమం
- బాధితులతోనే అభిప్రాయ సేకరణ జరపాలి
- భేషరతుగా ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి
- మల్లు భట్టి విక్రమార్క డిమాండ్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన కేంద్రం బృందంను తప్పుదోవ పట్టించేందుకు టీఆర్ఎస్ సర్కార్ పథకం ప్రకారం గొడవలు సృష్టించిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ప్రాజెక్టు బాధితులు, నిర్వాసితులతో అభిప్రాయాలు సేకరించకుండా పెద్ద సంఖ్యలో టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వచ్చి తప్పుడు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నిస్తుండగా అడ్డుకున్న తమ కార్యకర్తలు,నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బుధవారం శాసనసభ మీడియా పాయింట్‌లో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. బాధితుల సమస్యలను వివరించేందుకు వెళ్లిన మాజీ మంత్రి డి శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌తో పాటు ఇతర నాయకులను పెద్దపల్లిలో అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆరోపించారు.

బాధితుల గొంతు నొక్కుతున్న సర్కార్: వంశీచంద్ రెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్టు బాధితులు తమ సమస్యలను చెప్పుకోనివ్వకుండా ప్రభుత్వం గొంతు నొక్కుతోందని ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టర్లకు మేలు చేసే విధంగా కేసీఆర్ సర్కార్ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎలాంటి డీపీఆర్‌లు లేకుండా ప్రాజెక్టులు నిర్మిస్తోందని విమర్శించారు.

అధికారం శాశ్వతం కాదు : పొంగులేటి

అధికారం శాశ్వతమని కేసీఆర్ సర్కార్ అనుకుంటోందని, అది శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డి వ్యాఖ్యానించారు. వినాశకాలే విపరీత బుద్ధి అంటారని, టీఆర్ఎస్ ప్రభుత్వం కూడా అలాంటి విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. ప్రజలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే వారి ఆగ్రహానికి కొట్టుకుపోతారని హెచ్చరించారు.

వంశీచంద్‌ను బచ్చా అంటారా ?

పాలమూరు -రంగారెడ్డి జిల్లాలకు అన్యాయం జరగకుండా చూడాలని ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి అంటే ఆయన్ను బచ్చా అంటారా ? అని టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రి జూపల్లి కృష్ణారావుపై మండిపడ్డారు. వాస్తవాలు మాట్లాడితే కుసంస్కారంతో మాట్లాడతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పర్యావరణానికి ముప్పు లేదు

- ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజాప్రతినిధులు, నిర్వాసితుల మనోగతం



కామారెడ్డి, కెఎన్ఎన్ : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితేనే రైతుల బతుకులు మారుతాయని, ఈ ప్రాజెక్టు వల్ల పర్యావర ణానికి ముప్పు లేదని, ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయాలని సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు, రైతులు ముక్తకంఠంతో ఏకభవించారు. బుధవారం కామారెడ్డి మండలంలోని దేవునిపల్లి గ్రామంలో గల శ్రీలక్ష్మిదేవి గార్డెన్‌లో నిర్వహించిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేస్తే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం తలపెట్టిన సమావేశానికి కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల నుండి ఎమ్మెల్యేలతో పాటు ప్రజా ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కాళేశ్వర ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితేనే అన్ని ప్రాంతాలు సస్యశామలం అవుతాయని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంతో ఎలాంటి పర్యావరణానికి ముప్పు లేదని ప్రాజెక్టు నిర్మిస్తే లాభం ఎక్కువగా ఉందని అందుకు అనుగుణంగా అధికారులు తమ నివేదికలు కేంద్రానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. రైతులందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ స్వయంగా ఒక ఇంజనీరుగా వ్యవహరించి కాళేశ్వర ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు సమావేశంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు కొనియాడారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుగానే భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాళేశ్వరంతో సస్యశ్యామలం



సంగారెడ్డి, కెఎన్ఎన్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సంగారెడ్డి జిల్లా, నారాయణఖేడ్ నియోజకవర్గ కేంద్రంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం బుధవారం జిల్లా కలెక్టర్ మాణిక్ రాజ్ కణ్ణన్ అధ్యక్షతన జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని 19వ పాకేజీ ద్వారా నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని హత్నూర, అందోల్, కల్హేర్, నారాయణఖేడ్ మండలాలకు సాగు, తాగు నీరు లభిస్తుందని కలెక్టర్ చెప్పారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడడంతోపాటు, సాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని, మత్స్యశాఖ, పరిశ్రమల అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఊతమిస్తుందన్నారు.

అభిప్రాయాన్ని వెల్లడించారు. విచక్షణా రహితంగా అడవులు నరికివేయడం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానిక శాసన మండలి సభ్యుడు ఫరీదొద్దీన్ పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న సంగారెడ్డి శాసనసభ్యుడు చింతా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంత ప్రజల జీవనశైలి మారడమే కాకుండా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని అభిప్రాయపడ్డారు. 13 జిల్లాల మీదుగా వెళ్లే ఈ ప్రాజెక్టు జైశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మెడిగడ్డ వద్ద ప్రారంభమై యాదాద్రి జిల్లాలోని గండమల, బస్వాపూర్ రిజర్వాయిర్‌లతో ముగుస్తుందని నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ చెప్పారు. జిల్లాలోని 38 గ్రామాల్లోసుమారు 35 వేల ఎకరాలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. జిల్లాలో సుమారు 243 ఎకరాల భూసేకరణ చేపట్టావలసి ఉండగా ఇప్పటికే 96 ఎకరాల భూ వివరాలను సేకరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈపిటిఆర్ఐ కవిత, తెలంగాణ విశ్రాంత ఇంజనీర్‌ల అసోసియోషన్ ప్రధాన కార్యదర్శి శ్యాం ప్రసాద్‌రెడ్డి, తెలంగాణ రైతు సమితి ప్రతినిధి రఘువేందర్‌రెడ్డితో పాటు జిల్లా జయింట్ కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, కాలుష్యనియంత్రణ మండలి ఇంజనీర్ బద్రేశ్, సంగారెడ్డి, నారయణఖేడ్ ఆర్డీవోలు,స్థానిక ప్రజా ప్రతినిధులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

లోధా నివేదికపై బీసీసీఐకి సుప్రీం వార్నింగ్

న్యూ ఢిల్లీ: భారత క్రికెట్ నియంత్రణ మండలి సంస్కరణ కోసం జస్టిస్ లోధా కమిటీ రూపొందించిన నివేదికను బీసీసీఐ అమలు చేయకపోవడంపై భారత సర్వోన్నత న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. తాము ఎన్నో సార్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, బీసీసీఐ అమలు చేయకపోవడం ఏంటని ప్రశ్నించింది. ఈ మేరకు బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరికి సుప్రీం కోర్టు నోటీసులు అందజేసింది. ఇప్పటివరకు లోధా కమిటీ సిఫార్సులను ఎందుకు అమలు చేయలేకపోయారన్న విషయాన్ని కోర్టుకు తెలియజేయాలని ఆదేశించింది. జస్టిస్ దిపక్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెల్లడించింది. కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సీఓఏ) ప్రకారం అమలు చేయాలని కోర్టు ఇదివరకే చెప్పిన విషయాన్ని న్యాయస్థానం గుర్తు చేసింది. సెప్టెంబర్ 19వ తారీఖులు లోపు వివరణ ఇవ్వాలని న్యాయస్థానం బీసీసీఐని ఆదేశించింది. డ్రాఫ్ట్ కాన్సిస్టిట్యూషన్‌ను రూపొందించాలని సీఓఏను కోరింది.

విజయ సోపానాలుగా లఘు చిత్రాలు

- ఒక్కో ప్రాధాన్యతా రంగానికి ఒక్కో డాక్యుమెంటరీ రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయం
- జాతీయ స్థాయిలో ప్రతిష్ఠ పెంచుతున్న పథకాలకు ప్రాధాన్యత
- ప్రతిష్టాత్మక కార్యక్రమాలు, కీలక నిర్ణయాలే హైలైట్
- త్వరలో కార్యాచరణ ప్రారంభించేందుకు మార్గదర్శకాలు
- జూన్‌లో లఘు చిత్రం విడుదల
- తదనంతర క్రమంలో ప్రజాక్షేత్రంలోకి సీఎం కేసీఆర్
- వచ్చే ఐదేళ్ల ప్రణాళికకు వ్యూహాత్మక కసరత్తు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆధునిక రాజకీయాల్లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ది అందెవేసిన చెయ్యి. సామాజిక సమస్యలపై తనకున్న పరిజ్ఞానంతో రుగ్మతలను రూపుమాపేందుకు చర్యలకు శ్రీకారం చుట్టారాయన. కొత్త పథకాలు, సరికొత్త కార్యక్రమాలతో సుపరిపాలనకు బాటలు వేస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో గడిచిన మూడేళ్లలో ఆశించిన ఫలితాలు సాధించగలిగారు. వచ్చే రెండేళ్ళ కోసం ప్రణాళికలు రచిస్తున్నారు. తాను నెలకొల్పిన పార్టీని అందలమెక్కించిన ప్రజలే తన నిర్ణేతలుగా భావిస్తున్న కేసీఆర్ సర్వవేళలా వారిని కలుపుకుని పోయే రీతిలో బృహత్తర దీర్ఘకాలిక కార్యాచరణకు రూపకల్పన చేస్తున్నారు. అందుకోసం ప్రధాని నరేంద్రమోదీ విధానాలను అవలంబిస్తున్నారు. అంతటే పరిమితం కాకుండా అధునంగా తన ఆలోచనలను సమ్మిళితం చేసి కొత్త తరహా పాలనకు బాటలు వేస్తున్నారు. స్థానిక, రాష్ట్ర, రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులను అనుగుణమైన రీతిలో రోడ్‌మ్యాప్ రూపొందించుకుంటున్నారు.

ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి అమలు చేస్తున్న కొన్ని ముఖ్యమైన పథకాలపై డాక్యుమెంటరీలు తయారు చేస్తున్నారు. వాటిని కేవలం ప్రజల్లోకి వదిలి ఊరుకోకుండా లబ్ధిదారులు ఇతర వర్గాల ప్రజలు చూసేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నది సీఎం కేసీఆర్ వ్యూహం. అందుకు గానూ ప్రగతి భవన్‌ను వేదికగా చేసుకుని అన్ని వర్గాల ప్రజలను అక్కడికి రప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని వారి అభిమతాలకు, ఆకాంక్షలకు తగిన విధంగా లఘు చిత్రాలను రూపొందించేపనికి శ్రీకారం చుట్టారు. ఒక్కో ప్రాధాన్యతా రంగానికి సంబంధించి ఒక్కో డాక్యుమెంటరిని రూపొందించ బోతున్నారు. జాతీయ స్థాయిలో ప్రభుత్వ ప్రతిష్టను పెంచుతున్న ప్రత్యేక పథకాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వనున్నారు. తెలంగాణ వెనకబాటు తనాన్ని తరిమికొట్టే విధంగా తాను తీసుకున్న కీలక నిర్ణయాలు, తదనంతర క్రమంలో అమలైన ప్రతిష్టాత్మక కార్యక్రమాలను హైలైట్ చేయబోతున్నారు.

ఈ వ్యూహాత్మక ఆలోచనలన్నింటినీ కార్యరూపంలోకి తీసుకురావడానికి త్వరలోనే చర్యలు ప్రారంభించ వలసిందిగా ఉన్నతాధికార యంత్రాంగానికి మార్గదర్శకాలు జారీ చేశారు. వచ్చే ఏడాది జూన్ మొదటివారం నుంచి లఘుచిత్రాలను ప్రాధాన్యతా క్రమంలో విడుదల చేయనున్నారు. ఈ డాక్యుమెంటరీలను గ్రామగ్రామాన ప్రదర్శించి, ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, వారినుంచి సలహాలు, సూచనలు స్వీకరించనున్నారు. వాటన్నింటినీ క్రోడీకరించి వచ్చే ఐదేళ్ల ప్రణాళికను రూపొందించ బోతున్నారు. ప్రస్తుతమున్న పథకాలకు మార్పులు, చేర్పులు చేయడం, కొత్త పథకాలను రూపొందించడం సీఎం మదిలో ఉన్న కొత్త ఆలోచనగా అనుయాయులు చెబుతున్నారు. తద్వారా ప్రజలు కోరిన విధంగా, వారి అభీష్టం మేరకు సంక్షేమ పథకాలను ప్రకటించి, అమలు చేసే వచ్చే రెండేళ్లలో రాష్ట్ర ప్రజల సర్వామోదాన్ని పొందాలని అభిలషిస్తున్నారు. అదే జరిగితే దేశంలో ఇలాంటి రోల్‌మోడల్‌ను అమలు చేసిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని ఆయన సన్నిహితులు అంటున్నారు. తదనంతర క్రమంలోనే ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టి రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం పట్ల తన చిత్తశుద్ధిని, నిబద్ధతను నిరూపించుకోవాలన్నది కేసీఆర్ మదిలో ఉన్న ఆలోచన.

రాజకీయ భవిష్యత్తుపైనా ముందుచూపు

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక పాలనపై తన సరికొత్త పంథాను నిరూపించుకుంటున్న చంద్రశేఖరరావు రాజకీయ భవిష్యత్తుపై రెండేళ్ళ ముందుగానే దృష్టికేంద్రీకరించారు. ఈ మూడేళ్ళ కాలంలో ప్రారంభించిన కొన్ని ప్రతిష్టాత్మక పథకాలు, చారిత్రాత్మక నిర్ణయాలతో ఇప్పటికే దేశంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఆయన వచ్చే ఇదేళ్ళ కోసం సరికొత్త విధానంతో ముందుకు సాగుతున్నారు. 2019లో జరుగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని విజయానికి వ్యూహాలు రచిస్తున్నారు. ఇప్పటికే ప్రతిపక్షాలు నోరెత్తడానికి వీల్లేకుండా చేసిన కేసీఆర్ సాధించిన ఫలితాలపై ప్రజల్లోకి వెళ్ళేందుకు సిద్ధమవుతున్నారు.

మోడీ విజయాలే సోపానంగా..

తన ఆలోచనలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జతచేసి అన్ని వర్గాల ప్రజల మెప్పు పొందేందుకు ప్రత్యేక డాక్యుమెంటరీలు, లఘు చిత్రాలకు రూపకల్పన చేస్తున్నారు. అందుకోసం ప్రధాని నరేంద్రమోడీ విజయాలకు దోహదపడిన అంశాలపై అధ్యయనం ప్రారంభించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు అనుసరించిన విధానాలను ఆదర్శంగా తీసుకుని రాజకీయ భవిష్యత్తు, రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్న ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నారు. తన పాలనకు దర్పణం పట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు భవిష్యత్తు ఆలోచనలను క్రోడీకరించి డాక్యుమెంటరీలు, లఘు చిత్రాల రూపొందించే పనిలో పడ్డారు.

నిరాదరణకు గురైన సందర్భాలే కీలకం

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం నిరాదరణకు గురైన సందర్భాలను, రాజకీయ కుట్రలను కూడా మలివిడత విజయానికి ఉపయోగించుకోనున్నారాయన. వ్యవసాయం, అనుబంధ రంగాలు, సంక్షేమ కార్యక్రమాల విస్తరణ, విద్యా, వైద్య రంగాలకు ఇస్తున్న ప్రాధాన్యత, పెట్టుబడులు, యువజనోపాధి అదితర రంగాల్లో సాధించిన విజయాలు, లబ్ధిదారుల అభిప్రాయాలు లఘు చిత్రాల్లో ప్రధానాంశాలు కాబోతున్నాయి. అందుకోసం ప్రభుత్వ ముఖ్య సలహాదారు డాక్టర్ రాజీవ్ శర్మ నేతృత్వంలో కసరత్తు జరుగుతోంది. సీఎం కేసీఆర్ మార్గదర్శకాల మేరకు కొన్ని కీలక శాఖల ముఖ్య కార్యదర్శులు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, సాగు, తాగునీటి అంశాలను హైలైట్ చేయబోతున్నారు.

ప్రజల్లోకి విజయ రహస్యాలు

వివిధ ప్రతిష్టాత్మక పథకాలు విజయవంతంగా అమలు చేయడానికి దోహదపడిన అంశాలపై డాక్యుమెంటరీలు తయారు చేస్తున్నారు. ఈ విధానంతో ప్రజల్లోకి వెళితే పరిపాలనపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలకు స్పష్టత రావడంతో పాటు మరింత మెరుగైన పసాలనను అందించేందుకు సలహాలు, సూచనలు పొందవచ్చునన్నది సీఎం కేసీఆర్ వ్యూహాత్మక ఆలోచన. అధికార వర్గాల ద్వారా విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు సుమారు 30 డాక్యుమెంటరీలు, మరో 20 లఘు చిత్రాలను రూపొందించేందుకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నారు. ప్రత్యేకమైన సామాజిక అంశాలను ఎంచుకుని డాక్యుమెంటరీలు తయారు చేయబోతున్నారు.

స్వయం ఉపాధి లక్ష్యాలే దర్పణం

అదే సమయంలో ప్రభుత్వ విజయాలకు దర్పణం పట్టిన కొన్ని ప్రాధాన్యత గల అంశాలను క్రోడీకరించి లఘు చిత్రాలను రూపొందించనున్నారు. శాశ్వత ప్రాతిపదికన ఉపాధి పొందేందుకు మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న చేయూత, వృత్తులను పరిరక్షిస్తూ తద్వారా గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు గొర్రెలు, మేకల పెంపకందార్లకు, పాడి రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలపై విస్తృత ప్రచారం చేయనున్నారు. అలాగే మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కళ్యాణ లక్ష్మి, ఒంటరి మహిళలకు సామాజిక భద్రత తదితర అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు.

వచ్చే బడ్జెట్ సమావేశాల నాటికి తుదిరూపం

సాంప్రదాయ జల వనరులు అంతగా లేని తెలంగాణ జిల్లాల్లో అవకాశాలపై అధ్యయనం చేసి, వాటిని ఉపయోగించుకుని మత్స్య పరిశ్రమను అభివృద్ధి చేస్తున్న అంశాన్ని కూడా ఎంచుకున్నారు. గరిష్టంగా నెల రోజుల్లోగా డాక్యుమెంటరీలు, లఘు చిత్రాలను రూపొందించేప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వాటిని ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, పార్టీ ప్రముఖులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే విడుదల చేయనున్నారు. వచ్చే ఏడాది శాసనసభ బడ్జెట్ సమావేశాల నాటికి వీటికి తుదిరూపం ఇవ్వాలన్నది కేసీఆర్ ఆలోచన. ఇప్పుడున్న పథకాలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు ప్రభుత్వానికి ఉన్న ముందుచూపు, ప్రజాదరణ పొందుతున్న సంక్షేమ కార్యక్రమాలను విస్తృత పరిచి తద్వారా మరింత ఎక్కువ మంది లబ్ధిదారులకు న్యాయం చేకూర్చే విధానంపై నరేంద్రమోడీ నిఘంటువును అనుసరించాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారు.

గుజరాత్ అభివృద్ధి విధానాలపై దృష్టి

నాడు గుజరాత్ రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై రూపొందించిన డాక్యుమెంటరీలు, షార్ట్ ఫిల్మ్‌లను తెప్పించుకుని పరిశీలిస్తున్నారు. నాడు మోడీ ఎన్నికల ముందు అవలంభిన విధానాలనే 2019లో కేసీఆర్ అవలంబించబోతున్నారు. ముఖ్యంగా పారిశ్రామిక ప్రగతిపై భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నారు. వ్యవసాయం, ఉద్యానవన రంగాలతో సమానంగా ఫ్లోరికల్చర్‌కు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. క్రాప్ కాలనీలు, హరితహారం కార్యక్రమాల ద్వారా భవిష్యత్తులో రాష్ట్రానికి చేకూరే లబ్ధిని, వ్యవగసాయ రంగం సస్యశ్యామలం కావడానికి దోహదపడే విధానాన్ని ప్రచారం చేయనున్నారు. మొత్తానికి ఒకవైపు ప్రచారం, మరోవైపు అవగాహన పేరుతో ప్రజల్లోకి వెళ్ళేందుకు సీఎం వ్యూహాత్మక కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నారు.



డంపింగ్‌యార్డులు, వైకుంఠధామాలను ఏర్పాటు చేయాలి



హైదరాబాద్, ఆంధ్రప్రభ రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో డంపింగ్‌యార్డు, వైకుంఠధామం ఏర్పాటు చేసే దిశగా సన్నద్ధం కావాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కార్యాలయంలో మంత్రి జూపల్లి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జూపల్లి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులతో పాటు మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, డంపింగ్‌యార్డులు, వైకుంఠదామాల నిర్మాణంపై చర్చించారు. వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డుల కోసం భూసేకరణను యుద్ధప్రాతి పదికన పూర్తి చేసి పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారు లను ఆదేశించారు. అలాగే పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించి సర్పంచులను ఎంపీడీఓలు సన్నద్ధం చేయాలన్నారు. గతంలో పోల్చితే ఉపాధిహామీ పనుల్లో వేగం పెంచగలిగామని, గత ఆర్థిక సంవత్సరంలో పూర్తిస్థాయిలో ఉపాధిహామీ నిధులను సద్వి నియోగం చేసుకోగలిగామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం కూడా ఉపాధి పనులు ఆశించిన రీతిలోనే సాగుతున్నాయని తెలిపారు. కొన్ని గ్రామాలు పూర్తిగా వెనకబడ్డాయని, అలాంటి గ్రామాలను గుర్తించి యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయాల్సిన అవసరముందన్నారు. ప్రతి మండలంలో వెనక బడిన రెండు గ్రామాల జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, కమి షనర్ నీతూప్రసాద్, అధికారులు జాన్‌వెస్లీ, రామారావు, ఆశ పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు మరో అవకాశం

నేడు డిప్యూటీ సీఎంతో దోస్తు అధికారుల సమావేశం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరడం కోసం దోస్తు ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మరోసారి వెబ్ ఆప్షన్లకు సర్కార్ అవకాశం ఇవ్వనుంది. 25 నుంచి 28 వరకు వెబ్‌ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం ఇవ్వనున్నారు. సీట్లు పొందిన వారు సెప్టెంబర్ 5లోపు ఆయా కాలేజీల్లో చేరడానికి అవకాశం ఇవ్వనున్నారు. వెబ్‌ఆప్షన్లలో సీటు పొందిన వారికి ఫీజురీయింబర్స్‌మెంట్ అవకాశాన్ని ఇవ్వనున్నారు. ఇప్పటికే మూడు విడతలుగా వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇచ్చిన సర్కార్ సీట్లు పొందిన వారికి కాలేజీల్లో చేరడానికి అవకాశం ఇచ్చింది. మూడో విడతలో సీట్ల కేటాయింపులో కొంత గందరగోళం జరగడంతోపాటు, దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికి ఏ కాలేజీలోనూ సీటు రాని వారు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే దరఖాస్తు చేసుకుని ఉన్న వారికి మరోసారి వెబ్‌ఆప్షన్లకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. దీంతోపాటు మూడో విడతలో సీట్ల కేటాయింపులో సీజీజీ సాంకేతిక లోపం కారణంగా మొదట సీట్లు పొందిన వారికి తరువాత కేటాయించిన సమయంలో సీట్లు పొందని వారు ఉన్నారు. వారితోపాటు ఇప్పటి వరకు సీటు పొందని వారికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోనుంది. వీటితోపాటుగా కోర్టుకు వెళ్లిన 28 కాలేజీల్లో మొదటి విడతలోనే సీట్లు పొందిన 4500 మందికి సీట్ల కేటాయింపుపై కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. వీటిపై గురువారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి కార్యాలయంలో దోస్తు కన్వీనర్ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్-1 ఆచార్య ఆర్ లింబాద్రితోపాటు దోస్తు అధికారులు, సీజీజీ అధికారులు పాల్గొంటారు. ఈ సమావేశంలో డిగ్రీ అడ్మి షన్లలో వచ్చిన అన్ని సమస్యలపై చర్చించి తగిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.




గాంధీలో గవర్నర్‌కు వైద్య పరీక్షలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రెండు తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ తాను చెప్పినట్టుగా గాంధీ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకున్నారు. గతంలో ఆయన కాలుకు గాయం కావడంతో పరీక్షలు చేయించుకోవడం కోసం బుధవారం గవర్నర్ గాంధీ ఆసుపత్రికి వెళ్లారు. సాధారణ వ్యక్తిలాగ ఓపి విభాగానికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. వైద్యులు ఆయనకు పరీక్షలు నిర్వహించి స్వల్ప శస్త్ర చికిత్స చేయాలని సూచించారు. కొద్ది రోజుల క్రితం గాంధీ ఆసుపత్రిలో ఐసీయుని ప్రారంభించిన సందర్భంగా తాను గాంధీ ఆసుపత్రిలోనే చికిత్స చేయించుకుంటానని చెప్పారు. అదే మాదిరిగా బుధవారం గాంధీ ఆసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకున్నారు. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగేలా వ్యవహారించాలనే ఉద్దేశంతో గవర్నర్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి.

నవంబర్ 1 నుండి రేషన్ షాపుల బంద్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రేషన్ డీలర్ల సమస్యల పట్ల ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా నవంబర్ 1 నుండి రాష్ట్రంలోని అన్ని రేషన్ దుకాణాలను మూసి వేయాలని తెలంగాణ చౌక ధరల దుకా ణాల డీలర్ల అసోషియేషన్ తీర్మానించింది. ఆల్ ఇండియా రేషన్ డీలర్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు నవంబర్ ఒకటి నుండి బంద్ నిర్వహణ పైన ఖైరతాబాద్‌లోని వాసవీ కేంద్రంలో కార్యవర్గం, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు సమావేశమయ్యారు. ఆల్ ఇండియా కమిటీ ఇచ్చిన బంద్ పిలుపును తెలంగాణలో కూడా విజయవంతం చేయాలని సమావేశం ఏకగ్రీవ తీర్మానం ఆమోదించింది. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు ఎం.డి. అజీజుద్దీన్, ప్రతినిధులు కృష్ణమూర్తి, సూర్య నారాయణమూర్తి, జ్యోతిందర్ సింగ్, వెంకటరమణ, శంకర్, శ్రీనివాసరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. రేషన్ డీలర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి, కనీస గౌరవ వేతనంగా రూ. 30 వేలు ప్రకటించాలి, డి.డి.లు కట్టడానికి వడ్డీలేని రుణాలు ఇవ్వాలి, రేషన్ డీలర్ల కుటుంబాలకు వర్తించే విధంగా ఆరోగ్య కార్డులు జారీ చేయాలి, ఇండ్లు లేని వారికి ఇండ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలి, సామూహిక బీమా వర్తింపచేయాలనే డిమాండ్లతో బంద్ పాటించ బోతున్నామని ప్రకటించారు.

చక్కెర ధరలు పెంచితే చర్యలు



నిబంధనలకు విరుద్ధంగా చక్కెర నిల్వ చేసి కృత్రిమ కొరతసృష్టించి ధరలు పెంచితే కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల కమి షనర్ సి.వి. ఆనంద్ చక్కెర వ్యాపారులను హెచ్చ రించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకంటే అధిక ధరలకు అమ్మకూడదని సూచిం చారు. లైసెన్స్ లేకుండా చక్కెర విక్రయించే వ్యాపారులపై దాడులు నిర్వహించాలని అధికారులను ఆదేశిం చారు. ఎవరైనా ఐదు క్వింటాళ్ల కంటే ఎక్కువ చక్కెర నిల్వలు ఉంచేవారిని చక్కెర డీలర్‌గా పరిగణించ బడతారని, వారు సంబంధిత జిల్లా పౌరసరఫరాల అధికారి, తహసీల్దార్‌ల దగ్గర హోల్‌సెల్, రిటైల్ లైసెన్సును తీసుకోవాలని, లేని పక్షంలో వారిపై నిత్యావసరాల చట్టం పరిధిలో చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో సి.వి.ఆనంద్ తెలియచేశారు.

పట్టణాభివృద్ధిపై దృష్టిపెట్టండి

మెప్మా రిసోర్స్ పర్సన్లకు మంత్రి కేటీఆర్ పిలుపు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పట్టణాల అభివృద్ధిలో మహిళల పాత్రలను మరింతగా పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. బుధవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. మెప్మా సంస్థ కింద పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్లు, కమ్యూనిటీ ఆఫీసర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ, మెప్మా కింద పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్ల(మహిళలు)సహకారంతో తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందిగా పట్టణాల్లోఅమలు చేస్తోందన్నారు. వీరి సేవలను మరింతగా ఉపయోగించుకునేందుకు త్వరలోనే మరిన్ని కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. రాష్ట్రంలోని పట్టణాల్లో నివసిస్తున్న పేదల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన పలు కార్యక్రమాలపైన, వారికి అందించాల్సిన సహాయ సహకారాలపైన మంత్రి వివిధ పట్టణాల నుంచి వచ్చిన రిసోర్స్ పర్స్‌లను అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కేసీఆర్ కిట్లు, హరితహారం బహి రంగ మలమూత్ర విసర్జన రహి తంగా పట్టణాలను ప్రకటించే కార్యక్రమం వంటివి క్షేత్ర స్థాయిలో అమలు జరుగుతున్న తీరుపైన రిసోర్స్ పర్సన్‌ల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. అలాగే పలు పురపాలికలు చేపట్టిన తడి, పొడి చెత్త కార్యక్రమాన్ని అమలు చేయడంలో అక్కడి పట్టణ ప్రజలను చైతన్య వంతం చేయ డంలో మెప్మా కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం మాతా శిశు సంక్షేమా నికి ప్రభుత్వ వైద్యా నికి అధిక ప్రాధా న్యత ఇస్తున్నదని, ఈ నేపథ్యంలో వ్యాక్సినేషన్, పౌష్టికాహార కార్య క్రమాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు వంటి వాటి పట్ల పట్టణ ప్రజల్లో మరింత అవగాహన పెంచా లని కోరారు.

పాపం.. పసి కందు

గోవిందరావుపేట, కెఎన్ఎన్ : అమ్మ పొత్తిళ్ల లో ఉండాల్సిన రెండు రోజుల ఆడశిశువు తనకు ఆర్థికంగా భారమవుతుందని వదిలి వేశారో.. లేక తాను చేసిన తప్పును వెక్కిరిస్తుందని వదిలించుకున్నారో తెలియదు కాని అభం శుభం తెలియని ఒక పసికందును రాక్షసంగా ఎవరూలేని సమయంలో మంగళవారం రాత్రి టాటా మ్యాజిక్ వాహనంలో వదిలివేసి చేతులు దులుపుకున్నారు. తన రోధనలు తనను కన్నవారికి పట్టవని రెండు రోజుల ఆ పసికందు రాత్రంతా ఎంతగా ఏడ్చిందో ఊహించుకోవచ్చు.

మంగళ వారం పస్రా హైస్కూల్ పక్కన గల్లీలో నిలిచిఉన్న టాటామ్యాజిక్ వాహనంలో రాత్రిపూట ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆడ శిశువును వదిలివెళ్లారు. తెల్లవారుజామున 5గంటలకు పాప ఏడుపు విన్న స్థానికులు పసి కందును చూడగానే నిర్ఘాంత పోయారు. ముక్కు పచ్చలారని ఆ ఆడ శిశువు ఏం పాపం చేసిందని, వదిలివేయడానికి ఆ తల్లికి చేతులు ఎలా వచ్చాయని, మానవత్వం లేని మానవ మృగా లుగా ఆపసికందును నడిరోడ్డుపై వదిలి వేయడానికి ఎలా సాహసించిందని ఆక్రోశం వెళ్ల గక్కారు. ఆడపిల్లగా పుట్టడమే ఆపసికందు చేసిన నేరమా, ఆడపిల్ల అంటే అంత చులకనా నేటి సమా జంలో కూడా ఆడపిల్లలపై ఎందుకంత చులకన అని తమ ఆవేదన వెలిబుచ్చారు. వెంటనే స్థానిక పోలీసులకు, ఐసీడీఎస్‌కు సమాచారం అందిం చగా అక్కడకు చేరుకొని పసికందును చేర దీశారు. ఈ విషయం ఆనోట ఈనోట వ్యాప్తించ డంతో పాపను చూడడానికి ప్రజలు తండోప తండాలుగా తరలివచ్చి తలకించారు. హృదయ విదారక ఈఘటనను చూసి ప్రజలు తల్లడిల్లి పోయారు. ఎస్సై మహేందర్, ఐసీడీఎస్ ఆశా కార్య కర్తలు పద్మ, మాధవిలు పసికందును వెంటనే పస్రాలోని జయ నర్సింగ్‌హోంకు తరలించి పాలు పట్టిం చారు. అనంతరం శిశు సంక్షేమ శాఖ అధికా రులకు అప్పగించారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని, ఈఘటనకు పాల్పడిన వారిని శిక్షించ డానికి చట్టాలు తేవాలని ప్రజలు కోరుతున్నారు.



చిన్నారిని సంబంధిత అధికారులకు అప్పగిస్తున్న స్థానికులు



ప్రేమజంట ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ , కెఎన్ఎన్ : పెద్దలు తమ ప్రేమను అంగీకరించరనే కారణంగా మనస్తాపంతో ఓ యువ జంట ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన వైనమిది. నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజిపేట మండలం ఇప్పల పల్లిగ్రామ శివారులో బుధవారం ఉదయం చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ ఓ యువజంటను పరిసర గ్రామస్తులు కనుగొని పోలీ సులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసుల దర్యాప్తు లో మృతులు తూడుకుర్తి గ్రామానికి చెందిన నాగరాజు (24), శృతి (20)గా గుర్తించారు. మృతుడు నాగరాజుకు ఇంతకు ముందే వివాహమై ఒక కుమారుడు ఉన్నాడని, అదే గ్రామానికి చెందిన శృతితో కొంత కాలంగా ప్రేమ వ్యవహారం నడుపుతున్నాడని ఈ విషయం పెద్దుకు తెలిస్తే సహించరనే కారణంగా మనస్తాపంతో ఇరువురు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమాని స్తున్నారు. ఆత్మహత్యకు పాల్పడే ముందు నాగరాజు తల్లిదండ్రులకు సూసైడ్ నోట్ లో తన మరణాంతరం తన కుమారుడు హ్రిత్విక్‌ను జాగ్రత్తగా చూసుకోవాలని ఉమా అంటే తనకు ప్రాణమని తల్లిదండ్రులు తనను క్షమించాలని పేర్కొన్నారు. పంచనామ అనంతరం మృత దేహాలను ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

మెరుగైన పనితీరుతోనే ఉత్తమ ఫలితాలు



ఆర్టీసీ కళాభవన్‌లో హైమైలేజ్ అవార్డులను ప్రదానం చేస్తున్న ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎండి జీవీ రమణారావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆర్టీసీ బలపడేందుకు ప్రయత్నిస్తున్నామని సంస్థ చైర్మన్ సోమారపు సత్యనారాయణ వెల్లడించారు. ఇటీవల తీసుకున్న చర్యలతో లాభాల్లో ఉన్న 5 డిపోల సంఖ్య 34కు పెరిగిందన్నారు. ఈ సంవత్సరం రూ. 120 కోట్ల నష్టాలను తగ్గించే ప్రయత్నం జరుగుతుందన్నారు. కొత్తగా 1200 గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. బుధవారం ఉదయం కళాభవన్‌లో జరిగిన హైమైలేజ్ అవార్డుల ప్రధానోత్సవంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావుతో కలిసి సోమారపు సత్యనారాయణ మెకానిక్‌లకు, సూపర్ వైజర్లకు ప్రోత్సాహక బహుమతులను అందచేశారు. డిసెంబర్ 2011 నుండి ఫిబ్రవరి 2017 వరకు 10 లక్షల కిలో మీటర్లు దాటిన 808 అశోక్ లేలాండ్ బస్సులను పరిగణలోకి తీసుకొని ఒక్కో మైలేజీని అధిగమించిన ఒక్కో బస్సుకు సంబంధించి రెండు బహుమతుల చొప్పున 1616 మంది కార్మికులు, సూపర్‌వైజర్లకు అవార్డులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ మాట్లాడారు. మెరుగైన పని సామర్థ్యంతోనే ఉత్తమ ఫలితాలను సాధించ గలమన్నారు. ఆర్టీసీలోని మొత్తం 8600లకు పైగా ఉన్న బస్సుల్లో 808 బస్సుల మైలేజ్ జీవిత కాలంను 10 లక్షల నుంచి 12 లక్షలకు పెంచడంలో కార్మికుల కృషిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో మిగతా రీజియన్‌లు కూడా అత్యధిక హైమైలేజ్ సాధించడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్యనిర్వాహక సంచాలకులు, అశోక్ లేలాండ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వజ్రా బస్సుల్లో టికెట్ల జారీ

వజ్ర బస్సుల్లో ఇక మీదట టాబ్ ద్వారా టికెట్ ఇచ్చే సదుపాయం కల్పించడం జరుగుతుందని రంగారెడ్డి రీజియన్ మేనేజర్ ఇ. యాదగిరి తెలిపారు.

ప్రకృతి సోయగాలతో బొటానికల్ గార్డెన్ అభివృద్ధి

అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ నరేందర్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వన సంపదను పరరిక్షిస్తూ బొటానికల్ గార్డెన్‌ను సర్వహంగుల్లో అభివృద్ధిపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన హరితహారం కార్యక్రమంలో భాగంగా పెద్దఎత్తున మొక్కలు నాటించి వాటి పరిరక్షణకు ప్రత్యేక చొరవ చూపుతున్నామన్నారు. పర్యావరణ, అటవీ, పర్యాటక శాఖల సంయుక్త భాగస్వామ్యంతో వన్యప్రాణుల సంరక్షణ, పర్యాటకులకు అవసరమైన వసతి సౌకర్యాల కల్పనపై దృష్టి కేంద్రీకరించామన్నారు. ఈ సందర్భంగా బుధవారం బొటానికల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మీడియాసమావేశంలో ఆయన మాట్లాడారు. అటవి అభి వృద్ధి సంస్థ ఆధీనం లో ఉన్న 274 ఎకరాల కొత్తగూడ రిజర్వు అటవీ ప్రాంతాన్ని హైదరాబాద్ మహా నగర ప్రజలు సహజసిద్ధ వనంగా భావిస్తున్నారని తెలి పారు. ఈ ప్రతిష్టను పరి రక్షిస్తూ నిత్యం పర్యాటకులు వచ్చిపోయే విధంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నా మన్నా రు. సైబరాబాద్ నగర పరిసర ప్రాంతాల నుంచి కూడా ఈ ప్రకృతి సోయగా లను ఆస్వా దించేందుకు అనేక మంది ఇక్కడికి వస్తుంటారని అన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
గురువారం 24 ఆగస్టు 2017

పాలకులు మారగానే కేసులు వెలవెల..

తొమ్మిదేళ్ళ క్రితం మహారాష్ట్రలోని నాసిక్ సమీపంలో మాలేగావ్‌లో సంభవించిన పేలుళ్ళ ఘటనలో నిందితులు ఒక్కొక్కరూ బెయిల్‌పై బయటికి రావడంతో ఈ కేసు నీరుగారినట్టేనన్న విశ్లేషకుల అభిప్రాయం నిరాధారం కాదు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ప్రసాద్ శ్రీకాంత్ పురోహిత్ తొమ్మిదేళ్ళ జైలు జీవితం గడిపి బెయిల్‌పై విడుదల అయ్యారు. ఈ కేసులో మరో నిందితురాలైన సాధ్వీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ గత నెలలో ఇదే మాదిరిగా విడుదల అయ్యారు. ఈకేసులో నిందితులంతా సంఘ్ పరివార్ సంస్థలతో సంబంధాలున్నవారు కావడం వల్లనే పూర్వపు యూపీఏ ప్రభుత్వం వీరిపై అక్రమంగా కేసులు బనాయించిందని అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న బిజేపీ ఆరోపించింది. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు తమ సానుభూతి పరులనూ, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ అధికారంలోకి వచ్చినప్పుడు లౌకిక వాద శక్తులను ఇలాంటి కేసుల నుంచి విముక్తం చేయడం పరిపాటి అయింది. కేసుల్లో నిజానిజాల సంగతి ఎలా ఉన్నా, రాజకీయంగా తమకున్న అధికారాన్నీ, పలుకుబడిని వినియోగించి కేసుల ను నీరుగార్చడానికి కూడా ఈ రెండు పార్టీలు అలవాటు పడ్డాయి. 2008లో సంభవించిన మాలేగావ్ పేలుళ్ళలో ఎనిమిది మంది మరణించారు. ఈ కేసులో యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఎటిఎస్) అధికారులు మొదట ఏడుగురు ముస్లింలపై కేసులు నమోదు చేశారు. అయితే, వారిపై మోపిన అభియోగాలు కల్పితాలని కింది కోర్టునిర్ధారించి వారిని విడుదల చేసింది. దాంతో ఇది హిందూ ఉగ్రవాదుల పనేనంటూ కొత్తగా చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ క్రమంలోనే సాధ్వీ ప్రజ్ఞాసింగ్, పురోహిత్‌లు అరెస్టు అయి జైలుకి వెళ్ళారు. ఎటిఎస్ అధిపతి హేమంత్ కర్కరే నేతృత్వంలో ఈ కేసును ఉగ్రవాద వ్యతిరేక దళం దర్యాప్తు చేసింది. హేమంత్ కర్కరే ముంబాయి దాడుల కేసులో లష్కర్ ఎ తోయిబా ఉగ్రవాదులతో హోరాహోరీగా పోరాడుతూ మరణించిన సంగతి తెలిసిందే. మహారాష్ట్రలో పేలుళ్ళు, దాడుల కేసుల్లో నిందితులంతా పాక్ కేంద్రంగా పని చేస్తున్న లష్కర్ ఎ తోయిబా సంస్థకు చెందిన వారేనని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఇంతలో సాధ్వీ, పురోహిత్‌లను ఈ కేసులో నిందితులుగా చార్జిషీట్‌లు దాఖలు చేయడం వంటి ప్రక్రియ అంతా పై నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం జరుగుతోందని అప్పట్లోనే బీజేపీ ఆరోపించింది. అలాగే, గుజరాత్ అల్లర్లలో భాగంగా జరిగిన విధ్వంస కాండ, మారణహోమాల సంఘటనలపై దర్యాప్తులన్నీ ప్రభుత్వాలు మారగానే నీరుగారి పోయాయి. గుజరాత్‌లో గానీ, మహారాష్ట్రలో గాని పేలుళ్ళు, అల్లర్ల సంఘటనల్లో మరణించిన వారంతా ఏ పార్టీకీ చెందని అమాయకులే. అటువంటి వారి ఉసురు తీసిన వారు ఏ మతం వారైనా, ఏ పార్టీకి చెందిన వారైనా శిక్షార్హులే. అలాగే, మృతుల కుటుంబాలకు పరిహారం అందిస్తామన్న పాలకుల వాగ్దానాలు ఏళ్ళూపూళ్ళూ గడిచినా నెరవేరడం లేదు.ప్రభుత్వాలు మారితే నిందితులు మారిపోవడం, చార్జిషీట్లు మారిపోవడం, అసలు జరిగిన సంఘటన పూర్వాపరాలే మారిపోవడం ఆధునిక రాజకీయ వైచిత్రి. ఇలాంటి పరిణామాల వల్ల చట్టాలపైనా, దర్యాప్తు సంస్థలపైనా ప్రజల నమ్మకం సడలుతోంది. కేసుల దర్యాప్తు, చార్జిషీట్‌ల దాఖలు వంటి ప్రక్రియ అంతా ఓ ప్రహసనంగా సాగుతోందన్న రామ్ జత్మలానీ వ్యాఖ్య నిరాధారం కాదు. అయితే, ఆయన కూడా అందుకు అతీతుడు కాడు.ఒక్కొక్కసారి ఉగ్రవాదుల పక్షాన కూడా వాదించేందుకు తయారవుతూ ఉంటారు. ఉగ్రవాదులు అన్ని మతాల్లో ఉన్నారనీ, వారికి మతం, ప్రాంతం లేదని ప్రవచించిన వారే ఈ విభజనలు చేయడాన్ని జనం అర్థం చేసుకోలేకపోతున్నారు. సమయానుకూలంగా సాక్ష్యాలు, చార్జిషీట్లు మార్చి నిందితులను కాపాడే ప్రయత్నాలు చేయడం వల్ల మొత్తం వ్యవస్థ మీదే నమ్మకం సడలిపోయే ప్రమాదం ఉంది. సిబీఐ ఇప్పటికే విమర్శల పాలైంది.ఇప్పటికీ అవుతోంది. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వారికి అనుకూలంగా చార్జిషీట్‌లు దాఖలు చేయడంలో సీబీఐ అధికారులు సిద్ధహస్తులయ్యారు. సీబీఐ మాజీ డైరక్టర్ రంజిత్ సిన్హాపై బొగ్గు కుంభకోణంలో కేసు నమోదు కావడమే ఇందుకు నిదర్శనం.. దర్యాప్తు సంస్థలు పాలకుల చేతుల్లో పాచికలుగా మారుతున్నాయని సిబీఐ ధోరణి రుజువు చేస్తున్నాయి. ఇప్పుడు మాలేగావ్ కేసులో నిందితులందరికీ బెయిల్ లభించడంతో కేసు నీరుగారిపోవడం ఖాయమన్న అభిప్రాయం జనంలో ఏర్పడింది.

విలీనం పరమార్థం అధికారం

తమిళనాట ముగియని మూడు ముక్కలాట





తమిళనాడులో వికె శశికళ అనుకూల, వ్యతిరేక వర్గాలుగా చీలిపోయి సభాపర్వంలో బలపరీక్షవరకు వెళ్లిన అన్నాడీఎంకె పార్టీలో ముఖ్యమంత్రి పళనిస్వామి, మాజీ ముఖ్యమంత్రి పన్నీరుసెల్వం వర్గాలు విలీనమయ్యాయి. జయలలిత ఆస్పత్రిలో చేరినప్పటినుంచి అన్నాడిఎంకె పార్టీలో మొదలైన సంక్షోభం రకరకాల మలుపులు తిరుగుతూ గత రెండేళ్లుగా ప్రజల్ని ఆకర్షిస్తూ వస్తోంది. జయలలిత మరణం తరువాత ఆమె వారసురాలిగా ప్రకటించుకున్న శశికళకు పోటీపడి మోకరిల్లిన పన్నీరుసెల్వం హఠాత్తుగా ఎదురు తిరగడం వెనక కారణం, ఆ తరువాత పళనిస్వామి శశికళను పక్కకు నెట్టి స్వతంత్రంగా వ్యవహరించడంలో ఆంతర్యం, మళ్లీ పన్నీరుసెల్వంతో జత కట్టడానికి సిద్ధపడటం వెనక రహస్యం ఒకటే. అదే అధికారాన్నీ, పదవులను రక్షించుకోవడం. వాటి మూలంగా మరో నాలుగేళ్లవరకు జయలలిత అడుగుజాడల్లో వీలైనంత సంపాదించుకోవడం. పార్టీలో చీలిక డీఎంకేలాంటి ప్రతిపక్షాలకు ఆస్కారమిచ్చి ప్రభుత్వం కూలిపోయే పరిస్థితి కొనితెచ్చుకోవడం రాజకీయ విజ్ఞత కాదనీ, పార్టీ కార్యకర్తలెవరు హర్షించరనీ, వచ్చే ఎన్నికల్లో పుట్టగతులుండవనీ అటు పన్నీరుసెల్వం ఇటు పళని సామి గ్రహించారు. అధికారాన్ని నిలుపుకోవాలంటే అభిమానాన్నీ, ఆత్మ గౌరవాన్ని ఒకింత త్యాగం చేయాలనీ పన్నీరుసెల్వం గ్రహించి విలీనానికి సిద్ధపడ్డారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ స్వీకరించడానికి ఒప్పుకున్నారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన నాయకుడు ఉపముఖ్యమంత్రి పదవికి ఒప్పుకోవడం విశేషమే. కానీ తప్పదు. పన్నీరుసెల్వం కంటే సంఖ్యా బలం ఎక్కువ ఉన్న పళనిస్వామి విలీనానికి ఎందుకు ఒప్పుకున్నారు? సెల్వం వెనక ప్రజలున్నారనా, పార్టీ బలం ఉందనా లేక ఈ రెండింటికంటే కేంద్రంలోని బిజెపి మద్దతుందనా? ఇవి రాజకీయ పండితులకు కూడా అంతుపట్టని ప్రశ్నలు.

శశికళ పట్ల చివరివరకు స్వామిభక్తి ప్రకటించి ఆమె అండతో ఇంత స్థాయికి ఎదిగిన పళనిస్వామి అటు మన్నార్‌గుడి మాఫియానూ, శశికళ పట్ల తన విధేయతను త్యాగం చేశారు. ఇందుకు ఒక కారణం శశికళ పట్ల ప్రజలలో పెరుగుతున్న వ్యతిరేకత. దాన్నుపయోగించుకుని డీఎంకే లాంటి పార్టీలు మళ్లీ తలెత్తే అవకాశాన్ని నివారించాల్సిన అనివార్య పరిస్థితి. అంతకుమించి బిజెపిని ప్రసన్నం చేసుకుని... కేంద్రం దయతో నిధులు సంపాదించి... ప్రజలలో మంచిపేరు తెచ్చుకుని మళ్లీ ఎన్నికలలో అధికారంలోకి రావాలనే కాంక్ష. కేవలం పదవుల కోసం జయలలిత ఆశయాలను మంటగలిపి, పార్టీని సర్వనాశనం చేశారనే అపవాదు భవిష్యత్తులో తమ మీద పడకుండా పన్నీరు సెల్వం, పళనిస్వామి ఈ సయోధ్యకు తప్పనిసరిగా ఒప్పుకోవలసివచ్చింది. అమ్మ ఆశయాల కోసం కలిసి మెలసి పనిచేస్తామని విలీన వేదికపై పన్నీరు సెల్వం, పళని సామి ప్రతిజ్ఞ చేసినట్లు ప్రకటించుకున్నారు. రాష్ట్రంలో అధిక శాతం ప్రజల మద్దతున్న అన్నాడీఎంకే పార్టీతో పొత్తుకు జయలలిత బతికున్నంత వరకు విఫల యత్నం చేసిన బిజెపి జయలలిత మరణించిన తరువాత అన్నాడీఎంకేను బలహీనపరచి తరువాత తామే పటిష్ట పరిచి చక్రం తిప్పుతోంది. విలీనం ఎప్పుడు జరగాలో... ఎలాంటి షరతుల మీద జరగాలో... కూడా బీజేపీయే నిర్ణయించింది. ప్రణాళికను అమలు పరచినట్లు విలీన ప్రక్రియ ఘట్టాలను పరిశీలించినవారికి తెలుస్తుంది. గత నెల పన్నీరుసెల్వం స్వయంగా ఢిల్లీ వెళ్లి పళని సామితో విలీనం గురించి వివరించినట్లు పత్రికలూ ప్రసార మాధ్యమాలు ప్రకటించాయి. మోడీకి అన్నాడీఎంకే విలీనానికి సంబంధం ఏమిటి? అలాగే విలీనాన్ని హర్షిస్తూ, అన్నాడీఎంకే నూతన ప్రభుత్వానికి కేంద్రం పూర్తి మద్దతు ఇచ్చి సహాయం చేస్తుందని మోడీ ట్వీట్ చేశారు. దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఇదే సమయంలో ఆంధ్రాలో వైసిపికి కూడా మద్దతిచ్చి తన ఆటను అక్కడ కూడా బిజెపి కొనసాగించవచ్చునని ఊహాగానాలకు తమిళనాడులో అది నిర్వహించిన పాత్ర ఊతమిస్తోంది. మూడు ముక్కలాట ముగిసినా శశికళ వర్గం ఆమెకున్న అర్థ బలం, ప్రభుత్వంలో ఇప్పటికీ ఆమెకున్న విధేయుల అండదండలు పన్నీరు, పళని లకు సవాలు విసరవనే హామీ ఏదీ లేదు. ఎందుకంటే, శశికళను పార్టీ నుంచి బహిష్కరించాలని నిర్ణయాన్ని 18 మంది శాసన సభ్యులు వ్యతిరేకిస్తూ విలీనం ఘడియలలోనే తిరుగుబాటు చేయడం ఇందుకు ఒకఉదాహరణ. అన్నాడీఎంకే వర్గాల విలీనాన్ని తమ వ్యూహానికి గొడ్డలిపెట్టుగా భావించిన శశికళ వర్గం ద్వారా పావులు కదపవచ్చునని తెలుస్తోంది.

రెండురోజుల క్రితం స్టాలిన్ , టిటివి దినకరన్ లండన్లో సమావేశమైనట్లు వచ్చిన వార్తలు డీఎంకే వ్యూహాన్ని వెల్లడించాయి. అందువల్ల ఈ 18మంది శాసన సభ్యుల కార్యకలాపాలతో మరో మూడుముక్కలాట తప్పదు. జయలలిత మరణంపై దర్యాప్తు, ఆమె నివాస భవనాన్ని స్మారక భవనంగా మార్చు, పార్టీ నుంచి శశికళ బహిష్కరణ అంటూ విలీనానికి పన్నీరుసెల్వం పెట్టిన ప్రధాన షరతులు. వీటికి పళని స్వామి ఒప్పుకోకపోవడంతో ప్రక్రియ ఆగింది. కానీ హఠాత్తుగా వీటిని ఎందుకు ఒప్పుకున్నారో అప్పుడు ఎందుకు కాదన్నారో కూడా అంతుపట్టని మన్నార్ గుడి రహస్యమే. రెండువర్గాల కలిస్తే పార్టీలోని ప్రభుత్వంలోని అస్థిరత్వం తొలిగి ప్రజలకు మనశ్శాంతి ఉంటుందనుకుంటే ఆ ఆశా కనిపించడం లేదు.

మొదటినుంచి సినిమాలతో ప్రభావితమైన తమిళ రాజకీయాలలో వాటికీ మించిన ఉత్కంఠభరితమైన సన్నివేశాలను ఆవిష్కరిస్తూ ప్రజల దృష్టిని ఆకర్షిస్తూనే వున్నాయి. ఇపుడు రజనీకాంత్, కమల్ హసన్ ప్రవేశంపై మళ్లీ వార్తలు గుప్పుమనడంతో అడుగడుగునా ఉత్కంఠ తప్పదు. అన్నాడీఎంకే వర్గాల విలీనాన్ని కమలహాసన్ హేళన చేస్తూ, వాళ్ళని జోకర్లగా పోలుస్తూ ట్వీట్ చేయడం, మరొకవైపు రజనీకాంత్ అభిమానులు ఆయన రాజకీయ ప్రవేశాన్ని ధ్రువీకరిస్తూ ప్రకటనలు చేయడంతో ఎవరు ఎటు వైపు.. ఎవరి వెనక ఎవరు..అనే ఊహాగానాలు కొనసాగుతూనే వున్నాయి. సమస్యల వలయంలో నోట్ల రద్దు, జీఎస్టీ విధానాలతో గందరగోళంలో పడ్డ ప్రజలకి రాజకీయాలు ఒకింత వినోదాన్ని కలిగిస్తున్నాయి. కొసమెరుపేంటంటే ఒకవైపు విలీనం ప్రకటన జరగుతున్న ఘడియలలోనే శశికళ బెంగుళూరులో ఒక విఐపిలాగా బయటకు వెళ్లి తిరిగి వస్తున్న వీడియో కథనం ప్రసారమైంది. ఇది ప్రజల్ని నివ్వెరపరచింది.మంగళవారం నాడు తమిళ రాజకీయాల్లో మరో ట్విస్టు. దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు 18మంది గవర్నర్‌ను కలుసుకుని, పళని సామి మంత్రివర్గానికి తాము మద్దతును ఉపసంహరించుకున్నట్లు లేఖ అందించారు. అవిశ్వాస తీర్మానం పెట్టాలని కూడా నిర్ణయించుకున్నారు. అవిశ్వాస తీర్మానమంటే మళ్ళీ బల నిరూపణలు, విడిది రాజకీయాలు, ఎమ్మెల్యేల కొనుగోళ్ళు.. తదితర పరిణామాలకు తావిచ్చినట్లే. అంటే మూడు నెలల క్రితం థ్రిల్లర్ సినిమాను తలపించిన దృశ్యాలు తమిళనాట మరోసారి కనిపిస్తాయన్న మాట. ఇక్కడ తేడా ఒక్కటే. వేదిక మారింది. గతంలో గోల్డెన్ బీచ్ రిసార్ట్సులోఎమ్మెల్యేలు సకలభోగాలనూ అనుభవిస్తే ఇప్పుడు అందుకు పుదుచ్చేరి రిసార్టులు వారిని అలరించనున్నాయి.

-ఎస్.వి. సూర్యప్రకాశరావు



వివిఎన్ ఆదిత్య.. వాడ్రేవు నాగేంద్ర ఆదిత్య.. అతి తక్కువ సమయంలో తెలుగు చలన చిత్ర రంగంలో తనకంటూ ఓ సుస్థిర స్థానాన్ని ఏర్పాటు చేసుకున్న దర్శకుడు. తీసినవి పది సినిమాలే అయినా చెరగని ముద్ర వేసుకున్నాడు. వివిఎన్ ఆదిత్య పేరు చెప్పగానే మొదట గుర్తొచ్చేది ఉదయ్ కిరణ్.. వీరిద్దరి కాంబినేషన్లో వచ్చిన మనసంతా నువ్వే సినిమా సృష్టించిన సంచలనం అంతాఇంతా కాదు. కష్టపడే తత్వమే ఆదిత్యను అనతికాలంలోనే మంచిపేరు తెచ్చిపెట్టింది. దర్శకుడంటే కచ్చితంగా మంచి రచయితే అయి ఉంటాడు కదా. ఆ కోణాన్ని వెలికితీసేదే ఆదిత్య హృదయం. వారం వారం ఆంధ్రప్రభ పాఠకులకు ప్రత్యేకం..

అందుకే! ప్రేక్షకుణ్ణి దేవుడంటాం!!

ఆంధ్రా వాడు, తెలంగాణా వాడు, అమెరికా వాడు, అరవవాడు, మళయాళం వాడు, సినిమావాడు అంటారు కానీ, లాయరు వాడు, డాక్టరు వాడు, ఇంజనీరు వాడు, సినిమా వాడు అనం. అంటే దీన్నిబట్టి ఏమర్థమౌతోంది? సినిమా అనేది వృత్తికన్నా అతీతమైంది. ప్రపంచంలోని అనేకప్రాంతాలలాగే అది మరోప్రాంతం. అంటే అది మరో ప్రపంచం. మన భౌతిక ప్రపంచంలోని రియాలిటీకి, మన ఊహ ప్రపంచంలోని సృజనని, భావుకతని, కల్పనని, ఊహని జోడించి కొంతమంది వెండితెర మీద సృష్టించే మరో ప్రపంచం సినిమా - సమాజం తన సౌలభ్యం కోసం ఈ మరో ప్రపంచాన్ని టూరిస్టు స్పాట్‌లాగా చేసి, ఆ టూర్‌కి ఒక టాకీసు కట్టి, టిక్కెట్టు పెట్టి, రెండున్నర గంటల చొప్పున రోజుకి నాలుగాటలుగా కుదించుకుంది. వినోద సాధనంగా, వాణిజ్యంగా దీన్ని పరిగణిస్తోంది. అయినా జన జీవితంపైన దీని ప్రభావాన్ని ఏమాత్రం ఆపలేకపోతోంది. అడవి రాముడై అలరించినా, శంకరాభరణమై సప్త స్వరాలు పల్లవించినా, శివమెత్తినా,



అల్లూరి సీతారామరాజై విప్లవాగ్నులు వెదజల్లినా, మన దేశం, వందేమాతరం అంటూ దేశభక్తి ప్రబోధించినా, దేవదాసై మత్తెక్కించినా, ఇదొక మాయాబజారు. పోతనని, వేమనని, శ్రీనాథుణ్ని, రాముణ్ని, కృష్ణుణ్ని, ఘరానా మొగుణ్ని, ఖైదీని, రౌడీని, మంచివాణ్ని, చెడ్డవాణ్ని, అపరిచితుణ్ని, జెంటిల్‌మేన్‌ని, పోకిరీలని, గబ్బర్‌సింగ్‌ని అందర్నీ మార్కెట్‌లో పెట్టి, ప్రేక్షకులు ఆడుకునే బొమ్మల్లా ఆప్షన్ ఇచ్చిన సూపర్ మార్కెట్ సినిమా. ఇందులో కాలానుగుణంగా, తరాలకనుగుణంగా, ప్రపంచీకరణలో మారుతున్న సాంకేతిక విజ్ఞానానికి అనుగుణంగా, ఈ సూపర్ మార్కెట్‌లో బొమ్మల రూపురేఖలు మారుతూనే ఉన్నాయి వందేళ్ళుగా. అలాంటి సినిమా వాడి మీద సమాజానికి ఉన్న హక్కు ఎప్పుడూ ఒక్కటే. వాడు సమాజాన్ని బాగు చేయక పోయినా పర్లేదు, వినోదాన్నిచ్చినా, విజ్ఞానాన్నిచ్చినా, కళలు, సంస్కృతుల సౌరభాలు వెదజల్లినా పర్లేదు. సమాజానికి అవాంఛనీయమైన పనులకి ప్రచారం కల్పించకుండా సమాజాన్ని పాడుచేయకుండా ఉంటే చాలన్న నియమం మాత్రమే. దానికి కట్టుబడి ఉన్నంతకాలం ఏ సోషల్ మీడియా అయినా, ఏ ప్రభుత్వమైనా, మనోభావాలున్న ఏ సంఘాలైనా, మహిళా సంఘాలైనా, మానవ హక్కుల కమిషన్లు అయినా, ప్రజలైనా, పత్రికలైనా సినిమా వాళ్లని ఏమీ చెయ్యవు, చెయ్యలేవు. మనం బాధ్యతగా ఉంటే ఎదుటివాడు హక్కుల్ని వాడలేడు. మనం బాధ్యతలు విస్మరిస్తే ఎదుటివాడు వాడి హక్కుల్ని గుర్తు తెచ్చుకుంటాడు. అరవవాడిని, మళయాళీని, బెంగాలీని, హిందీ హీరోయిన్లని, మరాఠీ విలన్లని నెత్తిన పెట్టుకున్న తెలుగు ప్రేక్షకుడు ప్రత్యేకించి తెలంగాణ కళాకారుల్ని, సాంకేతికనిపుణుల్ని మాత్రం ఉద్దేశపూర్వకంగా తొక్కేశారన్న వాదన ఈ మధ్య పరిశ్రమలో బలంగా వినిపిస్తోంది. అది సరికాదు. ప్రేక్షకుడు, థియేటరు ఎక్కడుంటే సినిమా ప్రపంచంలోని ఏమూలకైనా వెళ్తుంది - వేళ్లూనుతుంది. అలా చూసుకుంటే, గత యాభై ఏళ్లుగా హైదరాబాద్ మినహాయించి, గ్రామీణ తెలంగాణా ప్రాంతాల్లో థియేటర్లు కట్టడం చాలా తక్కువ. ఇప్పుడు కొత్త రాష్ట్రం వచ్చాక అయినా, తెలంగాణ నిర్మాతలు, వ్యాపారులు, రాజకీయ నాయకులు ఊరికొక మంచి సినిమా హాలు నిర్మించే పని మొదలుపెడితే, తెలంగాణ సినిమా రెవెన్యూ పెరుగుతుంది. సహజంగానే ఆ డబ్బు ఆ ప్రాంతపు సినిమాని అభివృద్ధి చేస్తుంది. ఆంధ్రా సినిమా పెరిగింది కేవలం అందువల్లే. ఏళ్ల తరబడి ఏ ప్రభుత్వమైనా సినిమా వాళ్లని తమ విజిటింగ్ కార్డుగా వినియోగించుకున్నదే తప్ప సినిమా వాడికి ప్రభుత్వాలు చేయగలిగింది చాలా తక్కువ. వీలున్నప్పుడల్లా పన్నులు వడ్డించడం, రేట్లు పెంచి నడ్డి విరగ్గొట్టడం తప్ప. సినిమా వాడు వాడి ఆలోచనకాయకష్టంతోనే వాడు పెరుగుతుంటాడు. ప్రేక్షకుడి ఆరాధనా స్థాయిని బట్టే వాడు బలవంతుడో, బలహీనుడో అవుతుంటాడు. వాడికి రాజకీయాలు, ప్రాంతీయ భేదాలు, మతాల విద్వేషాలు, రాగద్వేషాలు ఇలా సమాజంలో ఉన్న మంచి, చెడులన్నీ ఆట వస్తువులతో సమానం. అవే వాడి కథా వస్తువులు, ముడిసరుకు కాబట్టి సినిమా వాణ్ని ప్రక్షాళన చెయ్యాలనుకోవడం వినోదాత్మకం. ఎందుకంటే సమాజాన్ని ప్రక్షాళన చేస్తే తప్ప వీడి ప్రక్షాళన సాధ్యం కాదు కాబట్టి. సమాజాన్ని ప్రక్షాళన చెయ్యాలంటే ఓటరుకి విజ్ఞతుండాలి, సినిమా వాళ్లని ప్రక్షాళన చెయ్యాలంటే ప్రేక్షకుడికి విచక్షణ ఉండాలి. అందుకే ఓటరుని మహాశయుడు, ప్రేక్షకుడ్ని దేవుడు అంటాం.

-వి.ఎన్.ఆదిత్య

ఆ వ్యూహం...చైనాకు గరళం



ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికా అనుసరించనున్న కొత్త వ్యూహాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఎన్నికల సందర్భంగా ఆయన దేశ ప్రజలకు ఇచ్చిన వాగ్దానానికి ఇది విరుద్ధంగా ఉన్నా, ఆఫ్ఘన్‌లో అమెరికా పిల్లిమొగ్గ వేసినట్టు కనిపిస్తున్నా, ఆసియాలో మారిన పరిస్థితులకు అనుగుణంగానే ట్రంప్ తన ఆలోచనను మార్చుకున్నట్టు కనిపిస్తోంది. పాకిస్తాన్‌ని అదుపు చేయడంతో పాటు మహామార్గం, ఆర్థిక నడవ నిర్మాణాల పేరిట తన ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి చైనా సాగిస్తున్న యత్నాలకు చెక్ పెట్టడమే ఆయన లక్ష్యంగా కనిపిస్తోంది.


ఆఫ్ఘనిస్థాన్‌లో సంకీర్ణ సేనల సంఖ్యను పెంచాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించ డం వ్యూహాత్మకమే కావచ్చు. ఆఫ్ఘన్‌లో తాలిబన్లు ఈ మధ్య కాలంలో బాగా పుంజుకున్నారు. ఇరాక్‌లోని మోసుల్ నుంచి తరిమి వేయబడిన ఐఎస్ ఉగ్రవాదులు ఆఫ్ఘన్, పాక్ సరిహద్దు ప్రదేశాల్లో తలదాచుకున్నారు. వారి ప్రోద్బలంతోనే తాలిబన్లు ఈ మధ్య చెలరేగి పోతున్నారు. ఆఫ్ఘన్ నుంచి సంకీర్ణ దళాలను ఉపసంహరించుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. అందుకు అనుగుణంగానే గత నెలలో ఆఫ్ఘన్‌లో తాలిబన్‌ల దాడిలో పలువురు మరణించారు. ఇదంతా వరుసక్రమంగానే జరుగుతున్నట్టు స్పష్టం అవుతోంది. సేనల ఉపసంహరణకు బదులు మరిన్ని సేనలను ఆఫ్ఘన్‌కు పంపాలని ట్రంప్ నిర్ణయించడం ముమ్మాటికీ పిల్లిమొగ్గే. అయితే, ఆఫ్ఘన్‌లో సేవా కార్యక్రమాలను అందించడంలో సాయపడుతున్న భారత్‌కు మరింత ప్రమేయం కల్పించాలని ట్రంప్ నిర్ణయించడంతో పాక్ అగ్గిమీద గుగ్గిలం అయింది. ఆఫ్ఘన్ సరిహద్దున ఉన్న తమ దేశానికి ప్రాధాన్యం ఇవ్వడానికి బదులు భారత్ ప్రమేయాన్ని కోరడమేమిటన్నది పాక్ గుర్రు. అంతేకాక, ఉగ్రవాదాన్ని అణచివేయడం కోసం గడిచిన పదహారు సంవత్సరాలుగా అమెరికా నుంచి కోట్లాది డాలర్ల సహాయం అందుకుంటున్న పాక్ ఆ డబ్బంతా ఉగ్రవాదులకు ఊతం ఇవ్వడానికే వినియోగిస్తోందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు కటువుగా ఉన్నా , అవి అక్షర సత్యం.అవి పాక్‌కి మింగుడు పడటం లేదు. పాక్ మాత్రమేకాక, దానికి మద్దతు ఇస్తున్న చైనాకు కూడా అవి అప్రియంగానే కనిపిస్తున్నాయి. ఆఫ్ఘనిస్థాన్‌లో సంకీర్ణ దళాల ఉనికి వల్ల పాక్ ఇబ్బందిగా భావించడం అర్థం చేసుకోదగినదే. ఈ విషయంలో చైనా నిరసన తెలపడం గుమ్మడికాయల దొంగ సామెత గుర్తుకు తెస్తున్నది. ఆక్రమిత కాశ్మీర్ ద్వారా ఆర్థిక నడవ నిర్మాణానికి వడివడిగా అడుగులేస్తున్న చైనాకు ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికా నేతృత్వంలోని సంకీర్ణ సేనలు మరింతగా పెరగడం ఇబ్బందే. తన ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి చైనా వేస్తున్న ఎత్తుగడలకు ఇవి అవరోధమే. అమెరికా ఇంతవరకూ ఆఫ్ఘన్-పాక్ విధానాన్నిఅనుసరిస్తూ వస్తోంది. దాని వల్ల ప్రయోజనం లేకపోగా, సమస్య మరింత జటిలం అవుతోందని గ్రహించడం వల్లనే, భారత్‌ని కలుపుకుని పోవాలని ట్రంప్ నిర్ణయించారు. ఆఫ్ఘన్ పునర్నిర్మాణంలో భారత్ అందిస్తున్న పాత్ర గురించి ట్రంప్‌కి తెలుసు. అంతేకాదు, ఆఫ్ఘన్‌లో పునర్నిర్మాణ కార్యక్రమాల్లో పాల్గొంటున్న భారత్ స్వచ్ఛంద సంస్థల సభ్యులు తాలిబన్లు, హఖానీ గ్రూపు ఉగ్రవాదుల నుంచి తీవ్రమైన ప్రతిఘటనను ఎదుర్కొంటున్న సంగతి కూడా ట్రంప్‌కి తెలుసు. ఆ విషయాన్ని ఆయన పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సమక్షంలో నేబహిరంగంగా ప్రకటించారు. రియాద్‌లో రెండు మాసాల క్రితం ఉగ్రవాదంపై జరిగిన సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థల నుంచి భారత్ తీవ్రంగా నష్టపోతోందని ప్రకటించడంతో అదే వేదిక మీద ఉన్న నవాజ్ షరీఫ్ ఇరుకున పడ్డారు. ఆఫ్ఘనిస్థాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ తమ దేశంలో సంకీర్ణ సేనల సంఖ్యను పెంచాలన్న ట్రంప్ నిర్ణయాన్ని సమర్ధించగా, తాలిబన్లు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆఫ్ఘనిస్థాన్‌కి సొంత సైన్యం ఉన్నా ప్రజలకు రక్షణ కల్పించే సత్తాని పదహారు సంవత్సరాలైనా సంపాదించుకోలేకపోయిందన్నది సుస్పష్టం. తాలిబన్ల పాలన అంతమైన తర్వాత హమీద్ కర్జాయ్ నేతృత్వంలో అమెరికా నిలబెట్టిన కీలుబొమ్మ ప్రభుత్వం దాని వారసత్వంగా వచ్చిన అష్రఫ్ ఘనీ ప్రభుత్వం సంకీర్ణ సేనల అండతోనే రోజులు నెట్టుకొస్తున్నాయి. ఆఫ్ఘన్‌లో సంకీర్ణసేనలు శాశ్వతంగా కొనసాగడం వల్ల అమెరికాకు ఆర్థిక భారం తడిసిమోపెడు అవుతోంది. తాలిబన్ల దాడిలో సంకీర్ణ సేనలోని జవాన్లు అనేక మంది నేలకొరుగుతున్నారు. దీంతో దేశంలో తీవ్రమైన ప్రతిఘటన ఎదురవుతోంది. బుష్ అనాలోచితంగా జరిపిన దాడి కారణంగా అమెరికా తనకు సంబంధం లేకపోయినా, అనవసరపు భారాన్ని మోయాల్సి వస్తోందంటూ అప్పట్లో డెమోక్రాట్లు ఆరోపించారు. సంకీర్ణ సేనలను తగ్గిస్తామన్న వాగ్దానంతో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి బరాక్ ఒబామా అధికారంలోకి వచ్చి రెండు పర్యాయాలు ఆ పదవిలో ఉన్నా వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోయారు. ఒబామా తర్వాత అధికారంలోకి వచ్చిన ట్రంప్‌కి ఇది ఒక పెద్ద సవాల్‌గా పరిణమించింది. ఆయన కూడా ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆఫ్ఘన్‌లో సేనల సంఖ్యను తగ్గిస్తానని వాగ్దానం చేశారు కానీ, అది సాధ్యం కాదన్న విషయం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే తెలుసుకోగలిగారు. ఫలితంగానే ఆయన తాజా నిర్ణయాన్ని తీసుకున్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో సంకీర్ణ దళాలకు తాలిబన్ల కన్నా, హఖానీ గ్రూపు ఉగ్రవాదుల నుంచి పెను సవాల్ ఎదురవుతోంది. హఖానీ గ్రూపు ఉగ్రవాదులంతా పాక్‌లో తలదాచుకున్నారన్నది బహిరంగ రహస్యం. అందుకే, ఇటీవల కాలంలో ట్రంప్ తరచూ పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం గురించి బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. ఇప్పుడు ట్రంప్ ప్రకటించిన నూతన విధానం గతంలో ఒబామా ప్రకటించిన విధానానికి పూర్తిగా భిన్నమైనది. అమెరికా విజేతగా నిలవాలి, అమెరికా సత్తా ఏమిటో లోకానికి తెలియాలి అని అధికారంలోకి రాకముందునుంచి అంటున్న ట్రంప్ అందుకు తగినట్టుగానే ఇప్పుడు ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. అదే సందర్భంలో తన వాగ్దానాన్ని నిలబెట్టుకోలేకపోతున్నందుకు అమెరికన్లకు సారీ చెప్పిన రీతిలో ఆయన ప్రకటన చేయడం గమనార్హం. అమెరికన్ల నిరాశానిస్పృహలను నేను అర్థం చేసుకోగలను కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా గెలవాలంటే సంకీర్ణ సేనల సంఖ్యను పెంచక తప్పదంటూ ఆయన తన ప్రకటనను ముగించారు. భారత్‌కి ప్రమేయం కల్పించడం సమంజసమేనన్నది ఆయన అభిప్రాయం. ఎన్నో కష్టాలకోర్చి భారత్‌కి చెందిన సహాయక సంస్థలు అందిస్తున్న సాయాన్ని ఎలా మరవగలం అని ఆయన అన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలకు స్వర్గధామంగా మారిందంటూ ట్రంప్ పదేపదే వ్యాఖ్యానించడం భారత్ వాదాన్ని సమర్ధించినట్టయింది. అది కూడా పాక్, చైనాల ఆగ్రహానికి కారణం అయింది. అంతేకాక, చైనా నిర్మిస్తున్న మహామార్గాన్ని అడ్డుకుంటున్న భారత్‌కి అగ్రరాజ్యం అండ దొరికినట్టయిందని చైనా ఆందోళన చెందుతోంది. ఆఫ్ఘనిస్థాన్‌లో ఐఎస్ ఉగ్రవాదుల స్థావరాలు ఉన్నట్టు అమెరికా కూడా గుర్తించింది. సంకీర్ణ సేనల సంఖ్యను పెంచాలన్న ట్రంప్ నిర్ణయానికి ఇది కూడా ఒక ప్రేరణ కావచ్చు. ఆఫ్ఘన్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులను అదుపులో ఉంచడంతో పాటు చైనాకు చెక్ పెట్టేందుకు సంకీర్ణ సేనల సంఖ్య పెంపు దోహదం చేయవచ్చు.దీంతో అమెరికా జోక్యం మరింత పెరగవచ్చు. చైనా అసలు బెంగ అదే.

-ఎ.పి. స్వామి

నిజాయితీకి స్థానముందా?

తొమ్మిదేళ్ళలో 27సార్లు బదిలీ అయిన అధికారి

నిజాయితీపరులకు ఈ దేశంలో స్థానం లేదా? అదేంటి అనుకుంటున్నారా! అయితే బెంగళూరుకు చెందిన ఈ అధికారి కథనాన్ని కచ్చితంగా చదవాల్సిందే. మత్తయ్య బృహత్ బెంగళూరు కార్పొరేషన్‌లో కర్ణాటక అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ సీనియర్ అధికారి. అవినీతంటే ఆయనకు ఒళ్ళు మంట. ఎక్కడ అది కనిపించినా శివాలెత్తుతారు. ఫలితం తొమ్మిదేళ్ళలో 27 ట్రాన్స్‌ఫర్లు. తాజాగా ఆయన బెంగళూరు కార్పొరేషన్‌లో ప్రకటనలకు సంబంధించిన 2వేల కోట్ల రూపాయల కుంభకోణాన్ని బయటపెట్టారు. అవినీతి అధికారులపై ఆయన లోకాయుక్త తలుపు తట్టారు. ఆ అధికారులు మత్తయ్యను వేధించారు.. బెదిరించారు. అయినా తన పట్టు వీడలేదు. 11 నెలలుగా ఆయనకు కారు సౌకర్యాన్ని తొలగించారు. సైకిలుపై వెళ్ళి తన విధులను నిర్వర్తిస్తున్నారాయన. రోజుకు 80కిలోమీటర్ల పైనే తిరగాల్సొంటుంది. అధికార వర్గాలలో ఆయనకు ముక్కుసూటి మనిషని పేరుంది. 57 సంవత్సరాల వయసున్న మత్తయ్య గతంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేశారు. అనంతరం కర్ణాటక అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌లో చేరారు. ఫ్లాగ్‌షిప్ మిషన్, సకల మిషన్‌లకు అధికారిగా విధులు నిర్వర్తించారు. ఈ ఏడాది మే నెలలో మత్తయ్య చేసిన ఫిర్యాదు సంచలనాన్నే సృష్టించింది. సకల మిషన్ హెడ్ కల్పన నిధులను తన స్వీయ అవసరాల కోసం వినియోగించుకుంటున్నారని ఆయన లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో కల్పనను మిషన్ బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పించింది.మే నెలలో ఐఎఎస్ అధికారులు ఎమ్. లక్ష్మీనారాయణ, టికె అనిల్ కుమార్, ఐవి రమణా రెడ్డి అవినీతి చర్యలపై కూడా ఆయన లోకాయుక్తను ఆశ్రయించారు. 2014లో మాండ్యా డెవలప్మెంట్ అథారిటీలో పనిచేస్తున్న సమయంలో స్థలాల కేటాయింపులో అక్రమాలను బయటకు తెచ్చాడు. అప్పట్లో ఇది 300 కోట్ల రూపాయల అవినీతని తేలింది. ఈ కారణంగా ఆయనకు నాలుగు నెలల్లో ఆరుసార్లు బదిలీ అయ్యింది. నాలుగు నెలల పాటు జీతం కూడా చెల్లించలేదు. నిజాయితీకి ప్రతిఫలంగా ఇప్పుడు సైకిల్ ఆయన చేతికొచ్చింది. బెంగళూరులోని రాజనకుంటేలో ఉన్న కార్యాలయానికి ఆయన రెండున్నరగంటల పాటు 40 కిలోమీటర్లు సైకిల్ తొక్కి చేరుకుంటారు. ఉదయం 7గంటలకు ఇంట్లో బయలుదేరిన ఆయన కార్యాలయానికి చేరేసరికి 9.30 అవుతుంది. మత్తయ్య



తన నిరసనను సైకిల్ తొక్కడం ద్వారా నిశ్శబ్దంగా ప్రదర్శిస్తున్నారని మత్తయ్య మిత్రులు చెబుతుంటారు. ఇది నిరసనేనా అనడిగితే.. సైకిలంటే తనకిష్టమనీ, నిరసనలాంటిదేమీ కాదనీ ఆయన తోసిపుచ్చుతున్నారు. 11 నెలలుగా 30 వేల చొప్పున రవాణా బిల్లును చెల్లించకపోవడంతో సంబంధిత సంస్థ తనకు కారును తొలగించిందని అంగీకరించారు. నాకు వాహనాన్ని సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఆమేరకు ఉత్తర్వులు కూడా ఉన్నాయి. కానీ, ఇదిగో ఇలా సైకిల్‌పై వెళ్ళాల్సి వస్తోందంటూ అన్యాపదేశంగా చెప్పాల్సింది చెప్పేశారు మత్తయ్య. ఇలాంటి కోవలోకి మత్తయ్య ఒక్కరే కాదు.. మరికొందరు అధికారులు కూడా ఉన్నారు. మైసూర్ ల్యాంప్స్ ఎమ్‌డి ఎమ్.ఎన్. విజయకుమార్‌కు కూడా వాహనాన్ని సమకూర్చలేదు. కార్యాలయ ఆవరణలోకి కూడా ప్రవేశించనీయలేదు. ఫలితంగా కార్యాలయం బయటే సమావేశాన్ని నిర్వహించుకున్నారు. విజయ్‌కుమార్ పరిస్థితికి కారణం కూడా అవినీతిపరుల ఆటకట్టించాలనుకున్న ఆయన తత్వమే.1991 బ్యాచ్ ఐఎఎస్ అధికారి అశోక్ ఖేంకా తన 26ఏళ్ళ సర్వీసులో 50సార్లు బదిలీ అయ్యారు. సోనియా గాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా ఆస్తుల అక్రమ లావాదేవీలకు అనుమతించకపోవడమే ఖేంకా చేసిన తప్పు. ఈ ఉదంతాలు చదివిన తరవాత.. ఈ దేశంలో నీతిమంతులకు స్థానముందా? అనే అనుమానం రావడం లేదా?

-కె.వి.ఎస్

గంజాయి మత్తులో హైదరాబాద్ యువత

- గుట్టు చప్పుడు కాకుండా అక్రమ రవాణా
- కళాశాల విద్యార్థులే టార్గెట్..
- చైన్ సిస్టమ్‌లా కొనసాగుతున్న వైనం
- ఉక్కుపాదం మోపాల్సిందే...
- కింగ్‌పిన్‌లను పట్టుకుంటేనే సాధ్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: గంజాయి మత్తులో హైదరాబాదీ యువత జోగుతోంది. కళాశాల విద్యార్థులనే టార్గెట్ చేస్తూ పెద్ద మొత్తంలో విశాఖ నుంచి భాగ్యనగరానికి చేరుతోంది. రోడ్డు, రైలు రవాణా ద్వారా గంజాయి తరలింపు కొనసాగుతోంది. గంజాయి మత్తుకు అలవాటు పడ్డ నగర శివారులోని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులలో కొందరు గంజాయి విక్రేతలుగా మారుతున్నారు. గతంలో హైదరాబాద్‌లోని టోలిచౌక్‌లో ఓ ఇంట్లో గంజాయి మొక్కలను పెంచుతూ ఒకరు పోలీసులకు చిక్కాడు. విద్యార్థులు రహస్యంగా గంజాయి సేవనానికి బానిసలవుతున్నారు. ఓ చైన్ సిస్టమ్ మాదిరిగా ఈ గంజాయి నగరానికి సరఫరా అవుతోంది. విశాఖ కేంద్రంగా గంజాయి అక్రమ రవాణా కొనసాగుతోంది. అక్కడ్నించీ రైలు, రోడ్డు మార్గాల ద్వారా హైదరాబాద్‌కు చేరుతున్న గంజాయిని ఇక్కడి వారి ఏజెంట్లు దిగుమతి చేసుకుంటారు. కొంత గంజాయిని నగరంలో అమ్మేందుకు.. మిగతా గంజాయిని ఇతర రాష్ట్రాలకు రైళ్లలోనే తరలించడం జరుగుతుంది. ఎవరికీ అనుమానం కలగని రీతిలో గంజా యి అక్రమ రవాణా కొనసాగుతుండటం గమనార్హం. నగరంలో పలుమార్లు పోలీ సులు నిర్వహించిన దాడుల్లో పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడుతున్నా హైద రాబాదీ యువతకు గంజాయి లభ్యమవుతుండటం విశేషం. పోలీసుల కళ్లు గప్పి గంజాయి నగర ప్రవేశం చేస్తోందని అంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో సైతం గంజాయి సాగు జరుగుతోందని చెబుతున్నారు. ప్రధానంగా ఏపీలోని విశాఖ గంజాయికి స్థావరంగా మారిందన్నది సత్యమే. కాగా, ఇందుకు ప్రధానమైన సూత్రధారులు ఇప్పటివరకూ పోలీసులకు చిక్కకపోవడం విశేషం. గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని భాగ్యనగరానికి చేర్చడమే కాదు.. ఇతర రాష్ట్రాలకు రైలు మార్గాల ద్వారా ఇక్కడ్నించే తరలివెళుతోంది. గంజాయి అమ్మ కాలను కొన సాగించేది లేదని నియంత్రిస్తామని చెబుతున్నా అది ఆచరణ సాధ్యం కావడం లేదు. ఇటీవల కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో కొందరు విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు గంజాయి సేవనం చేస్తూ పోలీసులకు పట్టుబడ్డ సంగతి విదితమే. పకడ్బందీగా గంజాయి సాగుని కొనసాగనివ్వడమే కాదు.. అనుకున్న విధంగా తామనుకున్న ప్రాంతానికి గంజాయిని గుట్టు చప్పుడు కాకుండా తరలి స్తూనే ఉన్నారు. వ్యూహాత్మకంగా గంజాయి రవాణా సాగుతోంది. అంతా ఫోన్ల ద్వారానే ఈ వ్యవహారం కొనసాగుతోంది. నగరంలోని సికింద్రాబాద్ ప్రాంతంలోని లాడ్జీలలో ఏజెంట్లు బస చేస్తారు. సరుకు వస్తుం దన్న సమయానికి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుం టారు. అనంతరం ఇక్కడకు చేరుకున్న గంజాయిని ఇతర రాష్ట్రాలకు సునాయాసంగా తరలిస్తారు.



ఓఆర్ఆర్‌పై 300 కిలోల గంజాయి స్వాధీనం

ఓఆర్ఆర్‌పై రూ.30 లక్షల విలు వైన 300 కిలోల గంజా యిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వైజాగ్ నుంచి పటాన్‌చెరు తరలిస్తుండగా శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ వద్ద ఔట ర్ రింగ్‌రోడ్‌పై రెండు వాహనాల్లో తరలిస్తున్న 300 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నా రు. ఇక్కడ కూడా పోలీసుల కళ్లు గప్పేందుకు దుండగులు యత్నించారు. గంజాయిపై జొన్న విత్తనాలు పెట్టి తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం ప్రకారం పోలీసులు వాహనాలు తనిఖీలు చేసి గంజాయిని పట్టుకున్నారు. ఐదుగురు వ్యక్తులను అదుపు లోకి తీసుకుని విచారిస్తున్నారు.

వీరి వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నా రన్న కోణంలో శంషాబాద్ విమానాశ్రయ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే గంజాయి అక్రమ రవాణాపై పోలీసు నిఘా పెరగాల్సి వుంది. గంజాయి మత్తులో నిర్వీర్యమ వుతున్న హైదరాబాదీ యువతను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఆ దిశగా సంబంధిత అధికారులు కృషిచేయాల్సి ఉంది. గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలి. గంజాయి అక్రమ రవాణా వెనుక వున్న కింగ్‌పిన్‌ల గుట్టు రట్టు చేయాల్సి ఉంది. అప్పుడే గంజాయి అక్రమ రవాణాకు పూర్తిస్థాయిలో ఫుల్‌స్టాప్ పడినట్లవుతుంది. మరి ఆ దిశగా సంబంధిత అధికారులు ఏ మేర కృషి చేస్తారు? అనేది వేచి చూడాలి..!

ఉద్యానవనంకు జీఎస్టీ సెగ



అమరావతి, ఆంధ్రప్రభ : ఒకే దేశం.. ఒకే ప్రజ.. ఒకే పన్ను అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం విప్లవాత్మకంగా ప్రవేశపెట్టిన జీఎస్టీ వ్యాపార రంగానికే కాకుండా వ్యవసాయ రంగానికి కూడా సెగ తగిలింది. ప్రధానంగా జీఎస్టీ దెబ్బతో ఉద్యానవన రైతుకు అదనపు భారం ఏర్పడింది. దీంతో ఈ ఏడాది ఉద్యానవన సాగు మందగించింది. జీఎస్టీ తాకిడితో సంబంధిత శాఖాధికారులు లక్ష్యాలను చేరుకోడానికి ఇబ్బందులకు గురౌతున్నారు. రాష్ట్రంలో ఏడాదికేడాది రైతులు ఉద్యానవన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. రుతు పవనాల మందగమనం, జలాశయాలు నిండక పోవడంతో సాధారణ రైతులు ఉద్యానవన పంటలపై మక్కువ చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతియేటా ఉద్యానవన పంటల విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. వీరికి బాసటగా ప్రభుత్వం అనేక రాయితీలు కల్పించింది. ప్రధానంగా మైక్రో ఇరిగేషన్‌కు సంబంధించి సబ్సిడీలను అధికమొత్తంలో ఇవ్వడంతో రైతులు సూక్ష్మసేద్యం వైపు ఆసక్తి చూపుతున్నారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడులు సాధించేందుకు సూక్ష్మ సేద్యం దోహద పడుతుంది. ఈ సంవత్సరం కేంద్రప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రానికి ఇవ్వని విధంగా రూ.425 కోట్లను మంజూరు చేసింది. ఈ సంవత్సరం ఉద్యానవన శాఖకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఏడాది ఉద్యానవన శాఖకు రూ.1468 కోట్లు కేటాయించగా, అందులో మైక్రో ఇరిగేషన్‌కు అత్యధికంగా 1170 కోట్లు కేటాయించడం జరిగింది. దీనిబట్టి చూస్తే ప్రభుత్వం సూక్ష్మ సేద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇదిలా ఉంటే ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం జూన్‌లో జీఎస్టీని అమల్లోకి తీసుకొచ్చింది. తొలుత జీఎస్టీలో మైక్రో ఇరిగేషన్‌కు సంబంధించిన పన్నుల ప్రస్తావన తీసుకురాలేదు. ఐతే అనంతరం జరిగిన కౌన్సిల్ సమావేశంలో మైక్రో ఇరిగేషన్‌కు సంబంధించి వినియోగించే పరికరాలపై 18 శాతం పన్నును విధించడం జరిగింది. దీంతో అప్పటి వరకు వేగంగా జరుగుతున్న పనులు జీఎస్టీ సెగతో మందగించాయి. గతంలో మైక్రో ఇరిగేషన్ పరికరాలపై కొన్ని రాష్ట్రాల్లో వ్యాట్ టాక్స్ మినహాయింపు ఉండగా, మరికొన్ని రాష్ట్రాల్లో 2 శాతం పన్ను వసూలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 5 శాతం వ్యాట్ టాక్స్ కింద వసూలు చేసినా ప్రభుత్వం దాన్ని తిరిగి ఇచ్చేస్తోంది. అదేవిధంగా సెంట్రల్ ఎక్సైజ్ ఎక్సైజ్ డ్యూటీ 12.5 శాతం ఉంది. ఈ సుంకం కూడా 50 పరికరాలపైనే వసూలు చేశారు.

సాగర్ ఆయకట్టులో... ఖరీఫ్ ఖతం?!

- కర్నాటక దాటని కృష్ణమ్మ
- సాగుపై రైతుల్లో ఆందోళన
- ఆరుతడి పంటలే దిక్కంటున్న అధికారులు
- పరిస్థితి ఇలాగే కొనసాగితే తాగునీటికి కటకటే

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈ యేడాది కృష్ణమ్మ కర్ణాటకను దాటి రానంటోంది. కర్ణాటక ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పెంచుకోవడంతో వచ్చిననీరు వచ్చినట్లు వారే నిల్వ చేసుకున్నారు. గతేడాది జూరాలతో పాటు శ్రీశైలం కూడా దాదాపు నిండగా, ఈ ఏడాది జూరాలకే నీరు రాలేదు. ఫలితంగా నాగార్జునసాగర్ వెలవెల బోతున్నది. ఆయకట్టు రైతాంగం పరిస్థితి అయోమయంగా ఉంది. ఈనెలాఖరుకల్లా నీళ్ళు రాకుంటే నార్లు ముదురుతాయని, ఆలస్యంగా నాట్లు వేస్తే దిగుబడులు తగ్గుతాయని రైతాంగం ఆందోళన చెందుతోంది. ఈనేపథ్యంలో సెప్టెంబర్ లేదా అక్టోబర్ నుండి అవసరమైతే ఆయకట్టులో ముందస్తు రబీకి రైతులను సిద్ధం చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు యోచిస్తున్నారు. రుతుపవనాలు, తుపానుల వర్షాలుఆశాజనకంగా లేకపోవడంతో ఖరీఫ్ ఖతమైనట్లేనని, ఆరుతడి పంటలే దిక్కని అధికారులే చెబుతున్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టు కింద గతేడాది కూడా ఖరీఫ్ నిరుత్సాహ పరిచింది. ఈసారి పరిస్థితులు మెరుగవుతాయని ఆశించిన రైతన్నకు నిరాశే మిగిలింది.

నాగార్జునసాగర్ లెఫ్ట్ కెనాల్ ద్వారా నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లోని ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. నీరు లేక ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. మరోవైపు తాగునీటి సమస్య కూడా పొంచి ఉంది. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు కలిపి సాగర్ ద్వారా 3.8లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా, కనీస నీటిమట్టానికంటే తక్కువగా జలాలు ఉన్నాయి. పరిస్థితి మరింత ఘోరం. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 885అడుగులు కాగా, ప్రస్తుతం 778అడుగుల వద్ద 19.68టిఎంసిల నీరు నిల్వ ఉంది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు కాగా, ప్రస్తుతం 500.5అడుగుల వద్ద 116.10టి ఎంసిల జలాలు ఉన్నాయి. తాగునీటి కోసం రోజుకు 400క్యూసెక్కుల చొప్పున ఎస్ఎల్‌బిసికి విడుదల చేస్తున్నారు.



ప్రాజెక్టులు వెలవెల

వర్షాకాలం సీజన్ ముగింపునకు వచ్చిన నేపథ్యంలో కళకళ లాడాల్సిన ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీలతో వెలవెలబోతున్నాయి. ఎగువ నుండి ఇన్‌ఫ్లో లేకపోవడంతో జూరాల ఎడమకాల్వ పరిధిలోని ఆయకట్టు సాగు దారుణంగా పడిపోయింది. ఖరీఫ్‌లో 61,435ఎకరాల్లో వరి సాగవ్వాల్సిఉండగా, 10,681ఎకరాల్లోనే సాగుచేశారు. నారాయణపూర్ ప్రాజెక్టు నుండి జలవిద్యుత్ కోసం 15వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా, ఇందులో 6వేల క్యూసెక్కులను మించి నీరు దిగువకు రావడం లేదు. ప్రారంభంలో జూరాల ప్రాజెక్టులో 9.657టిఎంసిలు ఉండగా, కర్ణాటకలో కురిసిన వర్షాలు.. వరదలు వస్తాయన్న అంచనాలతో ప్రాజెక్టు నుండి నీటిని ఇతర ప్రాజెక్టులకు వదిలారు. కానీ అంచనాలు తల్లకిందులయ్యాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో 6.19టిఎంసిల నీరు మాత్రమే నిల్వ ఉండగా, 2577క్యూసెక్కుల వరద ప్రాజెక్టులోకి వస్తోంది.

ఏపీ సీఎం నియామకం పిటిషన్
మూడేళ్ల నుంచి ఏం చేస్తున్నారు?

- అంతా సవ్యంగానే జరిగింది
- పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : రాజ్యాంగంలోని ఆర్టికల్ 164 (1) ప్రకారమే రాష్ట్ర గవర్నర్ రెండు తెలుగు రాష్ట్రాల శాసనసభ్యులచేత ప్రమాణం చేయించి వారి నాయకులను ముఖ్యమంత్రులుగా నియమించారని ఉమ్మడి హైకోర్టు తేల్చి చెప్పింది. పిటిషనర్ మరీ ఆలస్యంగా కోర్టుకు రావ డాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీక రణ చట్టంలోని సెక్షన్ 19(3) ప్రకారం రెండు రాష్ట్రాల్లో శాసనసభలు అపాయింటెడ్ డేనాటి నుంచేఏర్పాటు అయిన ట్లుగా భావించాల్సి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనల మేరకు ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఇతర ఎన్నికైన సభ్యులు శాసనసభ్యులుగా ప్రమాణం చేయలేదని, ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడిని గవ ర్నర్ ప్రమాణం చేయించడం రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటిం చాలని కోరుతూ దాఖలైన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి మూడు సంవత్సరాల రెం డు నెలలు గడిచిందని హైకోర్టు గుర్తు చేసింది. ఇంత వరకు పిటిషనర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. ఇప్పుడు ముఖ్య మంత్రి ప్రమాణ స్వీకారం చెల్లదంటూ పిటిషన్ వేయడం న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడమే అవుతుందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.రజనిలతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు తీర్పును వెలువరించింది. ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు కొనసాగడాన్ని సవాలు చేస్తూ గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన న్యాయవాది, ఏపీ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.సూరిబాబు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.



ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ..2014 లో ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నికలు జరిగే సమయానికి రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ఉమ్మడి రాష్ట్రశాసనసభసుప్తచేతనావస్థలో ఉందంది. అటువంటి సందర్భంలో ప్రమాణ ప్రస్తావనే తలెత్తదని స్పష్టం చేసింది. సెక్షన్ 19 ప్రకారం శాసనసభ్యుల ప్రమాణం జరగలేదని పిటిషనర్ అభ్యంతరం వ్యక్తం చేయడం సమంజసం కాదని అభిప్రాయపడింది. ఈ వ్యాజ్యాన్ని కొట్టి వేస్తూ తీర్పును వెలువరించింది.



విదేశీ ఉద్యోగాల పేరిట కుచ్చుటోపీ

భాగ్యనగరంలో మరో కన్సల్టెన్సీ బాగోతం


హైదరాబాద్,ఆంధ్రప్రభ : నగరంలో మరో కన్సల్టెన్సీ బాగోతం వెలుగుచూసింది. విదేశాల్లో ఉద్యోగాల పేరిట ఓ ప్రైవేట్ సంస్థ సుమారు వంద మంది నిరుద్యోగులను నట్టేట ముంచింది. వివరా ల్లోకి వెళితే.. నగరంలోని ఎర్రగడ్డలోని సన్‌రైజ్ టూర్స్ అండ్ కన్సల్టెన్సీ విదేశాల్లో ఉద్యోగాల పేరిట నిరుద్యోగులకు వలవేసింది. ఆకర్షణీయమైన జీతం ఉంటుందని నమ్మబలికింది. కెనడా, జార్జియా తది తర దేశాల్లో ఉద్యోగా లిప్పిస్తామని పేర్కొంది. సదరు కన్సల్టెన్సీ నిర్వాహకులు మోసపూరిత మాటలకు ఆకర్షితులైన దాదాపు వంద మంది నిరుద్యోగుల నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష చొప్పున వసూలు చేసింది. ఆనక కాలయాపన చేస్తుండటంతో అనుమా నం వచ్చిన బాధితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయిం చారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జగన్ వ్యాఖ్యలు అభ్యంతరకరం



ప్రొద్దుటూరు, కె.ఎన్.ఎన్ : నంద్యాల ఉప ఎన్ని కల సందర్భంగా వైసిపి అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహ న్‌రెడ్డి వ్యాఖ్యలు అభ్యంతరకరంగా వున్నాయని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవా రం ప్రొద్దుటూరు రాయల్‌కౌంటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికలలో జగన్ మాట్లాడిన మాటలు అభ్యంతరకరంగా వున్నాయన్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేసిందని, 307 సెక్షన్ క్రింద నేరపూరిత వ్యాఖ్యలు, జగన్‌పై చర్య తీసుకోకపోతే సమాజం పతనం అవుతుందని విమర్శించారు. జగన్ మాటలు ఉన్మాది మాటల్లా వున్నాయన్నారు. ఆర్థిక నేరాలకు భారీ ఎత్తున పాల్పడి16 నెలలు జైలు జీవితం గడిపారని, ఇటువంటి వ్యక్తిని 6 సంవత్సరాల పాటూ రాజకీయ అనర్హుడిగా ప్రకటించాలని పేర్కొన్నారు. అనంతరం మంత్రి కాల్వ శ్రీనివాసులు నంద్యాల ఉప ఎన్నిక దురదృష్టకరమని, జగన్ మీడియాను దుర్వినియోగం చేశారని, 250 మంది జగన్ సొంత మీడియా విలేకర్లను నంద్యాలకు పంపి వైకాపా కార్యకర్తలుగా పనిచేయించారని, జగన్ పత్రికలో ప్రచురితమైన వార్తలు అవాస్తవమని పేర్కొన్నారు. అనంతరం మంత్రి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేసే అభివృద్ధి చూడకుండా కళ్లకు గంతలు కట్టుకొన్న గాంధారిలా జగన్ మాటలు వున్నాయని విమర్శించారు. మంత్రి అమరనాథరెడ్డి మాట్లాడుతూ నంద్యాల ఎన్నికలలో 25,000 నుండి 30,000 మెజార్టీతో తెలుగుదేశం పార్టీ గెలుపొందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మేడా మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మల్లెల లింగారెడ్డి తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చింత కిలో రూ. 250



వినాయకచవితి నేపథ్యంలో కొండెక్కిన ధరలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పండగలొస్తే చాలు.. కూరగా యల ధరలకు రెక్కలొస్తున్నాయి.. కొన్ని రకాలైతే దాదాపు రెండింతలు పెరుగుతున్నాయి. ఈ వినాయక చవితికి ఇదివరకు ఎన్నడూ లేనివిధంగా చింతకాయ ధర కిలో రూ.250కి చేరుకుంది. మొన్నటి వరకు పచ్చిమిర్చి, టమోటో ధరలు మాత్రమే పేద వర్గాలకు అందకుండా పోతే, రెండు, మూడు రోజులుగా అన్ని రకాల కూర గాయల ధరలు మంట మండుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.20 ఉన్న ఉల్లి ధర ప్రస్తుతం రూ.40 నుంచి రూ.50కి పెరిగిపోయింది. వినాయక చవితికి ప్రతి కుటుంబంలో చింతకాయ, తుమ్మికూర, ఉండ్రాళ్ళు తప్పనిసరిగా చేస్తారు కాబట్టి అందుకు అవసరమయ్యే వస్తువులన్నీ అమాం తంగా పెంచేశారు వ్యాపారులు. ఆ క్రమంలోనే నిన్నటి వరకు మార్కెట్‌లో కిలో రూ.50 పలికిన చింతకాయ నేడు ఐదింతలు పెరిగింది. పచ్చిమిర్చి కిలో రూ.60కి తగ్గడంలేదు. తీవ్రమైన కొరత ఉన్న టమోటోలు కిలో రూ.60 వెచ్చించి కొందామన్న దొరకని పరిస్థితి నెలకొంది. మిగతా అన్ని రకాల కూరగాయలు కూడా పేద వర్గాలు కొని తినలేని స్థాయిలో ధరలు పెరిగిపోయాయి.

జైళ్ల శాఖతో హిమాలయ డ్రగ్స్ కంపెనీ ఎంవోయూ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ జైళ్ళలో ఔషధ మొక్కల సాగు చేసేందుకు హిమాలయ డ్రగ్స్ కంపెనీ ఎంవోయూ కుదుర్చుకుంది. చర్లపల్లి ఓపెన్ జైలులోని ఐదెకరాల స్థలంలో ఔషధ మొక్కల పెంపకాన్ని చేపట్టనున్నారు. దీంతో ఖైదీలకు పునరావాసం కల్పించేందుకు హిమాలయ కంపెనీతో ఒప్పందం కుదిరింది. దశలవారీగా సంగారెడ్డి, నల్లగొండ, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జైళ్ళలో ఔషధ మొక్కల పెంపకం చేపట్టనున్నట్లు జైళ్లశాఖ ఐజీ నర్సింహా తెలిపారు. హిమాలయ కంపెనీ ఆధ్వర్యంలో ఔట్‌లెట్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

ఘనంగా బీఎస్ రాములు పుట్టినరోజు వేడుకలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ బీసీ కమిషన్ బీఎస్ రాములు 69వ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం హైదరాబాద్‌లో ఆయన కార్యాల యంలో భారీ ఎత్తున కవులు, రచయితలు, కుల సంఘాల నాయకులు బీఎస్ రాములును కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పలు కులసంఘాల నాయకులు కేకలను కట్ చేయించారు. శాలువాతో సన్మానించారు.

పుష్పమాలు, పుష్పగుచ్ఛాలు అందించారు. బీసీ కమిషన్ సభ్యులు డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, డాక్టర్ అంజనేయగౌడ్, జూలూరు గౌరిశంకర్, ప్రత్యేక అధికారి వనమాల చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి టి పద్మజ, పలువురు పాల్గొన్నారు.

ధైర్య సాహసాలే కేసరి బిరుదునిచ్చాయి

- టంగుటూరి ప్రకాశం జయంతి వేడుకల్లో రఘువీరారెడ్డి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ధైర్యానికి మారుపేరు టంగుటూరి ప్రకాశం అని, స్వాతంత్ర్యోద్యమంలో ఆయన చూపిన తెగువ వల్లే ఆయనకు ఆంధ్రకేసరి అనే బిరుదు ఇచ్చారని ఏపీసీసీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ రఘువీరారెడ్డి చెప్పారు. ప్రకాశం 146 వ జయంతి వేడుకలు బుధవారం ఇందిరాభవన్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ ఉపాధ్యక్షులు ఎం సూర్యానాయక్, ప్రధాన కార్యదర్శులు గిడుగు రుద్రరాజు, జంగాగౌతమ్, కె రవిచంద్రారెడ్డి, లీగల్ సెల్ కన్వీనర్ సుందరరామశర్మ, పార్టీ నేత అంబటి రామకృష్ణపాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రకాశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రఘువీరారెడ్డి మాట్లాడుతూ, న్యాయవాద వృత్తిద్వారా లక్షల రూపాయలు ఆర్జించే అవకాశం ఉన్నప్పటికీ, దేశం కోసం స్వాతంత్ర్యం పోరాటంలో పాల్గొన్నారని చెప్పారు. 1928 లో మద్రాసులో సైమన్ కమిషన్ బహిష్కరణ ఉద్యమంలోపాల్గొని బ్రిటీష్



సైనికుల తుపాకులకు ఎదురొడ్డి కాల్చమని సవాల్ విసిరినే ధైర్యశాలి అని కొనియాడారు.1942 లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు మూడేళ్లు జైలులో పెట్టారని చెప్పారు. 1952లో పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకై అమరణ నిరాహార దీక్షచేస్తూ మరణించిన తర్వాత ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డాక తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారని చెప్పారు.ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే విజయవాడ వద్ద ప్రకాశం బ్యారేజీ నిర్మాణం జరిగిందన్నారు.తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహావ్యక్తియని కొనియాడారు.

గోదావరి జిల్లాల్లో 'బెట్టింగ్' మూలాలు

కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి : క్రికెట్ బెట్టింగ్ మూలాలు గోదావరి జిల్లాల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నెల్లూరులో మొదలైన విచారణ ఇప్పుడు తూర్పుగోదావరికి పాకింది. నెల్లూరు జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల్తో పాటు ఇప్పటికేవిచారణ ఎదుర్కొంటున్న ఒక ఫంటర్ నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ లోని నెంబర్ల ఆధారంగా దీని మూలాలు తూర్పుగోదావరిలో ఉన్నట్లు గుర్తించారు. ఈ సమాచారాన్ని జిల్లా పోలీసులకు చేరవేయడంతో ఇక్కడ రహస్యంగా విచారణ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 17మందిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. వీరంతా ఒకే రాజకీయ పార్టీకి చెందినవారు. పైగా అదే పార్టీ నాయక డు, ఓ మాజీ ఎమ్మెల్యే కూడా ఈ వ్యవహారంలో ఉన్నట్లు పోలీసులు సందేహిస్తున్నారు.

అలాగే కాకినాడ కేంద్రంగా పనిచేస్తున్న పలు షిప్పింగ్ ఏజెన్సీల నిర్వాహకులు కూడా ఈ వ్యవహారంలో భాగస్థులైనట్లు తాజా విచారణలో తేలింది. బుధవారం రాత్రి నాలుగు షిప్పింగ్ ఏజెన్సీలపై పోలీసులు దాడులు జరిపారు. వార్నుంచి కొన్ని పత్రాల్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్ దీర్ఘకాలంగా జరుగుతోంది. ఇప్పటికే అనేక మంది బెట్టింగ్‌లో సర్వం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కొంతమంది రాత్రికి రాత్రే ఇందులో కోటీశ్వరులయ్యారు.

మరికొంతమంది ఈ సొమ్ముతో రాజకీయాల్ని కూడా శాసించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ దశలో నెల్లూరులో కదిలిన డొంకతో కాకినాడలో బెట్టింగ్ వ్యవహారం బైటకొచ్చేస్తోంది. ఇదొక్క కాకినాడకే పరిమితంకాలేదు. అమలా పురం, రాజమండ్రి, భీమవరం, ఆచంట, పెనుగొండ, కొవ్వూరు, అనపర్తి, పెదపూడి, రావులపాలెం తదితర ప్రాంతాల్లో కూడా జోరుగానే ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో విచారణను వేగవంతం చేశారు.

3 ఏళ్లలో గల్ఫ్‌లో 600 మంది మృతి

ఎన్ఆర్ఐ పాలసీని ప్రకటించాలి- సురేష్ రెడ్డి

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : గడచిన మూడేళ్లుగా గల్ఫ్‌లో 600 మందికి పైగా మరణించారని, వారి కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ స్పీకర్ కే ఆర్ సురేష్ రెడ్డి విమర్శించారు. ఒక్కో కుటుంబానికి 5 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ చైర్మన్ వినోద్ కుమార్‌తో కలిసి ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్ఆర్ఐ పాలసీ తీసుకువస్తామని గత జూలైలో ప్రభుత్వం ప్రకటించిందని, ఇంత వరకు ప్రకటన జరగలేదని విమర్శించారు. విదేశాల్లో ఉన్న తెలంగాణ వాసులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. గల్ఫ్ ఎన్ఆర్ఐల నుంచి ప్రభుత్వానికి 50కోట్లు పన్ను రూపంలో వస్తోందని చెప్పారు. అనారోగ్యంతోఉన్న వారికి సహాయంగా ఎవరైనా వెళితే వంద రియాజ్‌లు పన్ను కట్టాల్సి వస్తోందని తెలిపారు.

మాజీ మంత్రి శత్రుచర్లకు రూ.2.25 లక్షల జరిమానా

సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టేకు హైకోర్టు నో

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజుకు ఉమ్మడి హైకోర్టు రూ.2.25 లక్షల జరిమానా విధించింది. ఆ సొమ్మును నాలుగు వారాల్లో హైకోర్టు రిజిస్ట్రార్ (జుడీషియల్) పేరుమీద జమ చేయాలని హైకోర్టు ఆదేశించింది. శాసనసభ్యునిగా 1999 నుంచి 2004 వరకు పనిచేసిన కాలానికి, సమావేశాలకు హాజరైన ఒక్కో సిటింగ్ కు రూ.500 చొప్పున జరిమానా చెల్లించాలని శత్రుచర్లను ఆదేశిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జీ వెలువరించిన తీర్పుపై స్టే విధించేందుకు డివిజన్ బెంచ్ నిరాకరించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవి లతో కూడిన డివిజన్‌బెంచ్ బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. 1999 నుంచి 2004 వరకు నాగూరు ఎస్టీ శాసనసభస్థానానికి శత్రుచర్ల విజయరామరాజు పోటీ చేసి గెలవడాన్ని సవాలు చేస్తూ మాజీ శాసనసభ్యుడు నిమ్మక జయరాజు 1999లో హైకోర్టులో ఎన్నికల వ్యాజ్యం దాఖలు చేశారని, 2006లో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు శత్రుచర్ల కొండదొర కాదని, క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన వారని తేల్చి చెప్పింది. మరో వైపు తనకు కొండదొర (ఎస్టీ) సామాజిక ధ్రువపత్రం జారీ చేసేలా అధికారులను ఆదేశించాలని అభ్యర్థిస్తూ శత్రుచర్ల విజయరామరాజు దాఖలు చేసిన పిటిషన్ ను తోసిపుచ్చారు.



జియో ఫోన్ బుకింగ్ నేటి నుంచే

ముంబై : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రిలయన్స్ జియో ఫీచర్‌ఫోన్ బుకింగ్ ఆగస్టు 24 సాయంత్రం ఐదు గంటల నుంచి మొదలవుతుందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. అయితే ఫోన్ ఉచితంగా లభిస్తుంది. దీనికి కొనుగోలు చేయాలంటే రూ.1,500 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది తర్వాత ఈ మొత్తం రీఫండ్ లభిస్తుంది. అటు నుంచి నెలకు రూ.153 చెల్లించాల్సి ఉంటుంది. జియో ఎవరు ముందు బుక్ చేసుకుంటే వారికే ముందు అనే పద్ధతిలో ఫోన్లు విడుదల చేస్తుంది. ఈ ఫోన్‌లను ఆన్‌లైన్ ద్వారా లేదా ఆఫ్ లైన్ చానల్స్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. ఆఫ్‌లైన్ చానెల్ అంటే జియోకు చెందిన రిటైలర్స్, మల్టీ బ్రాండ్ డివైజ్ రిటైలర్లు, రిలయన్స్ డిజిటల్ స్టోర్ నెట్‌వర్కులలో కూడా బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఆన్‌లైన్ చానల్ విషయానికి వస్తే మై జియో యాప్‌తో పాటు కంపెనీ వెబ్‌సైట్ జియోడాట్‌కామ్ ద్వారా ముందస్తు ఫోన్ బుక్ చేసుకోవచ్చు.

ముందుస్తు బుకింగ్ చేయాలనుకునే వారు రూ.500 చెల్లించి బుక్ చేసుకోవచ్చు. తర్వాత ఈ మొత్తాన్ని సర్దుబాటు చేస్తారు. మిగిలిన రూ.1,000 ఫోన్ డెలివరీ చేసినప్పుడు చెల్లించాల్సి ఉంటుంది. జియోఫోన్ యూజర్ ఈ జియోఫోన్‌ను 36నెలల పాటు వినియోగించాల్సి ఉంటుంది. అటు తర్వాత రూ.1,500 రీఫండ్ చేయబడుతుందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది.

Andhraprabha business 2017

బిజినెస్

BUSINESS



హెరిటేజ్ ఫుడ్స్ రజతోత్సవాల ముగింపు

• ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు

• చెన్నై, ఢిల్లీలో సంబరాలు

హైదరాబాద్ : హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్‌లో రజతోత్సవాలు జరుపుకుంది. ఈ సందర్భంగా కంపెనీ భాగస్వాములను ఆహ్వానించింది. కంపెనీ వ్యవస్థాపకులు నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించిన విలువ ప్రకారం రైతుల ప్రయోజనాలను కాపాడుకుంటూ గత పాతిక సంవత్సరాల నుంచి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. ఇదిలా ఉండగా కంపెనీ రజతోత్సవాలను ఈ ఏడాది ఏప్రిల్ నుంచి హైదరాబాద్‌లో మొదలుపెట్టి అటు తర్వాత చెన్నై, ముంబైలలో కూడా సంబరాలు నిర్వహించింది. ఇటీవల కాలంలో కంపెనీని రీబ్రాండ్‌గా మార్చడం జరిగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే కంపెనీ ప్రాడక్టుల ప్యాకేజీతో పాటు రజతోత్సవాలను ప్రారంభించింది. ఇదిలా ఉండగా కంపెనీ 2022 నాటికి 6000 కోట్ల రెవెన్యూ లక్ష్యంగా నిర్దేశించింది.రజతోత్సవంలో భాగంగా ఈ ఏడాది ప్రారంభంలో ఫ్లేవర్డ్ మిల్క్ పీపీ బాటిల్స్‌ను ఆవిష్కరించింది. ఢిల్లీలో జరిగిన రజతోత్సవ సంబరాల్లో రిలయన్స్ డైరీని టేకోవర్ చేసుకుంది. అదే సమయంలో ఉత్తరాది మార్కెట్లో ప్రవేశించింది. గత ఐదు నెలల నుంచి కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రహ్మణితో పాటు కంపెనీ సీనియర్ మేనేజ్‌మెంట్ బృందం దేశంలో విస్తృతంగా పర్యటించారు. ప్లాంట్లను, చిల్లింగ్ సెంటర్లను, మార్కెట్లను సందర్శించారు. రిలయన్స్ డైరీ టేకోవర్‌లో జాతీయ స్థాయిలో పాగా వేసినట్లవుతుందన్నారు.అలాగే పశ్చిమ మార్కెట్లో ఎంట్రీ ఇచ్చినట్లవుతుందని కంపెనీ ఒక ప్రకటనలో వివరించింది.



త్వరలో మార్కెట్లోకి రూ.200 నోటు

• రూ.200 నోటు ముద్రణకు ఆర్థికమంత్రిత్వ శాఖ ఓకే: ఆర్‌బీఐ

న్యూఢిల్లీ : తక్కువ డినామినేషన్ నోట్లపై ఒత్తిడి తగ్గించేందుకు ఎట్టకేలకు కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కొత్తగా రూ.200 నోట్ల ముద్రణకు ఆర్థికమంత్రిత్వశాఖ రిజర్వుబ్యాంకుకు అనుమతి ఇచ్చింది. ఆర్థికమంత్రిత్వశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో రిజర్వుబ్యాంకు బోర్డు సిఫారసుల మేరకు కేంద్రప్రభుత్వం రూ.200 నోట్లు ముద్రించడానికి అనుమతించినట్లు తెలిపింది. కొత్త రూ.200నోట్లు త్వరలోనే చలామణిలోకి రానుంది. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం కొత్త రూ.200 నోటు విడుదల వల్ల దేశంలోని కరెన్సీ చలామణి మరింత మెరుగుపడుతుందని తెలిపింది. ఇదిలా ఉండగా కేంద్రప్రభుత్వం నవంబర్ 9వ తేదీన కొత్తగా రూ.2,000 రూ.500 నోట్లకు అదనపు సెక్యూరిటీ ఫీచర్లతో విడుదల చేసింది. రూ.2,000 నోటుకు చిల్లర దొరక్క ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. త్వరలోనే రూ.200 నోటును విడుదల చేస్తే ప్రజలకు కొంత ఉపశమనం కలిగే అవకాశాలున్నాయి.

దీంతో పాటు ఆర్‌బీఐ కొత్త రూ.50 నోట్లను విడుదల చేసింది. గతేడాది నవంబర్ 8 అర్ధరాత్రి నుంచి ప్రధానమంత్రి నల్లధనం, నకిలీ కరెన్సీనోట్లను అడ్డుకట్ట వేసేందుకు రూ.500, రూ.1,000 కరెన్సీనోట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో చలామణిలో ఉన్న 86 శాతం కరెన్సీని రద్దు చేయడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. రూ.2,000 నోటు రద్దు ఆలోచన లేదు: జైట్లీ : ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ బుధవారం నాడు మాట్లాడుతూ ప్రభుత్వానికి రూ.2,000 నోటు రద్దు చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు.

అయితే రూ.200 నోటును ఎప్పుడు విడుదల చేయాలో రిజర్వుబ్యాంకు నిర్ణయిస్తుందని తెలిపారు. నోట్ల ముద్రణ ఎప్పుడు చేపట్టాలి. ఎప్పుడు చలామణిలోకి తేవాలనే తేదీని ఆర్‌బీఐకి సంబంధించిన విషయమని జైట్లీ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.

ఐఆర్ఐఎస్ ప్రారంభించిన ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్

హైదరాబాద్ : ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్స్యూరెన్స్‌ను బ్యాంకు ఆఫ్ బరోడా, ఆంధ్రాబ్యాంకు, లీగల్ అండ్ జనరల్ బుధవారం నాడు ఐఆర్ఐఎస్ (ఇండియా ఫస్ట్ రెస్పాండ్స్)ను ఆవిష్కరించింది. ఐఆర్ఐఎస్ విషయానికి వస్తే పలు రకాల సేవలను అందిస్తుంది. ముఖ్యంగా ప్రాడక్టు వివరణ, ప్రీమియం స్టేట్‌మెంట్స్; నోటీసులు, ఫండ్ విలువ, ఎంక్వైరీలు, కస్టమర్ అప్లికేషన్ స్టాటస్ తదితరాలుంటాయి. దీంతో స్వయం సేవలు (సెల్ఫ్ సర్వీసెస్) బలోపేతం అవుతాయని, కంపెనీకి చెందిన ఫీల్డ్‌సేల్స్ మరియు కస్టమర్లకు సమాచారం కోసం కాంటాక్ట్‌సెంటర్లపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కస్టమర్లకు 24 గంటల పాటు వారికి కావాల్సిన సమాచారం అందుబాటులో ఉంటుందని ఆర్ ఎం విశాఖ ఎండీ, సీఈవో ఇండియా ఫస్ట్‌లైఫ్ ఇన్స్యూరెన్స్ చెప్పారు.

IndiaFirst
LIFE INSURANCE

ఇన్ఫీ చైర్మన్‌గా నీలేకనీ?

• ప్రమోటర్లు, ఇన్వెస్టర్లదీ అదే మాట • నీలేకనీ రాకతో కంపెనీ గాడినపడేనా!

న్యూఢిల్లీ : ఇన్ఫోసిస్‌లో చోటు చేసుకున్న సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి కంపెనీ కొత్త సీఈవో అన్వేషణలో పడింది. విశాల్‌సిక్కా సీఈవో నుంచి తప్పుకున్న తర్వాత ప్రస్తుతం ప్రవీణ్‌రావు సీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

తాజాగా బుధవారం నాడు మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నందన్ నీలేకనిని కంపెనీ బోర్డులోకి తీసుకురావాలని మాజీ వ్యవస్థాపకుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. దీనికి పలువురు నిపుణులు, కంపెనీల సలహాదారులు కూడా ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో కంపెనీని గాడిలో పెట్టాలంటే నీలేకనే సరైన అభ్యర్థిని అని చెబుతున్నారు.

కంపెనీ వ్యవస్థాపకుడు ఎన్‌ఆర్ నారాయణమూర్తికి, కంపెనీ సీఈవో విశాల్‌సిక్కాకు మధ్య తీవ్రస్థాయిలో ఏర్పడిన విభేదాల కారణంగా సిక్కా గత శుక్రవారంనాడు రాజీనామా చేశారు. అటు తర్వాత నుంచి దేశీయ ఇన్స్‌టిట్యూషనల్ ఇన్వెస్టర్స్ ముక్తకంఠంలో నందన్ నీలేకనీకి సీఈవోగా బాధ్యతలు అప్పగించాలని ఒత్తిడి పెంచాయి. వీరంతా కలిసి బోర్డుకు లేఖ రాస్తూ నీలేకనీకి బాధ్యతలు అప్పగించాలని కోరారు. కంపెనీలో పెట్టుబడులు పెట్టిన వారంతా నీలేకనే సరైన అభ్యర్థిని అని చెబుతున్నారు.

గత వారం విశాల్‌సిక్కా రాజీనామాతో బోర్డుకు, వ్యవస్థాపకులుకు , వాటాదారులకు మధ్య మాటల యుద్ధంతో కంపెనీ ఇమేజీ డ్యామేజీ జరిగింది. దీని ప్రభావం కంపెనీ భవిష్యత్తుపై ఉంటుంది. కాగా సిక్కా రాజీనామాకు వ్యవస్థాపకుడు ఎన్ ఆర్ నారాయణమూర్తి కారణమని బోర్డు ఆరోపిస్తోంది. మూర్తి తరచూ సిక్కాపై బహిరంగ విమర్శలు చేస్తుంటే భరించలేక రాజీనామా చేసి వెళ్లిపోయారు. ప్రస్తుతం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సమయంలో మంచి సీఈవోను అన్వేషించడం కాస్తా ఇబ్బందికరమే. అంతర్గత సమస్యలతో పాటు పలు వ్యాపార సవాళ్లను కొత్త సీఈవో ధైర్యంగా ఎదుర్కొనే గుండె ధైర్యం కలిగిన వ్యక్తి లభించడం కష్టమే. దీంతో పాటు వ్యవస్థాపకులు కొత్త సీఈవోను స్వేచ్ఛగా పనిచేసుకొనిస్తారా అనేది అనుమానమే. ఎందుకంటే వ్యవస్థాపకులు ప్రతిదానికి మీడియాకు ఎక్కుతుండటం యాజమాన్యానికి పెద్ద తలనొప్పిగా మారింది. ఈ ఇబ్బందులన్నీ కొత్త సీఈవో ఎలా తట్టుకుంటారో అనుమానమే.

అయితే దీనికి ఒక్కటే పరిష్కార మార్గం నందన్ నీలేకనీ బోర్డులో చేరితే.. పరిస్థితులు అన్నీ సర్దుకుంటాయని మార్కెట్ నిపుణులతో పాటు అతి పెద్ద ఇన్వెస్టర్లు చెబుతున్నారు. నీలేకని బోర్డులో చేరితే మూర్తి కూడా చల్లబడతారని అంటున్నారు. కొత్తగా ఎవరూ పగ్గాలు చేపట్టినా మూర్తి మాత్రం మీడియాకెక్కి వారిపై అసంతృప్తి వెళ్లగక్కుతారని, కేవలం నీలేకనీ ఒక్కరే మూర్తిని అదుపు చేయగలరని చెబుతున్నారు. అదీ కాకుండా నీలేకనీ మాటను మూర్తి వింటారని.. బోర్డులో నీలేకని చేరితే మూర్తి సంతోషిస్తారని లేకపోయినా.. బోర్డుకు వ్యతిరేకంగా మీడియాకు మాత్రం ఎక్కరని వారు ఘంటాపథంగా చెబుతున్నారు.

వివిధ రంగాల్లో అనుభవం : ఇక నందన్ నీలేకని విషయానికి వస్తే ఆయన వివిధ రంగాల్లో పనిచేసిన అనుభవం ఉంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ పెద్దనోట్ల రద్దు తర్వాత నగదు రహిత లావాదేవీలకు ప్రభుత్వానికి సలహాదారునిగా పనిచేయాలని కోరారు. వాస్తవానికి నీలేకనీ కాంగ్రెస్ టిక్కెట్‌పై బెంగళూరులో లోకసభ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్న విషయం తెలిసిందే. అలాంటిది నందన్ నీలేకని రెండు పార్టీలను మెప్పించారు. కాబట్టి బోర్డులో నీలేకని చేరితే ఇటు బోర్డును.. అటు వ్యవస్థాపకులకు మధ్య వారధిగా ఉంటారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

అలాగే నీలేకని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఆధార్)ను తీసుకొచ్చిన ఘనత ఆయనదే.. దీనిపై వచ్చిన రాజకీయ వివాదాలన్నిటి ఆయన తేలిగ్గా పరిష్కరించారు. ప్రస్తుతం ఇన్ఫోసిస్‌లో కొనసాగుతున్న సంక్షోభం దీని కంటే



పెద్దదేమీ కాదని అంటున్నారు. దేశంలో అతి పెద్ద ప్రాజెక్టు ఆధార్ అమలు చేసిన నీలేకని సీఈవోగా బాధ్యతలు చేపట్టి కంపెనీ రూపు రేఖలు మారుస్తారని, వ్యవస్థాపకుల్లో ఆయన ఒకరు కాబట్టి వ్యవస్థాపకులకు సర్ది చెప్పగలరని భావిస్తున్నారు. వచ్చిన చిక్కల్లా ఇన్ఫీ వ్యవస్థాపకులు బయటి వ్యక్తిని తేలిగ్గా నమ్మరు. కొత్త సీఈవో సమూలమైన మార్పులు తేవాలనుకుంటే బోర్డు అనుమతిస్తే.. వ్యవస్థాపకులు మాత్రం వ్యతిరేకిస్తుంటారు. ఇలాంటి సమయంలో నీలేకని అయితే కంపెనీ వ్యవస్థాపకుల్లో ఒకరు, కంపెనీ వ్యాపారాలు, కంపెనీలో పనిచేసే ఉద్యోగుల మనస్తత్వం ఆయనకు బాగా తెలుసు. ఐటి రంగం ఎలా పనిచేస్తుంది.. తన పరిమితులు ఏంటో ఆయన అవగాహన ఉంటుంది.. ఇన్వెస్టర్లలో కూడా ఆయన అంటే విపరీతమైన నమ్మకం ఉంది కాబట్టి అందరూ నీలేకనే కావాలనుకుంటున్నారు.

నీలేకనీ రాకతో పరిస్థితులు కుదటపడతాయి: బాలకృష్ణన్

గత శుక్రవారం నాడు ఇన్ఫోసిస్ సీఈవో విశాల్‌సిక్కా ఆకస్మిక రాజీనామాతో తర్వాత బుధవారం వరకు ప్రింట్ మీడియాతో పాటు అటు ఎలక్ట్రానిక్ మీడియాలో ఇవే ప్రధాన శీర్షికగా నిలిచాయి. ఇన్ఫోసిస్‌లో బోర్డు ఒక వైపు... కంపెనీ వ్యవస్థాపకులు చెరో జట్టుగా చీలిపోయారు. బోర్డు సిక్కాకు అనుకూలంగా ఉంటే.. వ్యవస్థాపకులు మాత్రం నారాయణమూర్తికి వెన్ను దున్నగా నిలిచారు. మాజీ సీఎఫ్ఓ, వి బాలకృష్ణన్, మోహన్‌దాస్ పాయ్‌లు కూడా బోర్డుతో పాటు సిక్కాపై ధ్వజమెత్తినవారే. మీ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి వ్యవస్థాపకులపై లేనిపోని నిందలు మోపుతున్నారని బోర్డును విమర్శించారు. అయితే వ్యవస్థాపకులు మాత్రం నీలేకనీని స్వల్పకాలానికైనా తీసుకొచ్చి కంపెనీని సంక్షోభం నుంచి గట్టెక్కించాలని చూస్తున్నారు. మొత్తానికి బాలకృష్ణన్ చెప్పేదేమిటంటే నీలేకనీకి బాధ్యతలు అప్పగిస్తే సమస్యలన్నీ సమసిపోతాయంటున్నారు.

నారాయణమూర్తి ఇన్వెస్టర్ల సమావేశం రద్దు: ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్‌ఆర్ నారాయణమూర్తి కంపెనీలో అతి పెద్ద ఇన్వెస్టర్లతో బుధవారం నాడు సమావేశం కావాల్సింది. అయితే ఈ సమావేశం వచ్చే వారానికి వాయిదా పడిందని విశ్వసనీయవర్గాల సమాచారం. వాస్తవానికి గ్లోబల్ ఇన్వెస్టర్లతో నారాయణమూర్తి సమావేశం బుధవారం నాడు ఖరారు చేశారు. చివరి నిమిషంలో రద్దైందని చెబుతున్నారు. మూర్తికి స్వల్ప అస్వస్థ కారణంగా సమావేశాన్ని ఈ నెల 29కి వాయిదా వేశారని చెబుతున్నారు. ఈ కాన్ఫరెన్స్ కాల్‌ను ఇన్వెస్టెక్ ఇండియా అనే బ్రోకరేజి సంస్థ నిర్వహించింది. అతి పెద్ద గ్లోబల్ ఇన్వెస్టర్లు ఈ కాన్ఫరెన్స్ కాల్స్‌కు హాజరవ్వాలనుకున్నారు. మూర్తి చెప్పే అంశాల కోసం వారు ఎదురు చూశారు. కాగా ఇన్ఫోసిస్ బోర్డు కార్పొరేట్ గవర్నెన్స్ అమలు చేయడంతో విఫలం అయ్యిందని విమర్శించారు. సిక్కా రాజీనామా తర్వాత మూర్తి మొట్టమొదటిసారి ఇన్వెస్టర్లతో సమావేశం కావాల్సి ఉంది. అదీ కాస్తా వాయిదా పడింది.

బ్యాంకుల విలీనాలు వేగవంతం

• కేబినెట్ ఆమోదం • మంత్రుల ప్యానెల్ ఏర్పాటు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకుల విలీనాన్ని వేగవంతం చేయడానికి కేంద్రకేబినెట్ మంత్రుల ప్యానెల్ ఏర్పాటు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. వృద్ధి రేటు పెంచుకోవడంతో పాటు రుణాల డిమాండ్‌ను పునరుద్దరించడానికి పీఎస్‌యు బ్యాంకులను విలీనానికి ప్రభుత్వం నాంది పలికింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్యానెల్ సభ్యుల పేర్లను వెల్లడిస్తారు. ఈ ప్యానెల్ బ్యాంకుల బోర్డు విలీనాల ప్రతిపాదలను పరిశీలిస్తుందని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ బుధవారం కేబినెట్ సమావేశం తర్వాత మీడియాతో చెప్పారు. కాగా ప్రభుత్వ రంగానికి చెందిన 21 బ్యాంకుల్లో మెజారిటి వాటా ప్రభుత్వానిదే. అయితే ఈ ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకుల్లో సుమారు 150 బిలియన్ డాలర్లు అంటే సుమారు లక్ష కోట్ల రూపాయల వరకు మొండిబకాయిలతో సతమతమవుతున్నాయి. గ్లోబల్ బ్యాంకింగ్ నిబంధనలు బాసిల్-3 మూలధనం నిబంధనలు అమలు చేయాలంటే వచ్చే రెండేళ్లలో బ్యాంకులకు కోట్లాది రూపాయల మూలధనం కావాల్సి ఉంటుంది. అందుకే ముందు చూపుతో




ప్రభుత్వం పీఎస్‌యు బ్యాంకుల విలీనానికి శ్రీకారం చుట్టింది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలకు పెద్దపీట వేస్తోంది. ముఖ్యంగా రుణాల డిమాండ్‌ను తిరిగి గాడిలో పెట్టాలని చూస్తోంది. కాగా ప్రస్తుతం బ్యాంకులు భారీ మొత్తంలో మొండిబకాయిలతో సతమతమవుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఐదు అనుబంధ బ్యాంకులీ విలీనం చేసుకుంది. త్వరలోనే బ్యాంకుల్లో మరిన్ని సంస్కరణలకు శ్రీకారం చుడతామని, తమ ఉద్దేశం బలమైన బ్యాంకులను సృష్టించడమేనని వాణిజ్య ప్రాతిపదికనే విలీనాల నిర్ణయాలు తీసుకున్నామని జైట్లీ పేర్కొన్నారు. బ్యాంకుల విలీనాల ప్రతిపాదనలపై తదుపరి నిర్ణయం తీసుకోవాల్సింది ఆయా బ్యాంకు బోర్డులేనన్నారు. బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేయాలంటే విలీనాలు తప్పనిసరి అని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ కూడా పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయాన్ని విశ్లేషకులు, ఇన్వెస్టర్లకు స్వాగతించారు. అయితే బ్యాంకు యూనియన్ మాత్రం విలీనాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తమ ఉద్యోగాలు పోతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మంగళవారం నాడు దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు ఒక రోజు సమ్మె చేశారు. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మొత్తం 21 ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకుల్లో తొమ్మిది బ్యాంకులు నష్టాలను చవిచూశాయి. అంతక ముందు ఆర్థిక సంవత్సరం మొత్తం 13 బ్యాంకులు నష్టపోయాయి. మార్చి చివరి నాటికి పీఎస్‌యు బ్యాంకుల్లో మొండి బకాయిలు 12.5 శాతానికి పెరిగిపోయాయని రిజర్వుబ్యాంకు గణాంకాలు తెలియజేస్తున్నాయి.

రఘురాం రాజన్ పుస్తకం సెప్టెంబర్ 4న విడుదల

• ఆర్‌బీఐ గవర్నర్‌గా ఎదుర్కొన్న ఒడిదుడుకుల ప్రస్తావన

న్యూఢిల్లీ : మాజీ రిజర్వుబ్యాంకు గవర్నర్ డాక్టర్ రఘురాం రాజన్ ఆర్‌బీఐ గవర్నర్‌గా పనిచేసిన కాలంలో ఎదుర్కొన్న పలు అనుభవాలను ఈ పుస్తకంలో ముద్రించబోతున్నారు. పుస్తకంలో ఆర్థిక వ్యవస్థ, సహనం, రాజకీయ స్వాతంత్ర్యం తదితర అంశాల గురించి ప్రస్తావించనున్నారు. ఆర్‌బీఐ చీఫ్‌గా ఉన్నప్పుడు ఆయన రాసిన వ్యాసాలు, ప్రసంగాలు పుస్తకంలో పొందుపర్చారు.



ఇదిలా ఉండగా రాజన్ సెప్టెంబర్ 2013లో డాలర్ మారకంతో రూపాయి పాతాళానికి, ద్రవ్యోల్బణం అత్యంత గరిష్ఠానికి చేరినప్పుడు బాధ్యతలు చేపట్టారు. రాజన్ బాధ్యతలు స్వీకరించినప్పుడు కరెంటు ఖాతాలోటు విపరీతంగా పెరిగిపోయింది. విదేశీ మారకద్రవ్యం నిల్వలు మంచులా కరిగిపోయాయి. మార్కెట్లను స్థిరపర్చాలనుకొని విఫలమయ్యారు. స్పెక్యూలేటర్లు బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని తేల్చేశాయి. అటు తర్వాత రాజన్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు భారత ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేశాయి. ఇన్వెస్టర్లలో విశ్వాసం పెరిగింది. దేశంలోకి పెద్దెత్తున విదేశీ పెట్టుబడులు వచ్చాయి. భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు పటిష్టంగా ఉన్నాయని ఆయన ప్రపంచానికి సందేశం ఇచ్చారని పుస్తకాన్ని ముద్రిస్తున్న హార్పర్ కాలిన్స్ ఇండియాపేర్కొంది. సెప్టెంబర్ 4వ తేదీన బుక్‌స్టోర్‌లలో లభ్యం కానున్న పుస్తకంలో రాజన్ తరచూ తన ప్రసంగాల్లో తాను రఘురాం రాజన్‌ను.. తాను ఏదనుకుంటానో అదే చేస్తాను అనే వారు.

అయితే రాజన్‌కు ఇదే మొదట పుస్తకం కాదు. గతంలో కూడా సహ రచయితగా 'సేవింగ్స్ క్యాపిటలిజం ఫ్రం ది క్యాపిటలిస్టు' అనే పుస్తకాన్ని లుయిగి జింగాల్సేతో కలిసి రచించారు. దీంతో పాటు ఫాల్ట్‌లైన్స్ :హౌ హిడన్ ఫ్రాక్చర్స్ స్టిల్ థ్రెటన్ ది వరల్డ్ ఎకనీమి' అనే పుస్తకాన్ని రాశారు. దీనికి ఫైనాన్షియల్ టైమ్స్ - గోల్డ్‌మన్ సాచెస్ అత్యుత్తమ బిజినెస్‌బుక్ అని అవార్డు కూడా అందజేసింది.


DSP BLACKROCK

డీఎస్‌పీ బ్లాక్‌రాక్ టోటల్ రిటర్న్స్ ఇండెక్స్

హైదరాబాద్ : డిఎస్‌పీ బ్లాక్‌రాక్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్.. దేశంలోని అత్యుత్తమ అసెట్ మేనేజ్‌మెంట్‌కంపెనీ బుధవారం నాడు ఈక్విటీ, మ్యుచువల్ ఫండ్స్‌లో తమ పెట్టుబడులపై ఎంత రాబడి వచ్చింది టోటల్ రిటర్న్ ఇండెక్స్ (టీఆర్‌ఐ) బెంచ్‌మార్కును విడుదల చేసింది. కాల్పన్ పారిఖ్ ప్రెసిడెంట్ బ్లాక్‌రాక్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్ మాట్లాడుతూ .. టీఆర్‌ఐ బెంచ్‌మార్కును విడుదల చేయడం ద్వారా ఇన్వెస్టర్లకు కంపెనీ నిర్వహణపై పూర్తి అవగాహన కలుగుతుందని అన్నారు. ప్రస్తుతం పెద్దమొత్తంలో కంపెనీలోకి పెట్టుబడులు వస్తున్నాయని తమ ఇన్వెస్టర్లకు వాస్తవాలను వివరించేందుకు టీఆర్‌ఐ ఇండెక్స్‌ను విడుదల చేస్తామని కంపెనీ పూర్తిస్థాయిలో పారదర్శకత పాటిస్తుందని అన్నారు. అనుపమ మహేశ్వరి ఈవీపీ మాట్లాడుతూ.. ఇన్వెస్టర్‌కు వారి పెట్టుబడిపై ఎంత రాబడి వస్తుందో అధ్యయనం చేసుకోవడానికి వీలవుతుందన్నారు.

వీఎఫ్ఎస్ గ్లోబల్ చేతికి వీసా సర్వీస్ ప్రొవైడర్ టీటీ సర్వీసెస్

హైదరాబాద్ : అంతర్జాతీయంగా ఉనికిని చాటుతూ పూర్తి స్థాయిలో సేవలందిస్తున్న ఇంటిగ్రేటెడ్ వీసా ప్రాసెసింగ్ సొల్యూషన్స్ సంస్థ టీటీ సర్వీసెస్‌కు 35 దేశాలకు పైగా దేశాల్లో 216 మంది సిబ్బందితో 51 అప్లికేషన్ సెంటర్‌లను నిర్వహిస్తోంది. టీటీ సర్వీసెస్ ప్రధాన కార్యాలయం బ్రిటన్ ఉంది.



అత్యంత నాణ్యత కలిగిన పూర్తి స్థాయి వీసా సెంటరల్‌ను టీటీఎస్ నిర్వహిస్తోంది. జుబిన్ కర్కారియా సీఈవో, వీఎఫ్ఎస్ గ్లోబల్ గ్రూపు మాట్లాడూతూ.. వీఎఫ్ఎస్ గ్లోబల్ లాగాతనే తమ క్లయింట్లకు నమ్మకమైన సర్వీస్ డెలివరీ పార్టనర్‌గా గత 15 సంవత్సరాలకు పైగా అందిస్తున్న విస్తృతస్థాయి అనుభవం టీటీ సర్వీసెస్‌కు ఉందని,, వీఎఫ్ఎస్ గ్లోబల్‌తో టీటీఎస్ చేతులు కలుపడం వల్ల మరింతగా మా సేవలను విస్తరిస్తామని అన్నారు.

కొనుగోళ్లతో కళకళ


ముంబై : ఇటీవల స్టాక్ మార్కెట్లు వరుసగా తిరోగమనబాట పట్టడంతో షేర్ల ధరలు బాగా పడిపోయాయి. బ్లూచిప్ షేర్లు ఆకర్షణీయమైన ధరలకు అందుబాటులో రావడంతో మదుపరులు పెద్దెత్తున కొనుగోలు చేయడంతో స్టాక్ మార్కెట్లు జోరందుకున్నాయి. దీనికి తోడు గ్లోబల్ మార్కెట్లు కూడా స్థిరంగా ట్రేడ్ కావడంతో దేశీయ మార్కెట్లకు బాగా కలిసొచ్చింది. ఇటీవల కాలంలో వరకు ఇన్ఫోసిస్ షేరు భారీగా పతనం కావడంతో పాటు తిరిగి వ్యవస్థాపకుల్లో ఒకరైన నందన్ నీలేకనీ తిరిగి కంపెనీ పగ్గాలు చేపట్టనున్నారన్న వార్తలు రావడంతో ఇన్ఫోసిస్ షేరు తిరిగి పుంజుకుంది. దీంతో పాటు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగానికి చెందిన షేర్లు దూసుకుపోయాయి. బీఎస్ఈ 276.16 పాయింట్లు లాభపడి 31,568.01 వద్ద నిఫ్టీ 86.95 పాయింట్లు పెరిగి 9,852.5 వద్ద ముగిసాయి. వరుసగా బీఎస్ఈ, ఎన్ఎస్ఈ 2 రోజుల పాలు లాభాలను నమోదు చేశాయి. బీఎస్ఈలో కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంజీసీ రంగానికి చెందిన షేర్లు తప్పించి మిగిలిన షేర్లు లాభాలతో ముగిశాయి. అత్యధికంగా రియల్టీ సూచి 3.48 శాతం, మెటల్ 1.81 శాతం, బ్యాంకింగ్ 1.39 శాతం, పీఎస్‌యు 1.2 శాతం లాభపడ్డాయి. దీనికి వ్యతిరేకంగా కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.75 శాతం, ఎఫ్ఎంసీజీ సూచి 0.04 శాతం నష్టపోయాయి.

బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు పుంజుకోవడానికి ప్రధాన కారణం కేంద్రప్రభుత్వం ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకుల విలీనానికి ఆమోదం తెలపడం. అదే సమయంలో రియల్టీ రంగానికి చెందిన డీఎల్ఎఫ్ 8 శాతం పెరిగింది. ఆడిట్ కమిటీ కంపల్సరీ కన్వర్టబుల్ ప్రీపెరెన్సియల్ షేర్లను సింగపూర్ సావరిన్ వెల్త్ ఫండ్ జీఐసీకి విక్రయించే ప్రతిపాదనపై సమీక్ష జరపడమే కారణం.

బీఎస్ఈలో అత్యధికంగా లాభపడిన షేర్లు ఇలా ఉన్నాయి. అదానీ పోర్ట్స్ 2.79 శాతం, భారతి ఎయిర్‌టెల్ 2.41 శాతం, టాటాస్టీల్ 2.28 శాతం, డాక్టర్ రెడ్డీస్ 2.25 శాతం, ఇన్ఫోసిస్ 1.98 శాతం కాగా దీనికి వ్యతిరేకంగా నష్టపోయిన షేర్లు ఇలా ఉన్నాయి. హెచ్‌యూఎల్ 1.05 శాతం, సన్‌ఫార్మా 0.45 శాతం, ఐటీసీ 0.28 శాతం, పవర్‌గ్రిడ్ 0.21 శాతం, ఎంఅండ్ఎం 0.13 శాతం వరకు ఉన్నాయి.

ఇన్ఫోసిస్‌లో నందన్ నీలేకని తిరిగి చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్నట్లు వార్తలు రావడంతో ఇన్ఫీ షేరు ఏకంగా 1.98 శాతం పెరిగి రూ.894.50 వద్ద ముగిసింది. మదుపరులు పెద్దెత్తున షేర్ల కొనుగోలు చేశారు. మంగళవారం నాడు రూ.60.59 కోట్ల షేర్లు బ్లాక్ డీల్‌లో కొనుగోలు చేయడం జరిగింది. దీంతో ఫోర్టిస్ హెల్త్‌కేర్ లిమిటెడ్ 7.3 శాతం లాభపడింది. దీంతో పాటు గోల్డ్‌మన్ సాచేస్ కొనుగోలు చేయవచ్చునని సిఫారసు చేసింది.

ప్రశాంతంగా పోలింగ్



- నంద్యాలలో రికార్డు స్థాయిలో 79 శాతం ఓటింగ్
- 28న ఓట్ల లెక్కింపు..ఫలితం వెల్లడి: ఈసీ భన్వర్‌లాల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నంద్యాల ఉప ఎన్నికల ఓటింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల సంఘం ప్రధానాధికారి భన్వర్‌లాల్ ప్రకటించారు. బుధవారం నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉప ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం ఈసీఈ భన్వర్‌లాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత రెండు దశాబ్దాల నంద్యాల పోలింగ్ రికార్డులను బుధవారం నాటి పోలింగ్ అధిగమించిందన్నారు.

పోలింగ్ కేంద్రం పరిధిలోని క్యూలైన్లలో ఉన్న వారికి అర్ధరాత్రి వరకూ ఓటు వేసుకునే అవకాశం కల్పించామన్నారు. రాత్రి 8 గంటలకు పోలింగ్ ముగిసే సరికి మొత్తం 79.20శాతం పోలింగ్ జరిగినట్టు వివరించారు. అందులో పురుషులు 83089 మంది, మహిళలు 86876 మంది, ఒక థర్డ్ జెండర్ ఓటు వేసినట్టు తెలిపారు. మొత్తం 169966 ఓట్లు పోల్ అయినట్టు తెలిపారు. 2009 ఎన్నికల్లో 76 శాతం ఓట్లు పోల్ కాగా, 2014 సాధారణ ఎన్నికల్లో 71 శాతం ఓట్లు పోల్ అయినట్లు వివరించారు. చెదురు మదురు సంఘటనలు మినహా ఎక్కడా ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు.

బుధవారం నాటి పోలింగ్ సందర్భంగా 8 ఈవీఎంలు మొరాయించటంతో వాటి స్థానంలో కొత్త వాటిని పెట్టామన్నారు. 22 కంట్రోల్, 14 వివిప్యాడ్‌లను రీప్లేస్ చేసినట్టు తెలిపారు. ఈవీఎంలలో గుర్తులు సరిగా కనిపించటం లేదని ఫిర్యాదులేవీ రాలేదన్నారు. ఎన్నికల బందోబస్తులో ఉన్న గుంటూరు జిల్లాకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు మృతి చెందారని, ఎక్స్‌గ్రేషియా కింద ఆయన కుటుంబానికి పదిరెట్ల జీతం లేదా పది లక్షల రూపాయలు అందచేస్తామని ప్రకటించారు.

జగన్‌పై కేసు నమోదుకు ఆదేశం

నంద్యాల ఎన్నికల ప్రచారం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఉద్దేశించి వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖలపై వచ్చిన ఫిర్యాదులను ఎన్నికల సంఘం విచారణకు తీసుకున్నట్టు సీఈఓ భన్వర్‌లాల్ తెలిపారు. చివరి హెచ్చరిక చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆర్ఓకు డైరెక్షన్ ఇచ్చామన్నారు. ఎన్నికల సందర్భంగా మీడియాపై ఏ విధమైన ఫిర్యాదులు లేవన్నారు. నంద్యాల ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు మీడియా కూడా బాగా సహకారం అందించిందన్నారు

28న కౌంటింగ్

నంద్యాల ఉప ఎన్నికల బ్యాలెట్ పెట్టెలను నంద్యాల పాలిటెక్నిక్ కళాశాలలో భద్రపరిచినట్టు తెలిపారు. ఈ నెల 28న ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. ఉదయం 8 గంటలకు లెక్కింపును ప్రారంభించి మధ్యాహ్నానికి ఫలితాలు ప్రకటిస్తామని భన్వర్‌లాల్ వెల్లడించారు.

వెల్లువెత్తిన మహిళా ఓటర్లు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: లేచింది మహిళాలోకం..నిద్ర లేచింది మహిళాలోకం. వెల్లువెత్తింది ఎన్నికల చైతన్యం.. ఎన్నికల్లో మా సత్తా ఏమిటో చూపిస్తాం అంటూ నిశ్శబ్దంగా నినదించారు. మహిళల రాజకీయ చైతన్యానికి కర్నూలు జిల్లా నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల పోలింగ్ వేదికగా నిలిచింది. బుధవారం నంద్యాలలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో పాటు మరో అరుదైన రికార్డును నమోదు చేసింది. ఉదయం పోలింగ్ ప్రారంభానికి ఆరగంట ముందునుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. అయితే ఇందులో అత్యధిక శాతం మహిళలే కనిపించారు. అటు గ్రామీణ వాతావరణంలో జరిగిన నంద్యాల రూరల్, గోస్పాడు మండలాల పరిధిలోనే కాకుండా నంద్యాల పట్టణ పరిధిలో కూడా పలుచోట్ల ఇవే దృశ్యాలు కనిపించాయి. మహిళా ఓటర్లలో ఒక్కసారిగా ఇంతటి చైతన్యం ఎలా వచ్చిందని రాజకీయ పార్టీల నేతలు కాకుండా, పోలింగ్ యంత్రాంగం సైతం అబ్బురపడింది. ఎన్నికలు, ప్రచారం, పోలింగ్ పదవులు అనగానే మనకెందులే అని తమకు తామే పరిమితం అయ్యే మనస్తత్వం నుంచి నంద్యాల మహిళా ఓటర్ మనోభావాలు రెక్కలు తొడుక్కుని విశాల ప్రపంచంలో విహరించాయి. నంద్యాల నియోజకవర్గం పరిధిలో మొత్తం 2,03155 మంది ఓటర్లుండగా, అందులో మహిళా ఓటర్లు 1,11,018 మంది ఉన్నారు. పురుషుల ఓటర్లు 1.07,777 మంది ఉండగా థర్డ్ జెండర్ ఓటర్లు 62 మంది ఉన్నారు. వీరు కాక మరో 250 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. అయితే పోలింగ్ బూత్ దాక వచ్చేసరికి సంఖ్యలోనే కాదు సత్తాలోనూ తమదే ఆధిక్యం అని మహిళలు ఓటింగ్ శాతంలో నిరూపించుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికే 56260 మంది పురుష ఓటింగ్‌ను క్రాస్ చేసిన మహిళా ఓటర్లు 59954 ఓట్లు వేశారు. పోలింగ్ ముగిసే వరకూ ఓటింగ్‌లో మహిళా ఓటర్లే తమ ఆధిక్యతను కనబరుస్తూ వచ్చారు.

గ్రామాల్లో పోటాపోటీగా పోలింగ్

ఎన్నికలు ఏవైనా గ్రామీణప్రాంతాల్లో ఇరు వర్గాలు పోలింగ్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటాయి. పోలింగ్ సందర్భంగా గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు , అవాంఛనీయ సంఘటనలు అధికంగా చోటు చేసుకుంటు వుంటాయి. అయితే నంద్యాల ఉప ఎన్నికల పోలింగ్‌లో ఉద్రిక్త పరిస్థితులకు తావులేకుండా అన్ని గ్రామాల్లోనూ పోలింగ్ ప్రశాంతంగా సాగిపోయింది. గ్రామాల్లోని రెండు వర్గాలు పోలింగ్ సందర్భంగా ఆవేశాలకు లోనుకాకుండా ప్రశాంతతను కాపాడేందుకే అధిక ప్రాధాన్యత ఇచ్చాయి. వ్యవసాయ పనుల కాలం అయినప్పటికీ గ్రామాల్లో ఉదయం నుంచే పోలింగ్‌లో ఓటర్లు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకే నంద్యాల మండలం గుంతనాల గ్రామంలో మొత్తం 700 ఓట్లకు గాను 600 ఓట్లు పోల్ అయ్యాయి. మిట్నాల గ్రామంలో 1500 ఓట్లకు గాను 900 ఓట్లు పోల్ అయ్యాయి. బ్రహ్మణపల్లె గ్రామంలో మొత్తం 560 ఓట్లకు గాను 520 ఓట్లు పోల్ అయ్యాయి.

మిగిలిన గ్రామాల్లో సైతం పోలింగ్ ఇదే తీరులో సాగింది. నంద్యాల నియోజకవర్గం పరిధిలో మొత్తం 53.1శాతం ఓట్లు పోల్ అయ్యాయి. మధ్యాహ్నం నుంచి సుమారు గంటన్నర పాటు మందకొడిగా సాగిన పోలింగ్ ఆ తరువాత పుంజుకుంది. ఈసారి యువత అంత ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నట్టు కనిపించలేదు.

'నంద్యాలలో టీడీపీదే విజయం'

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కర్నూలు జిల్లా నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం జరిగిన ఉపఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి విజయం ఖాయమని సర్వేలలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంతరించుకున్న విజయవాడ మాజీ ఎంపి లగడపాటి రాజగోపాల్ చెప్పారు.

మెరుగుపడిన భద్రతా ప్రమాణాలు

- ద.మ.రైల్వేలో తగ్గిన ప్రమాదాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భద్రతా ప్రమాణాల కల్పన, ప్రమాదాల నివారణ విషయంలో భారతీయ రైల్వేలు గత మూడు సంవత్సరాలుగా ఎంతో మెరుగైన పనితీరు కనబరుస్తుంది. రైలు ప్రమాదాల సంఖ్యను పరిశీలిస్తే 2014-15లో 135 ప్రమాదాలు జరగగా, 2015-16లో ప్రమాదాల సంఖ్య 107కి తగ్గిపోయింది. 2016-17లో భద్రతా ప్రమాణాలు మరింత మెరుగై ప్రమాదాల సంఖ్య 104కు పరిమితమైంది. అంతర్జాతీయంగా అందరూ ఆమోదించే కొలమానం మిలియన్ ట్రైన్ కిలోమీటర్లు-ప్రమాదాల సంఖ్యతో పోల్చినప్పుడు 2014 -15లో ప్రతి మిలియన్ కిలోమీటర్‌కు 0.11 ప్రమాదాలు జరగగా, 2015 -16లో ఆ సంఖ్య 0.10కి , 2016 -17లో 0.09కి తగ్గిపోయింది. కాపలా లేని లెవల్ క్రాసింగ్‌ల వద్ద 2014 -15లో, 2015 -16లో 6 ప్రమాదాలు జరగగా, 2016 -17లో ఒక్క రైలు ప్రమాదం కూడా జరగలేదు. కాపలాలేని లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద మెరుగైన భద్రతా చర్యగా వీనిటిన తొలగించడం కోసం రోడ్ ఓవర్ - రోడ్ అండర్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు పలు చర్యలు చేపట్టడం జరిగింది. పలుచోట్ల గేట్ మిత్ర కార్యకర్తలను నియమించడంతో పాటు భద్రతను పెంపొందించే రెండవ విజిల్ బోర్డులను ఏర్పాటు చేయడం జరిగింది. 2015 -16 రైల్వే బడ్జెట్ ప్రకటించిన విధంగా రాబోవు 3 - 4 సంవత్సరాల్లో ప్రస్తుతం ఉన్న కాపలాలేని గేట్లను ఎత్తివేస్తామని భారతీయ రైల్వే ప్రకటించింది. 2016 -17లో 1503 కాపలా లేని గేట్లను సబ్‌వేల ఏర్పాటు తదితర ప్రత్యామ్నాయాల అనంతరం తొలగించగా 2015 -16లో 1253 కాపలా లేని గేట్లను, 2014 -15లో 1148 కాపలా లేని గేట్లను తొలగించడం జరిగింది. 2016 -17లో 509 కాపలా ఉన్న గేట్లను తొలగించగా, 2015 -16లో 390, 2014 - 15లో 310 గేట్లను తొలగించడం జరిగింది. రైళ్లు పరస్పరం ఢీ కొట్టకుండా అభివృద్దిపరిచిన సాంకేతిక పరిజ్ఞానాన్ని లోకో పైలెట్లకు సహాయకారిగా, వనరుల లభ్యత మేరకు భారతీయ రైల్వేలోని రద్దీ రైలు మార్గాలలో, సబర్బన్ సెక్షనులతో ప్రవేశపెట్టడం జరిగింది. లోకో పైలెట్ల డ్రైవింగ్ నైపుణ్యం పెంచడానికి సిమ్యూలేటర్ ఆధారిత ప్రత్యేక శిక్షణా సౌకర్యాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. రైలు పట్టాలు తప్పకుండా ఉండడం కోసం వివిధ నివారణ చర్యలు తీసుకోవడం జరిగింది. యాంత్రిక్ ట్రాక్ మెయిన్‌టెనెన్స్ సిస్టంను ఉపయోగించడం, వెహిక్యూలర్ యుఎస్ఎఫ్‌డి యంత్రాలు, వెల్డింగ్ సాంకేతికతను మెరుగుపర్చడం, హెడ్ హార్డెండ్ రైల్స్ ఉపయోగించడం, వే-సైడ్ కోచ్‌లు, వ్యాగన్ హాట్ బాక్సులను స్థాపించడం, ఇతర లోపాలను కనిపెట్టే పరికరాలు, వే-సైడ్ లోడ్ ఇంపాక్ట్ డిటెక్టర్స్, ఎల్‌హోచ్‌బికోచ్‌లు విస్తరించడం, ఐసిఎఫ్ కోచ్‌లలో సిబిసి కప్లింగ్ రిట్రో ఫిట్మెంట్ ఏర్పాటు చేయడం మొదలైంది. కోచ్‌లలో అగ్నిప్రమాదాల నివారణ చర్యలు మెరుగుపర్చడం, కోచ్‌లలో అగ్ని, పొగను పసిగట్టే ఆటోమెటిక్ యంత్రాలను అమర్చడం, ప్యాంట్రికార్లలో, పవర్ కార్లలో అగ్ని ప్రమాద నివారణకై నీటి తుంపరలను చల్లే యంత్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. హైలెవల్ సేఫ్టీ కమిటీ (కకోడ్కర్ కమిటీ) సిఫార్సు చేసిన 106 సిఫార్సులలో 68 సిఫార్సులను పూర్తిగా మరో 13 సిఫార్సులను పాక్షికంగా ఆమోదించడం జరిగింది. వీటిలో 52 సిఫార్సులు అమలు పరచగా విగతావి వివిధ దశలలో అమలుకు సిద్ధంగా ఉన్నాయి. భద్రతలో విదేశీ భాగస్వామ్యాన్ని భారత రైల్వేలు స్వాగతించాయి. ఇటలీ, రష్యా, జపాన్, కెనడా దేశాలతో రైల్ సెక్టార్‌లలో సాంకేతిక, రైల్వే భద్రతలో సహకారం కోసం రైల్వే మంత్రిత్వ శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రైల్వే భద్రత నిధిని ఏర్పాటు చేయడం జరిగింది. భద్రతను మెరుగుపర్చడానికి 2017 -18లో రాష్ట్రీయ రైల్ సంరక్ష కోస్ కింద రూ. 20 వేల కోట్లు కేటాయించింది. ఈ నిధిని ట్రాక్ భద్రత పెంపుదల కోసం, రోలింగ్ స్టాక్, వెహికిల్ ఆధారిత యూ.ఎస్.ఎఫ్.డి. మిషన్లను సమకూర్చుకోవడం కోసం, ఆన్‌బోర్డు రోలింగ్ స్టాక్ మానిటరింగ్ సిస్టమ్స్, ఇతర భద్రతా సాంకేతికతల పెంపుదల కోసం ఉపయోగిస్తారు.

సైబర్ సెక్యూరిటీపై శిక్షణ

- టీటా యువనిర్మాణ్ వలంటీర్ల ఆధ్వర్యం
- రాష్ట్ర పోలీసులకు మరింత మంది నిపుణుల అవసరం: సందీప్‌కుమార్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) డిజిటల్ మీడియా, సైబర్ సెక్యూరిటీపై తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖకు ఇటీవల ఎంపికయిన పోలీసులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. తెలంగాణ యువ నిర్మాణ్ వాలంటీర్లు 8వ బెటాలియన్ పోలీసులకు సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ మీడియా సహా మరిన్ని కీలకమైన సాంకేతిక పరిజ్ఞానాల గురించి తెలిపారు. విద్యార్థులు డ్రగ్స్‌కు బానిస కాకుండా ఉండేందుకు ఇటీవలే టీటా ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈలెర్నింగ్ కార్యక్రమం గురించి టీటా యువ నిర్మాత వాలంటీర్లు శిక్షణ ఇచ్చారు.

8వ బెటాలియన్ కమాండెంట్ సిహెచ్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు డిజిటల్ మీడియా సహా నూతన సాంకేతికతపై అవగాహన సంపాదించుకోవడం తప్పనిసరి అన్నారు. టీటా చేపట్టిన సాంకేతిక అక్షరాస్యత కార్యక్రమాలను ప్రశంసించిన కమాండెంట్, పోలీసులకు డిజిటల్ అంశాలపై శిక్షణ ద్వారా విధి నిర్వహణలో సమస్యలను పరిష్కరించే అవకాశం దక్కుతుందన్నారు.


అసిస్టెంట్ కమాండెంట్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ పోలీసులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కలిగి ఉండటం తప్పనిసరి అని, ఇలాంటి శిక్షణ ద్వారా సైబర్ క్రైంలను పరిష్కరించడం పోలీసులకు సులభమవుతుందన్నారు. ఈ సందర్భంగా టీటీ వ్యవస్థాపకులు, గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్ కుమార్ మక్తాల మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో అన్ని ప్రభుత్వ శాఖలకు సైబర్ సెక్యూరిటీ తప్పనిసరి అయిందని, అందులోనూ పోలీసు శాఖకు అత్యావశ్యకమని తెలిపారు. రాష్ట్రంలో మరింత మంది సైబర్ సెక్యూరిటీ నిపుణులు రూపుదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్ మీడియా, సైబర్ సెక్యూరిటీతో సహా అనుబంధ అంశాలపై ప్రతి ఒక్క పోలీసుకు అవగాహన తప్పనిసరి అని, భవిష్యత్తులో ప్రతి పోలీస్ స్టేషన్‌కు సైబర్ సెక్యూరిటీ నిపుణుడు అవసరమవుతారని సందీప్ కుమార్ తెలిపారు.

ఇటీవల పలు రంగాలను తీవ్ర ప్రభావితం చేయడమే కాకుండా నష్టాలకు గురిచేసిన వన్నాక్రై రాన్సమ్‌వేర్‌ను పోలీసు శాఖలోని సైబర్ సెక్యూరిటీ నిపుణులు విజయవంతంగా పరిష్కరించగలిగారని ఆయన ప్రశంసించారు. అనంతరం శిక్షణ పొందిన వారంతా ర్యాలీ నిర్వహించారు.

బోథ్, కెఎన్ఎన్ : ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మండలంలోని టివిటి పల్లె సమీపంలో గల నీటి కుంటలో పడి సాకెర గ్రామానికి చెందిన హరికృష్ణ(13), ధర్మేందర్ (14) అనే బాలలు బుధవారం మరణించారు.

సామాజిక తెలంగాణ కోసం పోరాడాలి

- టీమాస్ ఆవిర్భావ సభలో వక్తలు



నల్గొండ అర్బన్, కెఎన్ఎన్ : సామాజిక తెలంగాణ కోసం ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి టీమాస్ ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో టీమాస్ ఆవిర్భావ సభకు ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. టీమాస్ ఆధ్వర్యంలో చర్లపల్లి రోడ్డు నుంచి జిల్లా కేంద్రం వరకు బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం జరిగే దిశగా టీమాస్ ఫోరం ఉద్యమించాలని అన్నారు. కోటి ఆశలతో ఎందరో త్యాగాల ఫలితంగా తెచ్చుకున్న తెలంగాణాను కేసీఆర్ ప్రభుత్వం ప్రజల ఆశలను నిర్వీర్యం చేసినారని అన్నారు. కేజీ టూ పీజీ, డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం దళితులకు మూడెకరాల భూమి ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీలు ఇచ్చి నేటికి ఏఒక్కటి కూడా అమలు చేయకుండా కోర్టులు దిక్కరించే విధంగా నోటి ఫికేషన్లు జారీ చేసి ఇతరులపై తప్పుడు ప్రచారం ఇసున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు న్యాయం జరిగేందుకే టీ మాస్ ఫోరం ఆవిర్భవించిందని అన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ చిన్నా పెద్ద తేడా లేకుండా ఉద్యమించామని అన్నారు. అగ్ర కులాలకు కొమ్ము కాయకుండా టీమాస్ ఫోరం ఆధ్వర్యంలో ఉద్యమించి పూలే అంబేద్కర్ ఆశయ సాధన కోసం ఉద్యమించాలన్నారు. కంచె అయిలయ్య మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని గాంధీ యూనివర్సిటీ మార్చి సాకలి అయి లమ్మ పేరు పెట్టాలన్నారు. ఎల్‌కేజీ నుంచి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ బోధన అందించాలన్నారు. అనంతరం గద్దర్ ఆట పాటలతో కళా ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఎల్ విశ్వేశ్వర రావు, రాష్ట్ర తెలంగాణ మేధావుల ఫోరం కమిటీ సభ్యులు జేపీ రాజు, జె.జాన్‌వెస్లీ ఏఎల్ మల్లయ్య, వెల్లెల బాలకృష్ణ వివిధ సంఘాల నాయకులు నారి ఐలయ్య, ప్రభావతి, వైద్యం వెంకటేశ్వర్లు, వైద్యం సత్యనారాయణ పాల్గొన్నారు.



భారీగా పెరిగిన ఖరీఫ్ విస్తీర్ణం

• అంచనాలకు మించి పెరిగిన పత్తి పంట

• సాధారణ విస్తీర్ణాన్ని మించిన వరి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ఖరీఫ్ పనులు జోరుగా సాగుతున్నాయి. క్షేత్రస్థాయిలో పెట్టుబడులు సమకూర్చుకోవడం, మానవ వనరుల కొరత ఏర్పడడం తదితర కారణాలవల్ల కొంత ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ రైతులు సాగుపై పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. దీంతో దాదాపు అన్ని పంటల విస్తీర్ణం లక్ష్యానికి చేరువలోనే కనిపిస్తున్నాయి. ప్రధానమైన వరిపంట 9.34 లక్షల హెక్టార్లలో సాగవుతుందని వ్యవసాయశాఖ లక్ష్యంగా పెట్టుకుంటే ఇప్పటి వరకు 5.45 లక్షల హెక్టార్లలో సాగైనట్లు అధికారులు వెల్లడించారు. అలాగే జొన్న, మొక్కజొన్న, రాగులు, సజ్జలు తదితర పంటలన్నీ కలుపుకుని తృణ ధాన్యాల సాగు విస్తీర్ణం 90 శాతానికి చేరింది. అలాగే కంది, మినుము, పెసర తదితర పప్పుదినుసుల పంటలు 4.22 లక్షల హెక్టార్లలో సాగవుతుందని అంచనా వేస్తే, ఇప్పటికే 88 శాతం విస్తీర్ణం దాటింది. వేరుశనగ, ఆముదం, నువ్వులు, పొద్దుతిరుగుడు, సోయాబీన్ తదితర పంటల విస్తీర్ణం 3.25 లక్షల హెక్టార్లు లక్ష్యంగా పెట్టుకుంటే, తాజా నివేదిక ప్రకారం 72 శాతం విస్తీర్ణంలో ఈ పంటలు సాగయ్యాయి. వాణిజ్య పంటల్లో ప్రధానంగా పత్తి పంట సాధారణ విస్తీర్ణానికి 112 శాతానికి విపరీతంగా పెరిగింది. తెలంగాణ వ్యాప్తంగా 16.76 లక్షల హెక్టార్లలో పత్తి సాగవుతుందని అధికారులు అంచనా వేస్తే 18.20 లక్షల హెక్టార్లకు పెరిగింది. మొత్తం అన్ని పంటల విస్తీర్ణం కలుపుకుని 43.24 లక్షల హెక్టార్ల సాగు విస్తీర్ణంలో ఇప్పటి వరకు 36.80 లక్షల హెక్టార్లలో పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ విడుదల చేసిన తాజా నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. గత ఏడాది ఇదే సమయానికి ఖరీఫ్ పంటల విస్తీర్ణం 33.60 లక్షల హెక్టార్ల వద్దే సాగు స్తంభించింది. అంతకు ముందు ఏడాది 31.56 లక్షల హెక్టార్లుగానే ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. వ్యవసాయశాఖ అధికారుల అంచనాల ప్రకారం ప్రస్తుత సమయానికి సాధారణణ విస్తీర్ణంలో 31.50 లక్షల హెక్టార్లు మాత్రమే సాగుకావాలి. కానీ రైతుల్లో పెరిగిన ఆసక్తి, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు సానుకూల వాతావరణం కలిగించడంతో దాదాపు ఏడున్నర లక్షల హెక్టార్ల విస్తీర్ణం పెరిగింది. ఈ లెక్కలను పరిశీలిస్తే ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగు పడడానికి సానుకూల సంకేతాలు కనిపిస్తున్నాయి.

వ్యర్థాల నిర్వహణపై ఇంటర్నేషనల్ ఫెయిర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యర్థ పదార్థాల నిర్వహణపై ఇంటర్నేషనల్ ఫెయిర్ ఆన్ ఎన్విరాన్మెంట్ టెక్నాలజీ (ఐఎఫ్ఎటి) సెప్టెంబర్ 26 నుంచి 28వ వరకు అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనుంది. ఈ ఎగ్జిబిషన్‌లో దేశ, విదేశాలకు చెందిన 160 కంపెనీలు పాల్గొంటుండగా, 18 దేశాల నుంచి కూడా కంపెనీలు, ప్రతినిధులు భాగస్వాములవుతున్నారని ఐఎఫ్ఎటి సీనియర్ మేనేజర్ హూలా మండల్ చెప్పారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో జర్మనీ, జపాన్, చైనా, ఇంగ్లాండ్, ఇటలీ లాంటి దేశాల నుంచి ఎన్విరాన్మెంట్‌లో అంతర్జాతీయ నైపుణ్యం కలిగిన సంస్థలు పాల్గొంటాయని బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. భారత్ నుంచి కూడా వేస్ట్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ సంస్థలతో పాటు వీటి సేవలను వినియోగించుకుంటున్న అనేక పెద్ద కంపెనీలు కూడా పాల్గొంటాయని హూలా తెలిపారు. గత ఏడాది నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో మంచి స్పందన వచ్చిందని, ఈ ఏడాది దాదాపు 7వేల మంది సందర్శకులు వస్తారని అంచనా వేశామని ఆయన చెప్పారు. వేస్ట్ మేనేజ్‌మెంట్ రంగంలో వచ్చిన టెక్నాలజీ, దాని వినియోగంపై నిపుణులు వివరిస్తారని ఆయన చెప్పారు. ఈ ఎగ్జిబిషన్ సందర్భంగా బీ టు బీ, బీ టు సీ అవగాహన ఒప్పందాలు పెద్దఎత్తున కుదురుతాయని హూలా ఆశాభావం వ్యక్తంచేశారు. వేస్ట్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ, ఈవేస్ట్ రీసైక్లింగ్, ఫుడ్ ఐటమ్స్, బయోవాస్, ప్లాస్టిక్ వేస్ట్, మునిసిపల్ వేస్ట్, వాటర్ పొల్యూషన్ టెక్నాలజీపై అధునాతన పరికరాలు, యంత్రాలు ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తారని హూలా చెప్పారు. వేస్ట్ మేనేజ్‌మెంట్ రంగంలో దేశంలో 500 కంపెనీలు పని చేస్తున్నాయని, ఈ కంపెనీలు టెక్నాలజీ పెంచుకునేందుకు అనువుగా విదేశీ సంస్థలతో ఎంవోయూ కుదుర్చుకునే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్, రసాయనాలు, సిమెంట్, కాగితం, లెదర్ ఇండస్ట్రీ, మునిసిపల్ వేస్ట్ తదితర రంగాల్లో వస్తున్న మార్పులపై ఈ ఎగ్జిబిషన్‌లో నిపుణులు తమ అనభవాలను వివరిస్తారని హూలా చెప్పారు.



ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేయాలి

టీపీఎస్సీని ముట్టడించిన నిరుద్యోగ జేఏసీ

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు జారీ చేయాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 1.20 లక్షల పోస్టులకు నోటిఫికేషన్లను జారీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ జేఏసీ బుధవారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. ముట్టడికి ప్రయత్నించిన నిరుద్యోగులను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. నిరుద్యోగులు లోనికి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేకపోవడంతో నిరుద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ముట్టడి కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, నేతలు గుజ్జ కృష్ణ, గొరిగే మల్లేష్ యాదవ్, వేముల రామకృష్ణ, గంగనబోయిన రాంబాబు, సి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల ఉద్యోగాలకు ఖాళీగా ఉన్నాయని ఆర్ కృష్ణయ్య తెలిపారు. గ్రూప్-1లో 1200 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. గ్రూప్-2లో జరిగిన పొరపాట్లను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 40 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల నేపథ్యంలో గ్రూప్-4 పోస్టులు 36 వేలు ఉన్నాయని వాటికి నోటిఫికేషన్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-2 పరీక్ష సందర్భంగా జరిగిన అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఏపిపిఎస్సీ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు.

డిగ్రీ ప్రవేశాలు అంతంత మాత్రమే

• మిగిలిపోయిన 55 శాతం సీట్లు

• ప్రభుత్వ కాలేజీల్లో సగం సీట్లు ఖాళీ

• ప్రైవేటు కాలేజీల్లో 40 శాతమే భర్తీ

• 100 శాతం భర్తీ అయిన కాలేజీ ఒక్కటీ లేదు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలు అంతంత మాత్రంగానే జరిగాయి. ప్రభుత్వ కాలేజీల్లో సగం సీట్లు ఖాళీగా ఉండగా. మొత్తం సీట్లలో కేవలం 45 శాతం మాత్రమే భర్తీ అయ్యాయి. రాష్ట్రంలో ఉన్న 122 ప్రభుత్వ కాలేజీల్లో మాత్రం 50 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఎయిడెడ్ కాలేజీల్లో కూడా 50 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ప్రైవేటు కాలేజీల్లో మరీ తక్కువగా 40 శాతం మాత్రమే సీట్లు భర్తీ అయ్యాయి. డోస్టు ద్వారా డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం కోసం అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో 4,10,267 సీట్లు ఉండగా వాటిలో కేవలం 1,85,945 మంది మాత్రమే కాలేజీల్లో చేరారు. ఇంకా 2,07,423 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికే మూడు విడతలుగా సీట్ల కేటాయింపును చేపట్టారు. మూడో విడత సీట్ల కేటాయింపులో సీట్లు పొందిన వారు కాలేజీల్లో చేరడానికి బుధవారంతో గడువు ముగిసింది. గత ఏడాది 2.40 లక్షల మంది డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరగా ఈ సారి కేవలం 1.85 లక్షల మంది మాత్రమే చేరారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది సుమారు 55 వేల మంది తక్కువగా కాలేజీల్లో చేరారు.

మూడు విడతలుగా సీట్ల కేటాయింపు

రాష్ట్రంలో 122 ప్రభుత్వ, 44 ఎయిడెడ్, 9 ప్రభుత్వ అటానమస్, యూనివర్సిటీ అటానమస్ కాలేజీలు 3, 2 యూనివర్సిటీ కాలేజీలు ఉన్నాయి. ఇవి కాకుండా 902 ప్రైవేటు డిగ్రీ కాలేజీలు ఉండగా, అటానమస్ కాలేజీలు 10 ఉన్నాయి. మొత్తంగా రాష్ట్రంలో 1092 డిగ్రీ కాలేజీలు ఉండగా వాటిలో 4,10,267 సీట్లు ఉన్నాయి. వాటిలో బుధవారం సాయంత్రానికి 1,85,945 సీట్లు భర్తీ కాగా ఇంకా సీటు పొంది కాలేజీల్లో చేరని వారు 16,899 మంది ఉండగా, ఇవి కాకుండా 2,07,423 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

డోస్టును వ్యతిరేకిస్తూ కోర్టుకెళ్లిన 28 కాలేజీలు

తమ కాలేజీల్లో ఫీజులు యూనివర్సిటీలు నిర్ణయించిన వాటికంటే ఎక్కువగా ఉన్నందున తాము డోస్టు ద్వారా సీట్లను భర్తీ చేసుకోబోమంటూ, తమకు అనుమతి ఇవ్వాలని కోరుతూ రాష్ట్రంలోని 28 ప్రైవేటు డిగ్రీ కాలేజీలు ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించాయి. దీంతో ఆయా కాలేజీల్లో సీట్ల కేటాయింపును డోస్టు ద్వారా కేటాయించాలని చెప్పినప్పటికీ తుది తీర్పు వెలవడే వరకు వారిని కాలేజీలో చేర్చుకోవద్దని కోర్టు స్పష్టం చేసింది. అలాగే ఆయా కాలేజీలు కూడా సీట్లను కేటాయించుకోవచ్చని తెలిపింది. దీంతో మొదటి విడతలోనే 28 కాలేజీల్లోని సీట్లకు డోస్టు ద్వారా సీట్లను కేటాయించారు. అలా 4500 మంది విద్యార్థులకు మొదటి విడతలోనే సీట్లను కేటాయించారు. కానీ కోర్టు తీర్పు నేపథ్యంలో డోస్టు ద్వారా సీటు పొందిన వారు ఆయా కాలేజీల్లో చేరే అవకాశం లేకుండా పోయింది. మొదటి విడతలోనే సీటు పొందినప్పటికీ వారు ఆయా కాలేజీల్లో చేరలేదు. ఆ కాలేజీలోనే కాదు, వారు ఇతర ఏ కాలేజీలోనూ చేరలేదు. ఇప్పటి వరకు వారు సీటు పొందినా కాలేజీలో చేరకుండా ఉండిపోవల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుని వారికి న్యాయం చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మూడో విడతలో 70,808 మందికి సీట్లను కేటాయించారు. వారిలో బుధవారం సాయంత్రం నాటికి 53,909 మంది కాలేజీల్లో చేరారు. ఇంకా 16,899 మంది సీటు పొందినప్పటికీ కాలేజీల్లో చేరలేదు. దీంతో ఖాళీగా ఉన్న 2,07,423 సీట్లతోపాటు 16,899 సీట్లు కూడా ఖాళీగా ఉన్నట్టే.

దరఖాస్తు చేసుకోని వారు 5 వేల మంది ఉన్నారు

ఇప్పటి వరకు డోస్టు ద్వారా డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరడానికి మూడు విడతలుగా దరఖాస్తులు చేసుకున్నారు. ఎంబిబిఎస్‌లో సీటు వస్తుందని, ఇంజనీరింగ్‌లో మంచి కాలేజీలో మంచి బ్రాంచ్ వస్తుందని భావించి డోస్టులో ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు ఉన్నారు. వీరు కాకుండా ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాలు వచ్చిన తరువాత సరైన అవగాహన లేక డోస్టులో దరఖాస్తు చేసుకోని గ్రామీణ ప్రాంత విద్యార్థులు మొత్తంగా 5 వేల వరకు ఉంటారు. వీరికి డోస్టులో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని విద్యార్థిసంఘాలు, ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్యాల సంఘాలు కోరుతున్నాయి. అదే మాదిరిగా ఇప్పటికే దరఖాస్తు చేసుకొని సీటు పొందలేని వారు ఉన్నారు. వారికి వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి సమయం ఇవ్వాలని కోరుతున్నారు.

నేడు డోస్టుపై సమావేశం

గురువారం నాడు డోస్టుపై జరిగే సమావేశంలో పై అన్ని విషయాలపై చర్చించి తగిన నిర్ణయం తీసుకుని విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. మరోసారి దరఖాస్తుకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

మేనేజ్‌మెంట్ల వారీగా సీట్లు, భర్తీ వివరాలు

మేనేజ్‌మెంట్	కాలేజీలు	సీట్లు	భర్తీ	ఖాళీలు
ప్రభుత్వడిగ్రీ కాలేజీలు	122	50,199	21,396	25,510
ప్రభుత్వ అటానమస్	9	9310	6952	1297
ఎయిడెడ్	44	16,165	8800	5955
ప్రైవేటు అటానమస్	10	9005	549	7609
అన్‌ఎయిడెడ్	902	3,22,250	1,45,360	1,67,022
యూనివర్సిటీఅటానమస్	03	2788	2430	30
యూనివర్సిటీ కాలేజీలు	02	550	458	-
మొత్తం కాలేజీలు	1092	4,10,267	1,85,945	2,07,423

నాయకుడి లక్షణాలే ప్రభావితం చేస్తాయి

• విలువలతోనే విజయాలు • హెచ్ఎంఏ అవార్డు ప్రధానోత్సవంలో గవర్నర్ నరసింహన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : నాయకుడి ప్రవర్తన, నైతికత, అనుసరించే విధానాలు సమాజంలో ప్రభావం చూపుతాయని, ఆయననే స్ఫూర్తిగా తీసుకుంటారని రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ అన్నారు. నాయకుడు సన్మార్గంలో నడుస్తూ భావి తరాలకు మార్గం చూపుతారని, అది సమాజ శ్రేయస్సుకు దోహదపడేలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. క్రమశిక్షణ, అంకితభావం, నైతిక విలువలతో ఏ వృత్తిలోనైనా ఇమిడిపోతే విజయాలు వరిస్తాయని ఆయన అన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన వారికి హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఏ) ప్రకటించిన అవార్డులను ఆయన బుధవారం ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లను నరసింహన్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఏ అధ్యక్షుడు కె.అర్జున ప్రసాద్, మాజీ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, మన దేశంలో అందుబాటులో ఉన్న మానవ వనరులను సద్వినియోగం చేసేందుకు వారికి అవసరమైన నైపుణ్యం కల్పించాలన్నారు. యాజమాన్యం అనేది హృదయాంతరాల నుంచి వచ్చే ఒకకళ అని, చిత్తశుద్ధి, అంకితభావం, సానుకూల ఆలోచనా దృక్పదం, వాస్తవికతతో ఆచరణతోనే ఉత్తమ యాజమాన్య నిపుణుడిగా నిలుస్తాడని ఆయన అన్నారు. దేశంలో లభించే వనరులను దృష్టిలో ఉంచుకుని వాటికి తగ్గట్టుగా వ్యూహాత్మకంగా వ్యవహరించి ఫలితాలు సాధించాలని నరసింహన్ చెప్పారు. వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని, వృత్తిపరమైన విలువలు పాటించడం చాలా ముఖ్యమని గవర్నర్ అన్నారు. భారత్‌లో అపారమైన మానవ వనరులు ఉన్నాయని, వాటి వినియోగం ద్వారా సంపద, ఉపాధి సృష్టించాలని ఆయన చెప్పారు. యాజమాన్యంగానీ, నిర్వాహకుడికిగానీ ఆర్థిక విషయాల్లో నైతికత ఎంతో అవసరమని ఆయన చెప్పారు. వ్యక్తిగత విలువలపైనే వృత్తిపరమైన విజయాలు ఆవిష్కృతమవుతాయని గవర్నర్ చెప్పారు. వ్యక్తిత్వం, అంకితభావం, శ్రమతోనే ఉన్నతస్థాయికి చేరుకుంటారని, వివిధ వృత్తుల్లో ఉన్నవారు లక్ష్యాలను అధిగమించేందుకు ఉన్నత ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉందని నరసింహన్ అన్నారు. 2016 సంవత్సరానికిగానూ ఏడు విభాగాల్లో హెచ్ఎంఎ అవార్డులను ప్రకటించింది. ఇందులో లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డుకు ప్రముఖ శాస్త్రవేత్త పద్మభూషణ్ డాక్టర్ వీకే సారస్వత్‌ను ఎంపిక చేసింది. అలాగే మేనేజ్‌మెంట్ ఆఫ్ ది ఇయర్ అవార్డును డిఆర్‌డిఎల్ అసోసియేట్ డైరెక్టర్ జి.చంద్రమౌళి, ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఉమా గుర్కా, ఉత్తమ స్మాల్‌స్కేల్ టి.బాలకృష్ణకు, హెచ్ఆర్ మేనేజర్ అవార్డు కెవిఎస్ఎస్ నారాయణరావుకు, సిఎస్ఆర్ అవార్డుకు ఫోనిక్స్ ఫౌండేషన్‌ను, హెచ్ఎంఎ మెంబర్ ఆఫ్ ఇయర్ ప్రొఫెసర్ కెవి అచలపతికి అవార్డులు ప్రదానం చేశారు.

ఫీజు తేడాలను సవరించాలి

తెలంగాణ ప్రైవేటు కాలేజీల అసోసియేషన్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేవిద్యార్థులకు డోస్టులో ఒకరకమైన ఫీజు, ఈ పాస్‌లో మరో రకంగా ఫీజు వివరాలు ఉన్నాయని వాటిని సరిచేయాలని తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజెస్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. డోస్టు అలాట్‌మెంట్‌లో ఫీజు వేరగా, ఈ పాస్‌లో వేరేగా ఉన్నాయని వాటి ద్వారా సరి చేసి విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలని అసోసియేషన్ నేతలు బుధవారం ఉన్నత విద్యా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్యతోపాటు ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయ్‌భాస్కర్‌రెడ్డి, నాయకులు గౌరీ సతీష్, జి నాగయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, పరమేష్ తదితరులు ఉన్నారు. డోస్టులో సీటు పొందిన వారికి అలాట్‌మెంట్ లేఖలో ఫీజు రూ. 12,535 ఉండగా అదే కోర్సుకు ఈ పాస్‌లో మాత్రం కేవలం రూ.9780 మాత్రమే ఉంది. రెండింటిలో వ్యత్యాసం ఉన్నందున దీనిని సరిచేయాలని వారు కోరారు. లేకపోతే విద్యార్థిపై సుమారు రూ. 2000 భారం పడేప్రమాదం ఉందన్నారు. అలాగే డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందడం కోసం డోస్టులో దరఖాస్తు చేసుకోవడానికి మరోసారి అవకాశం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వెబ్‌ఆప్షన్లకు మరోసారి అవకాశం కల్పించాలని కోరారు.



తంబీల కుర్చీలాట

• పళనిని సీఎం పీఠం నుంచి దించేందుకు చిన్నమ్మ వర్గం ఎత్తులు • జైల్లోంచే చక్రం తిప్పుతున్న శశికళ

• బలపరీక్షకు ప్రతిపక్షాల డిమాండ్ • గవర్నర్ కోర్టుకు ఫిర్యాదులు • దమ్ముంటే ప్రభుత్వాన్ని కూల్చండంటూ పన్నీర్ సవాల్



చెన్నై: తమిళనాట రాజకీయాలు రక్తికడుతు న్నాయి. అన్నాడీఎంకేలోని రెండు వర్గాలు ఒక్కటైన తర్వాత మూడో వర్గం రేపిన కార్చిచ్చు.. దావానంలా విస్తరిస్తోంది. అమ్మకు వీరవిధేయు లైన పన్నీర్, పళనిలు ఏకం కావడాన్ని జీర్ణించుకోలేని చిన్నమ్మ శశికళ జైలు నుంచి రాజకీయాలను నెరుపుతున్నారు. పన్నీర్,పళని కలయికను సహించలేకపోతున్న చిన్నమ్మ వర్గం నేత టీటీవీ దినకరన్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కంకణం కట్టుకున్నారు. ఇక అన్నాడీఎంకే పార్టీకి చెందిన 19 ఎమ్మెల్యేలను దినకరన్ గవ్నరర్ ముందుకూర్చోబెట్టి గంటలు గడవక మందే... ప్రభు త్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షాలువ్యూహాలకు పదునుపెం చాయి. ప్రభుత్వం అసెంబ్లీలో బలపరీక్ష నిరూపించుకోవాలని కాంగ్రెస్,డీఎంకే రాజ్‌భవన్ వైపు అడుగులువేశాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యే రామస్వామి22 మంది ఎమ్మెల్యేల మద్దతుతో గవర్నర్ విద్యాసాగర్ రావుకు లేఖ రాశారు. ముఖ్యమంత్రి పళనిస్వామిపై తమకు నమ్మకం లేదని... వెంటనే బలపరీక్షకు ఆదేశించాలని రామస్వామి లేఖలో పేర్కొన్నారు. కర్నాటకలో యడ్యూరప్ప ప్రభుత్వాన్ని బలపరీక్ష నిరూపించుకోవాలని ఆ రాష్ట్ర గవర్నర్ ఎలా ఆదేశించారో అదేవిధంగా తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే బలపరీక్షకు దిగకుండా గవర్నర్ తో చర్చల పేరుతో కాలయాపన చేస్తే అది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను ఉల్లంఘించినట్లే అవుతుందని రామస్వామి ఆరోపించారు. రామస్వామి లేఖపై రాజ్‌భవన్ వర్గాల నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. కాలయాపన జరిగితే గతంలో మాదిరిగా అసెంబ్లీలో హార్స్‌ట్రేడింగ్ జరిగినా ఆశ్చర్యం పోవాల్సిన అవసరం ఉండదని వ్యాఖ్యానించారు. ఎస్ఆర్ బొమ్మై కేసులోసుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా గవర్నర్ వెంటనే తమిళనాడు ప్రభుత్వాన్ని బలపరీక్షకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.


దినకరన్ కుటిల రాజకీయాలు

తమిళ రాజకీయాల్లో వర్గపోరును పెంచిపోషిస్తున్న వారిలో దినకరన్ ముఖ్యుడు.. ఓవైపు పార్టీని చిన్నమ్మ కనుసన్నల్లో నడవాలని ఆకాంక్షిస్తూనే...ప్రభుత్వాన్ని కూడా తన వర్గం వారు నడపాలన్న బలమైన కోరికతో ఉన్నారు. అందుకే మొదట పన్నీర్‌ను పార్టీకి దూరం చేయించి ...ఆరునెలలుగా పళనిపై పట్టు సాధించేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. ఎన్నికల సంఘానికి లంచం ఇవ్వజూపి అడ్డంగా బుక్కవ్వడంతో దినకరన్ చాప్టర్ క్లోజ్ అయిపోయిందని భావించిన పళని...పన్నీర్‌కు దగ్గరయ్యేందుకు మొగ్గు చూపడంతో సీన్ రివర్సయింది. బెయిల్‌పై బయటకొచ్చిన దినకరన్ రెండు వర్గాల వారిపై కక్షసాధింపు చర్యలకువ్యూహాలు రచిస్తున్నారు. పళని,పన్నీర్ వర్గాలు ఏకమవ్వడాన్ని జీర్ణించుకోలేకపోయిన దినకరన్ తన పాచికలను ప్రయోగించడం ప్రారంభించారు. పళని ప్రభుత్వంపై తమకు నమ్మకం లేదంటూ 19 మంది ఎమ్మెల్యేలను గవర్నర్ వద్దకు తీసుకెళ్లి...తమ అసమ్మతిని వెల్లగక్కడంతో పాటు అన్నాడీఎంకే పార్టీలోని ఎమ్మెల్యేలను చీల్చేందుకు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే మరోసారి బలపరీక్ష అస్త్రాన్ని ప్రయోగించారు. సీఎంకు వ్యతిరేకంగా గవర్నర్ కలిసిన ఎమ్మెల్యేలపై వేటు పడకుండా కూడా దినకరన్ ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. బలరీక్ష సమీయంలో నాయకత్వంపై అసమ్మతితో ఉన్న రెబల్ ఎమ్మెల్యేలను అన్నాడీఎంకే డిస్ క్వాలిఫై చేయాలని స్పీకర్‌కు ప్రతిపాదించినా తప్పించుకునేలా ప్లాన్ చేశారు. గతంలో కర్నాటకలో యడ్యూరప్ప ప్రభుత్వంపై బలపరీక్షనిర్వహించిన సమయంలో రెబల్ ఎమ్మెల్యేలను డిస్ క్వాలిఫై చేయడాన్ని సుప్రీంకోర్టు ఆక్షేపించింది. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని తమ ఆయుధంగా మలుచుకుని దినకరన్ ఎమ్మెల్యేలను రంగంలోకి దించారు.

జైల్లోంచే చక్రం తిప్పుతున్న శశికళ


జయలలిత మరణం తర్వాత అన్నాడీఎంకే పార్టీలో చిచ్చుపెట్టిన శశికళ... అక్రమాస్తుల కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్నప్పటికీ. .అక్కడినుంచి రాజకీయాలు నెరుపుతున్నారు. జయలలిత ఆస్పత్రిలో ఉన్నప్పుడే ఆమెకు విశ్వాసపాత్రుడైన పన్నీర్ సెల్వం తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసినప్పటికీ ఆయనపై ఆధిపత్యం కోసం శశికళ విశ్వప్రయత్నాలు చేశారు. చెప్పిన మాట వినకపోవడంతో పన్నీర్‌ను పక్కనబెట్టారు. దీంతో మరో విశ్వాసపాత్రుడు పళనిస్వామిని సీఎంగా చేసి..తన మేనల్లుడు దినకరన్ ను పార్టీలో నెంబర్ 2 నాయకుడిగా చేశారు. జయలలిత మరణంతో ఖాళీ అయిన ఆర్కేనగర్ ఉప ఎన్నికల్లో పన్నీర్ వర్గానికి, శశికళవర్గానికి పార్టీ గుర్తు విషయంలో వివాదం రావడంతో ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈనేపథ్యంలో ఈసీకి లంచం ఇవ్వజూపి దినకరన్ అరెస్టవడం తో పళనిస్వామి స్వేచ్ఛా జీవిలో వ్యవహరించసాగారు. ఇదే తరుణంలో పళనిస్వామి చిన్నమ్మ ఆదేశాలను బేఖాతరు చేయడంతో ఆయన్ని కూడా తప్పించేందుకు జైలులోనే వ్యూహాలు రచించినట్లు తెలుస్తోంది. తన మేనల్లుడుదినకరన్ ద్వారా ఇప్పటికే 19మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను తన వైపుతిప్పుకున్న శశికళ...ఇతర ఎమ్మెల్యేతోనూ తిరుగుబాటు చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.. మాట వినని వారిని... తప్పించడంలో వెనకాడని చిన్నమ్మ తన పంతం నెగ్గించుకునేందుకు 19 మంది ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రిపై అసమ్మతి నాటకం ఆడిస్తూ వారిని పుదుచ్చేరికి తరలించారు. పళని,పన్నీరు వర్గీయులు తమ మద్దతుదారులకు ఎర చూపకుండా వారందరినీ ఓ రిసార్ట్ లో ఉంచారు. చిన్నమ్మ,దినకరన్ కనుసన్నల్లో మెసులుతున్న ఎమ్మెల్యేలంతా పళని రాజీనామాకు డిమాండ్ చేస్తున్నారు. పళనిని మారిస్తే తప్ప తమ వైఖరిలో మార్పు ఉండబోదని చిన్నమ్మ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ప్రకటించారు.

దమ్ముంటే కూల్చా ...పన్నీర్ సవాల్




అన్నాడీ ఎం కే లో ని రెండు వర్గాలు విలీనమైన వేళ కొంతమంది ఎమ్మెల్యేలతో తిరుగుబావుటా ఎగరవేసిన దినకరన్ కు తమిళనాడు డిప్యూటీ సీఎం పన్నీర్‌సెల్వం తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. రిసార్ట్ రాజకీ యాలకు తెరలేపిన దినకరన్‌కు దమ్ముంటే తమ ప్రభుత్వాన్ని కూల్చాలని సవాల్ విసిరారు. తమ ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఎవరికీ లేదని పన్నీర్ వ్యాఖ్యానించారు. అరియలూర్‌లో జరిగిన ఎంజీఆర్ జయంత్యుత్సవానికి సీఎం పళని స్వామికూడా హాజరైన సమయంలో పన్నీర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

మరోబాంబ్ పేల్చిన రూప



కర్నాటక డీఐజీ రూప మరో బాంబ్ పేల్చారు. పరప్పన అగ్రహారం జైలులో శిక్ష అనుభవిస్తున్న అన్నాడీఎంకే నాయకురాలు శశికళ ఇటీవల హోసూర్ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లొచ్చారని ఆరోపించారు. జైలు అధి కారులు శశికళ దగ్గర లంచం తీసుకుని ఆమెకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారని ఆరోపించి.. చిన్నమ్మ బయట నుంచి జైలులోకి వస్తున్న వీడియోను ఏసీబీకి అందించిన రూప...తాజాగా ఆ వీడియోకు సంబంధించిన లింక్‌ను తెలియజేశారు. బయటకు వెళ్లిన సమయంలో శశికళ హోసూర్ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లినట్లు తనకు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిందని ఏసీబీకి వివరించారు. సెంట్రల్ జైలు గేట్ 1,గేట్ 2 దగ్గర ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలోని దృశ్యాలే ఇందుకు సాక్షమని వెల్లడించారు. శశికళకు ఎలాంటి ప్రత్యేక వసతులు కల్పించడం లేదంటూ హోంమంత్రి, హోంశాఖ కార్యదర్శిని జైలు అధికారులు తప్పుదోవపట్టించారని కూడా రూప ఆరోపించారు.

శశికళకు ఎదురుదెబ్బ



అన్నాడీఎంకే నాయకురాలు శశికళకు సుప్రీం కోర్టులో మరోసారి ఎదు రుదెబ్బ తగిలింది. జైలు నుంచి బయటప డాలన్న ఆమె ఆశలపై సర్వోన్నత న్యాయస్థానం నీళ్లుజల్లిం ది.అక్రమాస్తుల కేసులో జైలుశిక్షఅనుభవి స్తున్న శశికళ..తన శిక్షను రద్దు చేయాలన్న అభ్యర్థ నను కోర్టు తోసిపుచ్చింది. ఈ కేసులో ప్రధాన నింది తురాలైన జయలలిత మరణించినందున తన అభ్యర్థనను మన్నించి జైలు శిక్ష రద్దు చేయాలని కోరినా...న్యాయస్థానం పట్టించుకోలేదు.శశికళ శిక్షలో మార్పేమీలేదని తెలిపింది. శశి కళ జైలు శిక్ష రద్దు చేయడానికి ఎలాంటి కారణం కనిపించడం లేదని న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

యూపీలో మరో రైలు ప్రమాదం

- పట్టాలు తప్పిన కైఫియత్ ఎక్స్‌ప్రెస్
- 74 మందికి గాయాలు..నలుగురి పరిస్థితి విషమం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో మరో రైలు ప్రమాదం జరిగింది. గత శనివారం ముజఫర్‌నగర్ ఖతౌలి వద్ద ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ విషాదాన్ని మరవకముందే బుధవారం మరొక ప్రమాదం చోటుచేసుకుంది. తెల్లవారుజామున 2.50 గంటల ప్రాంతంలో కైఫియత్ ఎక్స్‌ప్రెస్ ఆరియా వద్ద పట్టాలు తప్పింది. ఈ ఘటనలో 10 బోగీలు పట్టాల నుంచి పక్కకు వొరిగాయి. 74 మందికి పైగా గాయాలయినట్లు తెలుస్తోంది. ఆజంగఢ్ నుంచి ఢిల్లీ వెళ్తుండగా పాట్నా-అచ్చల్ద స్టేషన్ల మధ్య ప్రమాదం జరిగింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఉత్తర మధ్య రైల్వే అధికార ప్రతినిధి తెలిపారు. డంపర్‌కు ట్రైన్ ఢీకొనడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు రైల్వే డీజీ పీఆర్వో అనిల్ స్పష్టంచేశారు. క్షతగాత్రులను దగ్గర్లోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై రైల్వే మంత్రి సురేశ్ ప్రభు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సహాయక చర్యలు చేపట్టింది. గాయపడిన వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తున్నది.



ఉత్కళ్ ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభం

గత శనివారం జరిగిన ఉత్కళ్ రైలు ప్రమాదంపై రైల్వే పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. 13 బోగీలు పట్టాలు తప్పిన ఈ ఘటనలో 22 మంది మరణించగా156 మంది గాయపడిన విషయం తెలిసిందే. దర్యాప్తు అధికారి జీఆర్‌పీ డిప్యూటీ సూపరింటెండెంట్ రణధిర్ సింగ్ మంగళవారం స్థానికులను విచారించారు. ప్రమాద సమయంలో పరిణామాలపై అడిగి తెలుసుకున్నారు. విధినిర్వహణలో ఉన్న ఖతులి రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్‌తోపాటు 12 మంది గ్యాంగ్‌మెన్‌లకు భద్రత కమిషనర్ సమన్లు జారీచేశారు.

సురేశ్‌ప్రభు రాజీనామా చేయాలి: కాంగ్రెస్

న్యూఢిల్లీ: వరుస రైలు ప్రమాదాలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. ప్రయాణికులకు భద్రత కల్పించడంలో, ప్రమాదాల నివారణలో రైల్వే మంత్రిగా సురేశ్ ప్రభు ఘోరంగా విఫలం అయ్యారని ధ్వజమెత్తింది. వెంటనే ఆయనను పదవి నుంచి తప్పించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీని డిమాండ్ చేసింది. ఆయన స్థానంలో జవాబుదారీ వ్యక్తికి బాధ్యతలు అప్పగించాలని సూచించింది. దుర్ఘటనలకు రైల్వే మంత్రి నైతిక బాధ్యత వహించాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సూర్జేవాలా అన్నారు. రైల్వేల భద్రతపై రోడ్‌మ్యాప్‌కు ప్రధాని చర్యలు చేపట్టేందుకు ముందుకు రావాలని హితవు పలికారు. రైల్వే బోర్డు సభ్యుడిని సస్పెండ్ చేయడమో, సెలవుపై పంపించడమో సమస్యకు పరిష్కారం కాదన్నారు. ప్రభు రాజీనామాకు సిద్ధపడిన విషయాన్ని ప్రస్తావించగా, అది ఆమోదింప బడలేదుకదా అని ఎదురు ప్రశ్నించారు. రైల్వే భద్రతపై ప్రధాని దృష్టిసారించాలని, ఇందుకోసం నిధులు విడుదల చేయాలి. ఖాళీగా ఉన్న 1.42 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి. మోడీ ప్రభుత్వంలో ఇప్పటి వరకు 28 భారీ ప్రమాదాలు జరిగాయి. 259 మంది మరణించారు. 973 మంది గాయపడ్డారు. ఈ దశాబ్దంలోకెల్లా 2016-17లోనే ఎక్కువ ప్రమాదాలు జరిగాయి. 1219 రైల్వే లైన్లల్లో 40శాతం లైన్లు 100 శాతం సామర్థ్యానికి లోపలే ఉన్నాయని సూర్జేవాలా చెప్పారు. కాగా, ప్రభు రాజీనామా చేయాల్సిందేనని మరో సీనియర్ కాంగ్రెస్ నేత మనీశ్ తివారి డిమాండ్ చేశారు. బుల్లెట్ రైలు కోసం లక్ష కోట్లు ఖర్చు చేస్తున్న మోడీ, రైల్వేల భద్రత కోసం 40 వేల కోట్లు కేటాయించకపోవడం దురదృష్టకరమని అన్నారు.

తప్పుకుంటా.. అనుమతివ్వండి





- రైలు ప్రమాదాలకు నైతిక బాధ్యత నాదే
- ప్రధానిని కలిసిన మంత్రి సురేశ్ ప్రభు
- మంత్రి పదవికి రాజీనామా చేస్తానని ప్రకటన
- వేచిచూడాలని సూచించిన నరేంద్రమోడీ
- సురేశ్ ప్రభు నిబద్ధతను ప్రశంసించిన అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ: రైల్వేమంత్రి సురేశ్ ప్రభు సంచలన నిర్ణయం తీసుకున్నారు. రైల్వేలో ఇటీవల భారీ ప్రమాదాలు చోటుచేసుకోవడం, పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలకు నైతిక బాధ్యతగా పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధపడ్డారు. ఈ విషయాన్ని సురేశ్ ప్రభు స్వయంగా తన అధికారిక ట్విట్టర్ ద్వారా బుధవారం తెలిపారు. 'ఇటీవల చోటుచేసుకున్న రెండు రైలు ప్రమాదాలు నన్ను తీవ్రంగా బాధించాయి. దీనికి నైతిక బాధ్యత వహించాలనుకున్నాను. కొద్ది సేపటి కిందటే ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి నా నిర్ణయాన్ని చెప్పాను' అని సురేశ్ ప్రభు తెలిపారు. కాగా రాజీనామా విష యంలో తొందర పాటు తగదని, వేచివుండాలని ప్రధాని సూచిం చినట్లు ప్రభు ట్వీట్ చేశారు. 'రైల్వే మంత్రిగా దాదాపు మూడేళ్ల కాలం లో.. రైల్వేల అభివృద్ధి కి చెమటను, రక్తాన్ని ధారపోశాను. ప్రధాని మోదీ నాయకత్వంలో దశాబ్దాలుగా రైల్వే వ్యవస్థలో తిష్టవేసిన నిర్లక్ష్యాన్ని రూపుమాపాను. ఇందుకోసం సంస్థాగత సంస్కరణలను వేగ వంతం చేశాను. ఈ కాలంలో రైల్వే శాఖ కొత్త మైలురాళ్లను చేరుకుంది. ప్రధానమంత్రి నూతన భారత్ విజన్‌లో భాగంగా రైల్వేలను ఆధునీకీకరించే ప్రయత్నాలను ముమ్మ రం చేశాను. అయితే దురదృష్టవ శాత్తు జరుగుతున్న రైల్వే ప్రమాదాలు నన్ను దిగ్భ్రాంతికి గురిచేశాయి. ప్రయాణికుల విలువైన ప్రాణాలు ప్రమాదాలకు బలికావడం, మరెందరో తీవ్రంగా గాయపడటం నన్ను ఎంతగానో బాధపెడుతున్నాయి. అందుకే దీనికి నైతిక బాధ్యత వహిస్తూ.. ప్రధాని మోదీని కలిశాను. అయితే మోదీ నన్ను కొంతకాలం వేచి ఉండమని చెప్పారు' అని ప్రభు తెలిపారు. ప్రభు ట్వీట్లపై నెటిజన్లు స్పందించారు. 'మీలాంటి నిజాయతీ గల నాయకులు రాజీనామా చేయడం సరికాదు.. బాధ్యతల నుంచి వైదొలగద్దు' అని కోరారు అంటూ ప్రభు ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కాగా, రైల్వే మంత్రి నిర్ణయంపై నెటిజన్లు హర్షం వ్యక్తంచేశారు. మీలాంటి నిజాయతీ పరులైన నాయకులు రాజీనామా చేయడం తగదని, రైల్వేల అభివృద్ధికి మీరు చేసిన కృషి అభినందనీయమంటూ కామెంట్లు చేశారు. ఇదిలావుండగా, రైలు ప్రమాదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామాకు సిద్ధపడిన సురేశ్ ప్రభు నిర్ణయాన్ని సహచర కేబినెట్ మంత్రి అరుణ్‌జైట్లీ ప్రశంసించారు. ప్రభుత్వంలో జవాబుదారీతనం మంచి వ్యవస్థకు సూచన. ఈ విషయంపై ప్రధాన మంత్రి నిర్ణయం తీసుకుంటారని జైట్లీ వ్యాఖ్యానించారు.



సురేశ్ ప్రభు హయాంలో రైలు ప్రమాదాల వివరాలు

☞ **2015 ఫిబ్రవరి 13:** బెంగళూరు నగర శివార్లలో జరిగిన రైలు ప్రమాదంలో 10 మంది మరణించారు. మరో 150 మంది గాయపడ్డారు. బెంగళూరు-అనెకల్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. డీ9, డీ8 బోగీలు ప్రమాదానికి గురయ్యాయి.

☞ **2015 మార్చి 20:** డెహ్రాడూన్-వారణాసి జనతా ఎక్స్‌ప్రెస్ రాయ్‌బరేలి వద్ద పట్టాలు తప్పింది. ఉదయం 9 గంటల ప్రాంతంలో జరిగిన ఈ ప్రమాదంలో 58 మంది మర ణించగా, 150 మంది గాయప డ్డారు. బ్రేక్ ఫెయిల్ కావడమే ఈ ప్రమాదానికి కారణమని దర్యాప్తులో తేలింది.

☞ **2015 మే 25:** రూర్కెలా జమ్ముతావి మూరి ఎక్స్‌ప్రెస్ రైలు ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో పట్టాలు తప్పింది. 8 బోగీలు పక్కకు జరిగిన ఈ ఘటనలో 5 గురు మరణించగా, 50 మంది గాయపడ్డారు.

☞ **2015 ఆగస్టు 4:** మధ్యప్రదేశ్‌లో రెండు రైళ్లు ప్రమాదానికి గురయ్యాయి. కామయాని, జనతా ఎక్స్‌ప్రెస్‌లు పట్టాలు తప్పిన దుర్ఘటనలో 31 మంది మరణించగా, 100 మంది గాయపడ్డారు. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు మచక్ నదిలో కొట్టుకుపోయారు.

☞ **2015 సెప్టెంబర్:** సికిందరాబాద్-ముంబై లోకమాన్య తిలక్ దురంతో ఎక్స్‌ప్రెస్ కర్నాటక సమీపంలోని కల్బుగివద్ద పట్టాలు తప్పింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు మరణించగా, ఏడుగురు గాయపడ్డారు.

☞ **2015 సెప్టెంబర్ 12:** కల్కా నుంచి సిమ్లా వెళ్తున్న శివాలిక్ క్వీన్ చార్టెడ్ రైలు పట్టాలు తప్పింది. 36 మంది బ్రిటీషు పర్యాటకులు ప్రయాణిస్తున్న ఈ రైలు ప్రమాదంలో ఇద్దరు మరణించగా, 15 మంది గాయపడ్డారు.

☞ **2016 నవంబర్ 20:** ఇండోర్-పాట్నా ఎక్స్‌ప్రెస్ ప్రమాదం. కాన్పూర్‌కు సమీపంలోని పుఖ్రయాన్ వద్ద రైలు నుంచి బోగీలు పక్కకు వొరిగాయి. ఈ ఘటనలో 150 మంది మరణించగా, 150మంది గాయపడ్డారు.

☞ **2017 జనవరి 22:** జగ్దల్‌పూర్-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాలో జరిగిన ఈ ప్రమాదంలో 41 మంది ప్రయాణికులు మరణించారు.

☞ **2017 ఆగస్టు 19:** ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ యూపీలోని ముజఫర్ నగర్ వద్ద ప్రమాదానికి గురైంది. ఢిల్లీ నుంచి షహనాపూర్ వెళ్తుండగా పట్టాలు తప్పింది. ఈ దుర్ఘటనలో 34 మంది మరణించగా, 150 మంది గాయపడ్డారు.

రైల్వే బోర్డు చైర్మన్ పదవికి మిట్టల్ రాజీనామా.. కొత్త చైర్మన్‌గా అశ్వని లోహని



న్యూఢిల్లీ: వరుస రైలు ప్రమాదాల నేపథ్యంలో రైల్వే బోర్డు చైర్మన్ ఏకే మిట్టల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ప్రమాదాలకు నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. రైల్వేబోర్డు నూతన చైర్మెన్‌గా అశ్వని లోహని నియమితులయ్యారు. ఎయిర్ ఇండియా సీఎండీగా ఉన్న అశ్వని లోహని అదనంగా రైల్వే బోర్డు చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. లోహని ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ (ఐఆర్ఎస్ఎంఈ) కేడర్‌కు చెందిన అధికారి. ప్రస్తుతం ఆయన ఎయిరిండియకు చైర్మన్ అండ్ ఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రపంచంలోనే అతిపురాతన స్టీమ్ లోకోమోటివ్ రైలు ఫెయిరీ క్వీన్ ఎక్స్‌ప్రెస్‌ను సక్సెస్‌ఫుల్‌గా నడపడం ద్వారా గిన్నిస్ రికార్డు కూడా అందుకున్నారు. ఒకే ఇన్‌స్టిట్యూట్ నుంచి నాలుగు ఇంజనీరింగ్ డిగ్రీలు పొంది నందుకు గాను 2007లో ఆయన లిమ్కా రికార్డులకు ఎక్కారు.

రైల్వేలో 2లక్షల ఉద్యోగాలు

రైలు ప్రమాదాలు, రైల్వే భద్రతపై పెరుగుతున్న ఆందోళన నేపథ్యంలో రైల్వేలో భారీగా ఉద్యోగాల కల్పనపై రైల్వే మంత్రిత్వ శాఖ దృష్టిపెట్టింది. భద్రతా సంబంధిత ఉద్యోగాలు16 శాతం ఖాళీగా ఉండటంతో రైల్వే ట్రాక్‌ల నియంత్రణ, పెట్రోలింగ్ కష్టంగా మారడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాబోయే రోజులలో భద్రత మరియు నిర్వహణ విభాగంలో భారీగా పోస్టులను భర్తీ చేయనుందని రైల్వే సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రైల్వేశాఖ రూ.15వేల కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. 2016 డిసెంబర్ నాటికి రైల్వే ఉద్యోగుల సంఖ్య 1.3 మిలియన్లుగా ఉండగా, గ్రూప్ 'సి', గ్రూప్ 'డి' విభాగాల్లో 2,25,823 ఖాళీలున్నాయి.

లాలూ ర్యాలీకి కాంగ్రెస్ డుమ్మా..!



పాట్నా: ఎన్డీఏ ప్రభుత్వం ముందు తమ బలప్రదర్శన చూపాలనుకున్న ప్రతిపక్షాలకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. ఆర్జేడీ చీఫ్ లాలూ నేతృత్వంలో ఈనెల 27న తలపెట్టిన భారీ ర్యాలీకి కాంగ్రెస్ పెద్దలెవరూ హాజరుకావడం లేదన్నవార్త ఇతర ప్రతిపక్షాలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. పాట్నాలో నిర్వహించే భారీ ర్యాలీ ద్వారా ప్రతిపక్షాలన్నీ ఐక్యపోరాటానికి సిద్ధమయ్యాయన్న సంకేతాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలనుకుంటే...వారి ఆశలు అడియాశలయ్యాయి. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ లాలూ ర్యాలీకి హాజరవ్వడం లేదని ఆ పార్టీ ప్రకటించింది. దీంతో తన చిరకాల మిత్రులు లేకుండానే ర్యాలీ ఎలా నిర్వహించాలన్న మీమాంసలో లాలూపడిపోయారు. తన ర్యాలీకి సోనియా, రాహుల్ వచ్చేలా చివరి క్షణం వరకు ప్రయత్నిస్తాయని లాలూ ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ..ఇద్దరు గాంధీలు పాట్నా వెళ్లేందుకు సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు గులాం నబీ ఆజాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ కీలక నాయకులు హాజరుకాని ర్యాలీకి బీహార్ రాష్ట్ర నేతలు కూడా దూరంగా ఉంటారని బీహార్ కాంగ్రెస్ చీఫ్ అశోక్ చౌదరి తెలిపారు. హైకమాండ్ నిర్ణయాన్ని తాము శిరసావహిస్తామన్నారు. బీహార్‌లో లాలూ నిర్వహించే ర్యాలీ వారి పార్టీకి సంబంధించిందని వ్యాఖ్యానించారు.ఉత్తర్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి కూడా లాలూ ర్యాలీకి హాజరుకాకపోవచ్చని సమాచారం.

భారత్‌కు రాయబారిని నియమించండి

- ట్రంప్‌కి కాంగ్రెస్ సభ్యుని లేఖ


వాషింగ్టన్: భారత్‌తో సంబంధాలు ప్రస్తుత పరిస్థితుల్లో విలువైనవీ, అత్యంత ప్రధానమైనవని అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు ఫ్రాంక్ పల్లోన్ తమ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కి రాసిన లేఖలో స్పష్టం చేశారు. దశాబ్దాలుగా భారత్‌తో అమెరికాకు సత్సంబంధాలు కొనసాగుతున్నాయనీ, ఇవి ఈ మధ్య కాలంలో మరింత వృద్ధి చెందాయనీ,ఈ తరుణంలో భారత్‌లో అమెరికా రాయబారి పదవి ఖాళీగా ఉండటం మంచిది కాదని ఆయన ఆ లేఖలో స్పష్టం చేశారు. భారత్‌లో అమెరికా రాయబారి పదవి ఈఏడాది జనవరి నుంచి ఖాళీగా ఉంది.ట్రంప్ అధికారంలోకి రాగానే ఆయన ఆర్థిక సలహాదారుల్లో ఒకరైన కెన్నెత్ ఐ జస్టర్‌ని భారత రాయబారిగా నియమించవచ్చన్న కథనాలు వెలువడ్డాయి. జస్టర్ అమెరికన్ కాంగ్రెస్‌లో భారత్ కాకస్‌కి మాజీ చైర్మన్.ఆయనకు భారత దేశం గురించి పూర్తి అవగాహన ఉంది. ముఖ్యంగా, పొరుగు దేశాల నుంచి భారత్ ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆయనకు క్షుణ్ణంగా తెలుసు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం వల్ల భారత్ ఎదుర్కొంటున్న సమస్యలన్నీ ఆయనకు తెలుసు.ట్రంప్ ఈ మధ్య కాలంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం నుంచి భారత్ ఎక్కువగా నష్టపోతోందని పలు సార్లు వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ట్రంప్ కొద్ది రోజుల క్రితం ఆఫ్ఘన్‌పై ప్రకటించిన కొత్త విధానంలో ఆఫ్ఘన్ పునర్నిర్మాణ కార్యక్రమంలో భారత్‌కి మరింతగా ప్రాధాన్యం కల్పించాలని నిర్ణయించిన దృష్ట్యా అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు ట్రంప్‌కు లేఖ రాశారు.

భారతసంతతి వ్యక్తిని దూషించిన ట్రంప్ మద్దతుదారు

వాషింగ్టన్: అమెరికాలో ఈమధ్యకాలంలో జరుగుతున్న జాత్యహంకార దాడులపై స్పందించి సిఎన్‌బీసీలో ఒక వ్యాసాన్ని వెలువరించిన భారత సంతతి వ్యాపారవేత్త రవీన్ గాంధీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతుదారు అయిన ఒక మహిళ పంది అని సంబోధించి అవమానించారు. చార్లెస్‌టన్‌విల్లేలో ఇటీవల జరిగిన ఘర్షణలు ట్రంప్ ప్రతిష్ఠను దెబ్బతీశాయనీ,ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మంచి పనులన్నీ కనుమరుగు కావడానికి ఇలాంటి ఘటనలు దోహదం చేస్తాయని రవీన్‌గాంధీ ఈ వ్యాసంలో పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనల వల్ల ట్రంప్‌పై నమ్మకం చెదిరిపోతోందనీ,ఇకపైన తాను ఆయనకు మద్దతు ఇవ్వనని రవీన్‌గాంధీ పేర్కొన్నారు.ఆ యువతి ఫోన్ ద్వారా తనను పంది-పరదేశీ అని సంబోధించిందని రవీన్‌గాంధీ ఆ వ్యాసంలో ఉదహరించారు.ఆమె మాత్రమే కాకుండా,వాస్తవాలను మాట్లాడితే ట్రంప్ మద్దతుదారుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని గాంధీ పేర్కొన్నారు.

రైల్వే నుంచి రక్షణశాఖకు..?

- వరుస రైలు ప్రమాదాలపై సురేశ్ ప్రభు మనస్తాపం
- కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో అనివార్యంగా మారిన శాఖల మార్పు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: భారతీయ జీవనాడిగా చెప్పుకునే రైల్వేలో సమూల సంస్కరణలకు తెరలేపిన రైల్వే మంత్రి సురేశ్ ప్రభుకు వరుస ప్రమాదాల సెగ తగిలింది. ఇప్పటికే ప్రతిపక్షాలతో పాటు సామాజిక మాధ్యమాల్లో ప్రజల నుంచి కూడా నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలంటూ వస్తున్న డిమాండ్లు ఆయనపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. కేవలం వారం వ్యవధిలో వరుసగా రెండు రైలు ప్రమాదాలు చోటు చేసుకోవడంతో తాను తీవ్ర మనస్తాపానికి గురయ్యానని రైల్వే మంత్రి సురేశ్ ప్రభు తన ట్విట్టర్ ఖాతాలో వెల్లడించారు. దశాబ్దాలుగా వేళ్లూనుకున్న నిర్లక్ష్యాన్ని సమూలంగా రూపు మాపడా నికి ప్రయత్నిస్తున్నప్పటికీ, ఈ మధ్య వరుసగా చోటు చేసుకున్న ప్రమాదాలు తనను తీవ్రంగా కలచివేశాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కలిసి ప్రమాదాలకు నైతిక బాధ్యత వహిస్తూ తన మంత్రి పదవికి రాజీనామా చేస్తానని చెప్పారు. అయితే కొంత కాలం పాటు వేచి ఉండాల్సిందిగా మోడీ సూచించారని సురేశ్ ప్రభు వెల్లడించారు.

ఈ నెల 19న సాయంత్రం గం. 5.30 ని. ల సమయంలో ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ సమీపంలో కళింగ ఉత్కల్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో 7 బోగీలు నుజ్జునుజ్జయి 23 మంది ప్రాణాలు కోల్పోగా, 200 మందికి పైగా గాయాల పాలయ్యారు. ఈ ఘటన ఇంకా మర్చిపోక ముందే బుధవారం ఉదయం ఉత్తరప్రదేశ్‌లోనే మరో రైలు ప్రమాదం జరిగింది. ఆగ్రా - కాన్పూర్ మార్గంలో ఔరయ్యా వద్ద కైఫియత్ ఎక్స్‌ప్రెస్ లెవెల్ క్రాసింగ్ వద్ద ఓ డంపర్‌ను ఢీకొట్టి పట్టాలు తప్పింది. ఈ ఘటనలో 70 మంది వరకు ప్రయాణికులు గాయపడ్డారు. గత పదేళ్లలోనే ఎప్పుడూ లేని రీతిలో రైళ్లు పట్టాలు తప్పుతున్నాయి. కొన్ని ప్రమాదాల వెనుక ఉగ్రవాదుల విద్రోహ చర్యలు న్నాయని కూడా తేలాయి. గత ఏడాది జరిగిన ప్రమాదాల్లో గత పదేళ్లలో ఎప్పుడూ లేనంతగా 186 మంది చనిపోయారు. ఈ ఏడాది జరిగిన ప్రమాదాల్లో ఇప్పటి వరకు 62 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదాలపై సామాజిక మాధ్యమాల్లో రైల్వే మంత్రి సురేశ్ ప్రభు మీద వ్యగ్యంగా అనేక కార్టూన్లు, విమర్శనాత్మక కథనాలు విస్తృతమవుతున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకున్న సురేశ్ ప్రభు, తన పదవికి రాజీనామా చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. అయితే ఎలాగూ మరి కొద్ది రోజుల్లోనే కేంద్ర కేబినెట్‌లో ప్రక్షాళన జరగనున్న నేపథ్యంలో ప్రధాన మంత్రి మోడీ అప్పటి వరకు వేచి ఉండాల్సిందిగా సూచించారు. అయితే ఈలోపు రైల్వే బోర్డు ఛైర్మన్ ఏకే మిట్టల్‌పై కేంద్రం వేటు వేసింది. వరుసగా ప్రమా దాలు జరగడానికి ఆయన్ను బాధ్యుణ్ణి చేస్తూ పదవి నుంచి తప్పించింది. ఆగమేఘాల మీద ఎయిరిండియా సీఎండీగా ఉన్న అశ్విని లోహానీని తీసుకొచ్చి రైల్వే బోర్డు ఛైర్మన్‌గా నియమించింది. అయితే ఇది కేవలం కంటి తుడుపు చర్య అని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మనీష్ తివారీ వ్యాఖ్యానించారు.

మారనున్న కీలక శాఖాధిపతులు

రైల్వే మంత్రి రాజీనామా యత్నంతో మరోసారి కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ చర్చకొచ్చింది. ఇప్పటికే ఖాళీగా ఉన్న కీలక శాఖలతో పాటు రైల్వే శాఖలోనూ మార్పులు జరగవచ్చని తెలుస్తోంది. గోవా ముఖ్యమంత్రిగా మనోహర్ పారికర్ తిరిగి వెళ్లిపోవడంతో ఏర్పడ్డ రక్షణ శాఖలో ఖాళీ ఏర్పడింది. దీన్ని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అదనంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అలాగే అటవీ మరియు పర్యావరణ శాఖ మంత్రిగా పనిచేస్తున్న అనిల్ మాధవ్ దవే హఠాన్మరణంతో ఆ శాఖ ఖాళీ అయింది. దీన్ని సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి హర్షవర్ధన్‌కు అదనంగా అప్పగించారు. అలాగే ఉప రాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు క్రియాశీల రాజకీయాల నుంచి దూరం కావడంతో ఆయన నిర్వహించిన పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖలను, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌కు, సమాచార ప్రసారాల శాఖను కేంద్ర జౌళి శాఖ మంత్రి స్మృతి ఇరానీకి అప్పగించారు. త్వరలో జరగబోయే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో ఈ శాఖల భర్తీతో పాటు కీలక శాఖల్లో మార్పులు చేర్పులు చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.


వరుస ప్రమాదాలతో ప్రభుత్వానికి సైతం అపఖ్యాతి వస్తున్నందున రైల్వే శాఖ మంత్రిని మార్చే అవకాశముంది. నిజానికి సురేశ్ ప్రభును ఏరికోరి తీసుకొచ్చి మరీ ఈ శాఖను అప్పగించారు. తొలుత సదానంద గౌడ నిర్వహించిన ఈ శాఖను సురేశ్ ప్రభుకు అప్పగించిన తర్వాత చెప్పుకోదగ్గ మార్పులను తీసుకురాగలిగారు. ప్రాధాన్యతాక్రమంలో రైల్వే ప్రాజెక్టుల్ని గుర్తించి వాటిని త్వరగా పూర్తి చేసేలా బడ్జెట్ కేటాయింపులు చేశారు. కొత్త ప్రాజెక్టుల జోలికి వెళ్లకుండా ఉన్న ప్రాజెక్టులనే త్వరగా పూర్తిచేయడంపై దృష్టి సారించారు. అలాగే భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు అనేక సంస్కరణలకు నడుం బిగించారు. ప్రత్యేక బడ్జెట్‌ను కాస్తా నేరుగా సాధారణ బడ్జెట్‌లో భాగం చేశారు. ఇలా ఎన్నో విప్లవాత్మక మార్పులకు ప్రభు హయాంలోనే శ్రీకారం చుట్టినప్పటికీ, వరుస ప్రమాదాలు ఆయన్ను వెంటాడాయి. ఫలితంగా నైతిక బాధ్యత వహించక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆయన్ను రైల్వే శాఖ నుంచి తప్పించినప్పటికీ మరో కీలకమైన శాఖనే అప్పగిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఎందుకంటే నిజాయితీగా, అంకిత భావంతో పనిచేస్తారన్న పేరున్న సురేశ్ ప్రభును వదులుకునే ప్రసక్తే లేదని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. శివసేనకు చెందిన సురేశ్ ప్రభును రాజీనామా చేయించి మరీ పార్టీలోకి తీసుకున్న నరేంద్ర మోడీ, ఆయన సేవల్ని వేరే ఇతర శాఖలోఉపయోగించుకుంటారని తెలుస్తోంది.

కీలకమైన రక్షణశాఖకు సురేశ్ ప్రభును బదిలీ చేసి, రైల్వే శాఖను మరొకరికి అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే స్మృతి ఇరానీకి సమాచార ప్రసారాల శాఖను పూర్తిస్థాయిలో అప్పగించి జౌళి శాఖను మరొకరికి ఇవ్వనున్నారని తెలుస్తోంది. 2019 ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్న ఈ కొత్త కేబినెట్‌లో యువశక్తికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని మోడీ భావిస్తున్నారు. ఆ క్రమంలో వెంకయ్య నాయుడు తరహాలో సీనియర్లను తప్పించి యువ నేతలకు చోటు కల్పించనున్నారని తెలుస్తోంది.

కర్ణన్ పిటిషన్ తిరస్కరణ

న్యూ ఢిల్లీ: కోర్టు ధిక్కరణ కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న కలకత్తా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కర్ణన్ పిటిషన్‌ను బుధవారం ఢిల్లీ ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక న్యాయమూర్తి జస్టిస్ గీతా మిట్టల్, సీ హరిశంకర్ ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెల్లడించింది. ఈ కేసులో కర్ణన్‌కు తాము శిక్షను సడలించలేమని స్పష్టం చేసింది. చట్టాలు, రాజ్యాంగ వ్యవస్థపై పూర్తిగా అవగాహన ఉన్న కర్ణన్ ఇటువంటి ఉల్లంఘనలకు పాల్పడినందున పూర్తి శిక్షకు ఆయన అర్హుడని చెప్పింది. సుప్రీం కోర్టు న్యాయమూర్తులకు శిక్ష విధించి, చట్టాల ఉల్లంఘన కేసులో కర్ణన్‌కు గత కొన్ని నెలల కిందట భారత సర్వోన్నత న్యాయస్థానం ఆరు నెలల జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే.

తప్పుడు అఫిడవిట్‌పై వివరణ ఇవ్వండి



న్యూఢిల్లీ: కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమాద్మీ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ తప్పుడు అఫిడవిట్ సమర్పించడంపై ఆ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం మండిపడింది. ఈ విషయంపై నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అయితే, కేజ్రీవాల్ తనను దూషించాలని, తనపై అసభ్య పదజాలం వాడాలని ఆయన లాయర్ రాం జెఠ్మాలానీకి సూచించినట్లు జైట్లీ మరోసారి కోర్టుకు నివేదించారు. అందులో భాగంగానే జెఠ్మాలానీ తనపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు తన రెండో పిటిషన్‌లో జైట్లీ పేర్కొన్నారు. తన ప్రతిష్టకు భంగం కలిగించే వ్యాఖ్యలు చేశారంటూ కేజ్రీవాల్‌పై జైట్లీ రూ. 10 దావా వేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన న్యాయస్థానం... ఆప్ అధ్యక్షుడికి నాలుగు వారాల గడువు ఇచ్చింది. ఈ లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

పక్కాప్లాన్ ప్రకారమే పన్సారే, ధబోల్కర్ హత్యలు

ముంబై: ప్రముఖ హేతువాదులు నరేంద్ర ధబోల్కర్, గోవింద్ పన్సారేల హత్యలు పక్కా ప్లాన్ ప్రకారమే జరిగాయని బొంబాయి హైకోర్టు అభిప్రాయపడింది. ఇరువురి హత్యలకు భావజాల సారూప్యతలు కారణమయ్యాయని తెలిపింది. దీనికి సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని పోలీసులను హెచ్చరించింది. జస్టిస్ ఎస్సీ ధర్మాధికారి, జస్టిస్ కనక్కావాడి ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు బుధవారం తీర్పు వెల్లడించింది. ఇటువంటి భయానక కార్యకలాపాలకు కొన్ని సంస్థలు మద్దతునిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఆర్థికంగా సాయం అందిస్తున్నాయని ఇటువంటి సంఘటనలను ప్రోత్సహిస్తున్నాయని చెప్పింది.

ధబోల్కర్‌ను హత్య చేసిన వారిని పోలీసులు ఇప్పటికీ పట్టుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయంపై సీఐడీ పోలీసులు లోతుగా దృష్టి సారించాలన్నారు. ఒకే వర్గానికి చెందిన వారు ఇరువురిని హత్య చేసి ఉంటారని కోర్టు అనుమానం వ్యక్తం చేసింది. ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి కేసు వీలైనంత త్వరగా చేధించాలని ఆదేశించింది. అఫిడవిట్ పత్రాలను పరిశోధన సంస్థలకు సమర్పించాలని పిటిషనర్‌లను కోర్టు పేర్కొంది.

ప్రజల హక్కులు రక్షించేందుకే ఉన్నాం

- ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: సామాన్య ప్రజల హక్కులు, స్వేచ్ఛ రక్షించేందుకే తాము ఉన్నామని ఢిల్లీ హైకోర్టు బుధవారం పేర్కొంది. ఢిల్లీలో సుమారు 120 రెస్టారెంట్, పబ్‌లు ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని సామాజిక కార్యకర్త పంకజ్ శర్మ వేసిన పిటిషన్ న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. పౌరు భద్రతా, హక్కులకు కోర్టు అమితమైన ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొంది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు జస్టిస్ గీతా మిట్టల్, జస్టిస్ హరి శంకర్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం తీర్పు వెల్లడించింది. కనీస అనుమతులు లేకుండా పబ్‌లు, రెస్టారెంట్, ఫ్యాషన్ స్టూడియోలు నిర్వహించడంపై కోర్టు మండిపడింది. ఇటువంటి కార్యకలాపాలపై దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని దక్షిణ ఢిల్లీ మున్సిపల్ అధికారులను ఆదేశించింది. కోర్టు ఆదేశాలను పాటించి మున్సిపల్ అధికారులు వెంటనే 19 రెస్టారెంట్ యాజమాన్యాలకు నోటీసులు అందజేశారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించారు. సరైన బిల్డింగ్ లేకుండా రెస్టారెంట్‌లు ఏర్పాటు చేయడంతో పార్కింగ్ సమస్యలు ఏర్పడుతున్నాయని పిటిషనర్ ఆరోపించారు.

ఓబీసీలకు కేంద్రం మరో వరం

వర్గీకరణకు పచ్చజెండా!

(మొదటిపేజీ తరువాయి)

పరిమితిని రూ.6 లక్షల నుంచి రూ. 8 లక్షలకు పెంపుదలకు కేంద్ర కేబినెట్ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. రాజ్యాంగంలోని 340వ అధికరణం కింద కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించిన కేంద్ర కేబినెట్, కమిషన్‌కు చైర్‌పర్సన్‌ను నియమించిన నాటి నుంచి 12 వారాల లోపు నివేదిక అందజేయాల్సి ఉంటుందని పేర్కొంది. కమిషన్ ప్రధానంగా ఓబీసీ రిజర్వేషన్ ఫలాలను అందుకోవడంలో లేదా, అందించడంలో అసమానతలపై అధ్యయనం చేయాల్సి ఉంటుంది. అనంతరం శాస్త్రీయంగా ఓబీసీల వర్గీక రణ జరిపేందుకు రూపొందించాల్సిన నియమాలు, ప్రమాణాలు, మార్గదర్శకాలను ఈ కమిషన్ రూపొందించనుంది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వ ఓబీసీ జాబితాలో ఉన్న కులాలు, సముదాయాలు, ఉప కులాలను సంబంధిత సబ్-కేటగిరీలో చేర్చడానికి అవసరమైన కసరత్తును కూడా ఈ కమిషన్ చేస్తుంది. ఇందిరా సాహ్నీ, ఇతరులు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతివాదిగా పేర్కొంటూ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యంపై 1992 నవంబర్ 16న ఇచ్చిన తీర్పును అనుసరించి కేంద్ర ప్రభుత్వం ఈ వర్గీకరణకు పూనుకుంది. ఆ తీర్పు ప్రకారం వెనుకబడి తరగతులను, వెనుకబడిన లేదా బాగా వెనుకబడిన తరగతులుగా విభజించడంలో ఒక రాష్ట్రానికి ఎటువంటి రాజ్యాంగపరమైన లేదా న్యాయపరమైన అడ్డంకి లేదని సుప్రీం తీర్పులో తేల్చి చెప్పింది. ఏ రాష్ట్రమైనా ఓబీసీ కులాలను వర్గీకరించాలనుకుంటే, అదేమీ చట్టం దృష్టిలో అనుమతించకూడని వ్యవహారమేమీ కాదని స్పష్టం చేసింది. పాతికేళ్ల క్రితం నాటి ఈ తీర్పును ఆధారంగా చేసుకుని జాతీయస్థాయిలో ఓబీసీ కులాలను వర్గీకరించే సాహసోపేతమైన నిర్ణయానికి కేంద్రం ప్రభుత్వం సిద్ధపడింది.

అందరికీ సమానంగా రిజర్వేషన్లు

సమాజంలో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి, వివక్షకు గురైన కులాలను ఇతర కులాలతో సమానంగా ఎదిగే అవకాశం కల్పించడం కోసమే రిజర్వేషన్లు కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ రిజర్వేషన్ ఫలాలు వెనుకబడిన కులాల్లో అన్ని కులాలకూ సమానంగా అందడం లేదన్న విమర్శలున్నాయి. రిజర్వేషన్ ప్రయోజనాలపై గణాంకాలను పరిశీలిస్తే వందల సంఖ్యలో ఉన్న వెనుకబడిన తరగతుల్లో కేవలం కొన్ని కులాలు మాత్రమే రిజర్వేషన్ ఫలాలను పూర్తిగా అనుభవిస్తున్నాయని అర్థమవుతోంది. దీంతో మిగతా కులాలు వీరితో పోటీ పడలేక, రిజర్వేషన్ ఫలాలను అందుకో లేకపోతున్నాయి. ఈ అసమానతలను తొలగించడం కోసమే 'కోటా పరిధిలో కోటా' అన్న నినాదం మొదలైంది. తద్వారా ఓబీసీలకు కేటాయించిన కోటాకు లోబడి, కులాలను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా వర్గీకరించి, అందరికీ సమన్యాయం జరిగేట్టు చూడాలన్న డిమాండ్ మొదలైంది. ఓబీసీ వర్గీకరణ విధానాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పాండిచ్చేరి, కర్ణాటక, హర్యానా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, బీహార్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలు ఇప్పటికే అమలు చేస్తున్నాయి. అయితే జాతీయస్థాయిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, కేంద్ర విద్యా సంస్థల్లో అడ్మిషన్ల సమయంలో ఈ అసమానతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే రిజర్వేషన్ ఫలాలను అందరికీ సమానంగా పంచాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తాజాగా ఈ నిర్ణయం తీసుకుంది.

రాజకీయ సమీకరణాలు

కేంద్ర కేబినెట్ తీసుకున్న ఈ నిర్ణయం వెనుక రాజకీయ కారణాలు, సమీకరణాలు లేకపోలేదు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఓబీసీల్లో ఆయనపై ఎన్నో ఆశలు నెలకొన్నాయి. తమ సామాజిక వర్గానికి చెందిన నేత ప్రధాని అయ్యారు కాబట్టి, తమ సమస్యలను ఆయన పరిష్కరిస్తారన్న నమ్మకం వారిలో ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (జాతీయ బీసీ కమిషన్)కు రాజ్యాంగ బద్ధత కల్పించడం కోసం కేంద్రం బిల్లును తీసుకొచ్చింది. రాజ్యసభలో ప్రతిపక్షాల సవరణల కారణంగా బిల్లు అర్థాంతరంగా నిలిచిపోయినా, తాము ఓబీసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్న సంకేతాలను పంపడంలో బీజేపీ విజయం సాధించింది. పైగా రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుంటే, తాజాగా ఉత్తరప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అనేక ఓబీసీ వర్గాలు వెన్నుదన్నుగా నిలిచిన విషయం గమనార్హం. ఓబీసీల పార్టీలుగా ముద్రపడ్డ సమాజ్‌వాదీ, ఆర్జేడీ, ఆర్ఎల్డీ వంటి అనేక రాజకీయ పార్టీలు ఓబీసీల్లో ఏదో ఒక వర్గానికే పరిమితమయ్యాయి తప్ప అందరినీ ఆదరించలేకపోయా యి. దీన్ని గ్రహించిన బీజేపీ ఓబీసీల్లో నిర్లక్ష్యానికి గురైన వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకెళ్తోంది. రాజకీయ పదవుల నుంచి మొదలుపెట్టి ప్రభుత్వ సంక్షేమ, రిజర్వేషన్ ఫలాల వరకు అన్ని విషయాల్లోనూ నిర్లక్ష్యానికి గురైన ఓబీసీ కులాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇప్పుడు వర్గీకరణ ఉద్దేశం క ూడా ఇదేనని అర్థమవు తోంది. ఇన్నాళ్లూ రిజర్వేషన్ ఫలాలను అనుభవిస్తున్న కొన్ని కులాల్లో వర్గీకరణ నిర్ణయం ఆగ్రహం కల్గించినా, మిగతా కులాల నుంచి బీజేపీకి విశేషాదరణ లభిస్తుంది.

క్రీమీలేయర్ మాటేంటి?

బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత, ఓబీసీ వర్గీకరణ వంటి నిర్ణయాలతో క్రీమీలేయర్ వ్యవహారం ముడిపడింది. రిజర్వేషన్ ఫలాలను పూర్తిగా అందుకోలేకుండా ఈ క్రీమీలేయర్ నిబంధన బంధనాలు వేస్తోందని పలువురు బీసీ నేతలు అనేక సందర్భాల్లో వెల్లడించారు. క్రీమీలేయర్‌గా రూ. 6 లక్షల పరిమితి విధించడం వల్ల సాధారణ 4వ తరగతి ఉద్యోగులు సైతం తమ పిల్లలకు రిజర్వేషన్ కల్పించలేక పోతున్నారని ఆవేదన చెందుతున్నారు. ఈ పరిమితిని రూ. 10 లక్షల వరకు పెంచాలని కొందరు, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల మాదిరిగా అసలు క్రీమీలేయర్ నిబంధనే ఉండరాదని కొందరు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఓబీసీ వర్గీకరణ నిర్ణయం సందర్భంగా క్రీమీలేయర్ గురించి ప్రభుత్వంపై ఒత్తిడి పెరగనుంది.

కేసీఆర్‌కు వ్యవసాయశాఖ సన్మానం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయ రంగాభివృద్ధికి, రైతు సంక్షేమానికి అవిరళ కృషి చేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు జాతీయ స్థాయి అవార్డు ఎంపికైన సందర్భంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఉన్నతాధికారుల బృందం ఆయనకు సన్మానం చేసింది. బుధవారం ప్రగతి భవన్‌లో వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథి, కమిషనర్ జగన్మోహన్, ఉద్యానశాఖ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వివిధ వ్యవసాయ అనుబంధ విభాగాల ఉన్నతాధికారులు శాలులతో, పుష్పగుచ్ఛాలతో కేసీఆర్‌కు అభినందనలు తెలిజేశారు. కష్టనష్టాల్లో కూరుకుపోయిన వ్యవసాయ రంగాన్ని గట్టెక్కించి రైతుల శ్రమకు తగిన ఫలితం దక్కేలా చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని ఈ సందర్భంగా వారంతా ధీమా వ్యక్తంచేశారు. భవిష్యత్తులోనూ వ్యవసాయ రంగానికి ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తూ ముందుకు నడిపించాలని విజ్ఞప్తి చేశారు.



అందరికీ అందుబాటులో ఉంటా

టీఎస్‌బీసీఎల్ చైర్మన్ దేవీప్రసాద్‌రావు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ కార్యాలయాన్ని అందరికీ అందుబాటులో ఏర్పాటు చేశామని చైర్మన్ దేవీ ప్రసాదరావు అన్నారు. బుధవారం ఆబ్కారీ కమిషనరేట్ కార్యాలయం 5వ అంతస్తులో బేవరేజ్ కార్పొరేషన్ చైర్మన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. సీఎం కేసీఆర్ మార్గ దర్శకత్వంలో, మంత్రి పద్మారావు ఆధ్వర్యంలో కార్పొరేషన్ పనివిధానాన్ని మరింత మెరుగు పరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్, కమిషనర్ చంద్రవదన్, టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్, టీజీవో జనరల్ సెక్రటరీ సత్యనారా యణతో పాటు అన్ని జిల్లాల టీఎన్జీవోస్ నేతలు, మహిళలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ దేవీ ప్రసాదరావును పలువురు అభినందించి సన్మానించారు.



ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన పోటీలలో కన్సోలేషన్ బహుమతిని స్పీకర్ మధుసుధనాచారి చేతుల మీదుగా అందుకుంటున్న ఆంధ్రప్రభ ఫోటోగ్రాఫర్ బి. రామనాథమ్

హైదరాబాద్‌లో పేదల కోసం టౌన్‌షిప్!

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణం చేపట్టాలని భావిస్తోంది. ప్రైవేటు టౌన్‌షిప్‌లకు ఏ మాత్రం తీసిపోని విధంగా అన్ని సౌకర్యాలతో నిర్మించాలని యోచిస్తోంది. సుమారు పదిహేనువేల మంది లబ్ధిదారులకు సదరు టౌన్‌షిప్ లో ఇళ్ళను నిర్మించి ఇవ్వడం వల్ల కొంతమేర స్థలం సమస్యలు సైతం తీరుతాయని భావిస్తోంది. ప్రస్తుతం ఉచిత డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళను జీ ప్లస్ ఫోర్ అంతస్తుల్లో నిర్మిస్తోంది. అయితే టౌన్‌షిప్పుల్లో అయితే జీ ప్లస్ ఫోర్‌కు అదనపు అంతస్తులతో భారీ ఎత్తున నిర్మాణాలు చేపట్టే అవకాశ ఉంటుంది. ఈ టౌన్‌షిప్పుల్లో పక్కా డ్రైనేజీ వ్యవస్థతో పాటు ప్రత్యేకంగా మంచినీటి సౌకర్యం, రోడ్లు, వీధిలైట్లను ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వ పాఠశాల, అర్బన్ హెల్త్ పోస్టు సెంటర్, పోస్టాఫీసు, బ్యాంక్, పాలడైరీ, పౌరసరఫరాల దుకాణం, రైతు బజార్, చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఒక పార్కు, కమ్యూనిటీ హాల్ వంటి సదుపాయాలను కల్పించనున్నారు. ఒక టౌన్‌షిప్పుల్లో సుమారు అరవై వేల నుంచి డెబ్బైవేల జనాభా నివసించే విధంగా నిర్మించనున్నారు. ఒకటి, రెండు మునిసిపాలిటీల జనాభాకు సమానంగా టౌన్‌షిప్పులను నిర్మిస్తారు. తద్వారా పరిసర ప్రాంతాలు సైతం శరవేగంగా అభివృద్ధిచెందుతాయని భావిస్తోంది. అయితే ఈ టౌన్‌షిప్పులను ఎక్కడ నిర్మించాలి? ఇందుకు అయ్యే వ్యయం తదితర అంశాలపై రాష్ట్ర మునిసిపల్ శాఖ కసరత్తు చేస్తోంది. ప్రయోగాత్మకంగా గ్రేటర్ పరిధిలో అమలు చేసిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించాలని యోచిస్తోంది. అన్ని అనుకూలిస్తే మరో రెండు, మూడు నెలల్లోనే ఈ ప్రాజెక్టును ప్రారంభించే అవకాశాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ పనులను తెరాస ప్రభుత్వం ప్రారంభిస్తే దేశంలోనే పేదల కోసం ప్రత్యేకంగా టౌన్‌షిప్ నిర్మాణానికి పూనుకున్నట్లు కానుంది. మొత్తం మీద

కేసీఆర్‌పై అక్కసు ఎందుకు?

కాంగ్రెస్ ఎమ్మెల్సీపై శ్రీనివాసగౌడ్ ధ్వజం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో జరుగు తున్న అభివృద్ధిని చూసి కెసిఆర్‌కు పెరుగుతున్న ప్రజాదరణను చూసి కాంగ్రెస్ నేతలు తట్టుకోలేక పోతున్నారని, పదేపదే తమ అక్కసు వెళ్ళగక్కుతున్నారని టిఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాసగౌడ్ ధ్వజమెత్తారు. బుధవారం టిఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టులపై ప్రజాభిప్రాయసేకరణ సందర్భంగా టిఆర్ఎస్ బలప్రదర్శనకు దిగుతోందని కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణల్లో పసలేదన్నారు. కాంగ్రెస్ నేతలకు ఎన్నడైనా భూసేకరణకు పది లక్షల రూపాయలు పరిహారం ఇచ్చిన చరిత్ర ఉందా అని ఆయన ప్రశ్నించారు. అసలు ప్రాజెక్టులు కట్టొద్దనేది కాంగ్రెస్ వైఖరి అని ఆయన విమర్శించారు. మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల పేరిట కాంట్రాక్టర్లను మేపింది కాంగ్రెస్ నేతలు కాదా అని ఆయన ప్రశ్నించారు. ఉత్తమ్, జీవన్‌రెడ్డిలకు దమ్ముంటే రాజీనామాలు చేసి గత ఎన్నికల మెజారిటీ సాధించుకోగలరా అని సవాల్ విసిరారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, అక్కడి ప్రాజెక్టులలో నీరున్నా వదలడం లేదన్నారు.

మన ఊరు... మన ఎంపీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: వినూత్న కార్యక్రమాలతో.. ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలిచే నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత మన ఊరు-మన ఎంపీ పేరుతో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టి మరోసారి సంచలనానికి కేంద్రబిందువయ్యారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని బోధన్ నియోజకవర్గంలో గల సాలూరు గ్రామం నుండి కవిత బుధవారం ఈ కార్యక్రమం శ్రీకారం చుట్టగా, రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నెటిజన్లు ప్రశంసలజల్లు కురిపించారు. ఇటీవల రక్షాబంధన్ సందర్భంగా కవిత ఇచ్చిన హెల్మెట్ బహుకరించండి పిలుపుకు దేశవ్యాప్తంగా స్పందన లభించిన విషయం విదితమే. ఇపుడు మన ఊరు-మన ఎంపీ పేరుతో సాలూరు గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. మూడు గంటల పాటు సాలూరు గ్రామమంతా పర్యటించిన కవిత గ్రామంలోని ఐదు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గ్రామ సమగ్రాభివృద్ధికి ఏం కావాలో చర్చించారు. అనంతరం కవిత మాట్లాడుతూ మహారాష్ట్ర, తెలంగాణలకు సరిహద్దుగ్రామమైన సాలూరుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తానన్నారు. అభివృద్ధిలో వెనుకబడిన ఊసా, మందర్న, ఖాజాపూర్‌లలో పర్యటిస్తానన్నారు. ఆ గ్రామాలనూ అభివృద్ధి చేస్తామన్నారు. రోడ్ల అభివృద్ధి జాతీయ ఉపాధిహామీ పథకం కింద చేపట్టాలన్నారు. 890పెన్షన్లు సాలూరులో వస్తున్నాయని, గ్రామానికి మంజూరైన 50డబుల్‌బెడ్‌రూం ఇండ్లను 100కు పెంచాలని.. ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కోరతామన్నారు. పమైనారిటీలకు షాదీఖానా నిర్మాణం జరిగేలా చేస్తానన్నారు. గౌడసంఘం భవనానికి 3లక్షలు మంజూరుచేస్తున్నట్లు ప్రకటించారు. రజకులకు దోబీఘాట్ నిర్మిస్తామన్నారు. నాయీబ్రాహ్మణులకు ప్రభుత్వం ఎసి సెలూన్లకు సహాయమందిస్తున్నదన్నారు. అవసరమైన కంప్యూటర్లను తెలంగాణ జాగృతి ద్వారా అందజేస్తామన్నారు. రూ.25కోట్ల వ్యయంతో బోధన్-సాలూరు రోడ్డు నిర్మించబోతున్నామన్నారు. కడుపులో బిడ్డ పడింది మొదలు ప్రసవించే వరకు వారి బాగోగులు ప్రభుత్వం చూసుకుంటుందని చెప్పారు. 33లక్షల విలువైన గొర్రెలను యాదవులకు పంపిణీచేసి వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశామన్నారు. కవితను గ్రామస్థులు మేళతాళాలతో ఘనంగా స్వాగతించగా, ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

కోవర్టులున్నారా?.. తస్మాత్ జాగ్రత్త!

టీ పీసీసీని నిర్దేశించిన అధిష్ఠానం



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర పార్టీ నాయకుల్లో కోవర్టు లెవరు ? అధికార టీఆర్ఎస్, బీజేపీలతో మాట్లాడుకుంటున్న ముసుగుదొంగలెవరు ? అలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని టీపీసీసీని అధిష్టానం హెచ్చరించినట్లు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని విచ్ఛిన్నం చేస్తే తమ అధికారానికి హద్దుండదని టీఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్ బలహీనమైతే వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ గెలుపుతథ్యమని బీజేపీ భావిస్తూ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. పార్టీ మారే యోచనలో ఉన్న వారు పార్టీ అంతర్గత సమాచారం చేరవేయకుం డా జాగ్రత్త పడాలని కోరింది. టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి సారథ్యాన్ని వ్యతిరేకిస్తున్న నేతలు పార్టీ మారే యోచనలో ఉన్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఎంతపెద్ద లీడర్ బయటకు వెళ్లినా పార్టీ బలహీనం కాకుండా అప్రమత్తంగా ఉండాలని పీసీసీ నేతలను ఏఐసీసీ నిర్దేశించింది. ఏఐసీసీకి అందిన సమాచారం ప్రకారం నల్గొండ జిల్లానుంచి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మెదక్ జిల్లా నుంచి మాజీ మంత్రి , మహబూబ్‌నగర్ జిల్లా నుంచి మాజీ మంత్రి, హైదరాబాద్ కు చెందిన మాజీ మంత్రి ఒకరితో బీజేపీ నాయకులు మాట్లాడినట్లు సమాచారం అందింది. వాళ్లే గాక గతంలో కాంగ్రెస్‌లో ఉండి పదవులు వెలగబెట్టిన నాయకులను పార్టీలో చేర్చుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె లక్ష్మణ్ సైతం కాంగ్రెస్, టీఆర్ఎస్‌కు చెందిన బడా నేతలు ప్రతిరోజు తమతో మాట్లాడుతున్నారని సరైన సమయంలో తమ పార్టీలో చేరతారని మీడియాలో ప్రకటించిన దృష్ట్యా కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. 2019 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంతో ఉన్న ఏఐసీసీ రాష్ట్రంలో పార్టీ బలహీనం కాకుండా పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషిచేస్తోంది. పీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఫిరాయింపులు, కోవర్టుల అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ రామచంద్ర కుంతియాతో జరిగిన సమావేశంలో ఎవరెవరు పార్టీ మారే అవకాశంఉందో అని ఆరా తీశారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో పని చేసిన వారికి పార్టీ పరంగా మంచి గుర్తింపు ఇవ్వాలని, అలాంటివారైతే పార్టీని అంటిపెట్టుకుని ఉంటారని సూచించారు. అదే విధంగా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారు పదవుల కోసం ఎప్పుడైనా వెళ్లే ప్రమాదం లేకపోలేదని కూడా హెచ్చరించారు.

మూడు ముఠాలతో రాష్ట్రానికి ముప్పు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రగతికి మూడు ముఠాలు అడుగడుగునా అడ్డుతగు లు తున్నాయని, ప్రొఫెసర్ కోదండరాం రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని అబద్దాల చిట్టాతో ఢిల్లీలో సంచారం చేస్తున్నారని టిఆర్ ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ధ్వజమె త్తారు. బుధ వారం టిఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధిని అడ్డుకునే ముఠా, కోర్టుల్లో కేసులు వేస్తూ అభివృద్ధిని అడ్డుకునే ముఠా, ఏ ఘటన జరిగినా ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరించే ముఠాలు ఉన్నాయని.. ఈ ముఠాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కోదండరాం సహకరిస్తూ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేస్తున్నారన్నారు.

'అప్పా' పేరు కేసీఆర్ మార్చలేదు: చిన్నారెడ్డి



వనపర్తి , కెఎన్ఎన్ బ్యూరో : హైదరాబాద్ లోని ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీ (అప్పా) కాంగ్రెస్ ప్రభుత్వం 2013లోనే పేరు మార్చి రాజబహద్దూర్ వెంకటరామరెడ్డి పోలీస్ శిక్షణ కేంద్రంగా మార్చమని ఏఐసీసీ కార్యదర్శి, వనపర్తి ఎమ్మెల్యే చిన్నారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు పచ్చి అబద్దాల కోరు అని అన్నారు. ఆయన అసత్య ప్రచారాలతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో పోలీస్ అకాడమీకి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజబహద్దూర్ వెంకట్రారంరెడ్డి సేవలను గుర్తించి ఆయన పేరు పెట్టామని చెప్పారు. ఆ నాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి ఈ విషయంలో చొరవ తీసుకున్నారని గుర్తు చేశారు. దీనికి సంబంధించి ఆయన జీఓ 2013 విడుదల చేశారన్నారు. ముఖ్యమంత్రి ఏ సామాజిక వర్గ సమావేశానికి వెళ్లిన ఆ సామాజిక వర్గానికి సంబంధించిన తప్పుడు సమాచారాలు అలవాటు అయిందని విమర్శించారు. అదే విధంగా రాష్ట్ర హోం శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి జేఏసి కన్వీనర్ ప్రొఫెసర్ కోదండరాంను దొంగరెడ్డి అనడం బాధాకరమన్నారు.

వెంకయ్య నిర్ణయాలకు

స్మృతి చెక్

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ, పార్టీ అధినేతల నుంచి ఇప్పటికే స్పష్టత ఉందనుకోవచ్చు. అందుకే సమాచార ప్రసారాల శాఖలో సమూల మార్పులకు ఆమె శ్రీకారం చుట్టారు. అనూహ్య నిర్ణయాలతో ఆ శాఖ అధికారులు బిత్తరపోయేలా చేస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే వెంకయ్య నాయుడు మంత్రిగా ఉన్నప్పుడు తీసుకున్న నిర్ణయాలన్నింటినీ ఆమె పునఃసమీక్షకు పూనుకున్నారు.

ఇఫ్ఫీ నుంచి మొదలు

వివరాల్లోకి వెళ్తే.. గోవాలో ఈ ఏడాది నవంబర్ 20 నుంచి 28 వరకు జరగబోయే అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ కోసం వెంకయ్య నాయుడు మంత్రిగా ఉన్నప్పుడు 21 మందితో ఒక ప్రివ్యూ స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీకి మూడేళ్ల పదవీకాలాన్ని నిర్ణయిస్తూ సభ్యుల రెమ్యూనరేషన్‌ను సైతం భారీగా పెంచారు. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫ్ఫీ) కోసం అనేక అంతర్జాతీయ చిత్రాలను వడపోసి ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ కమిటీ 150 సినిమాలను వీక్షించింది. అయితే సరిగ్గా ఇదే సమయంలో స్మృతి ఇరానీ ఈ శాఖ బాధ్యతలను చేపట్టారు. నిజానికి ప్రివ్యూ కమిటీ రెండో దశలో మరిన్ని సినిమాలు వీక్షించేందుకు సిద్ధమైంది. అయితే ఢిల్లీకి చెందిన జానపద గాయని కిరణ్ ఝా పేరు జాబితాలో చేర్చేందుకు మంత్రి అనుమతి అవసరం. ఈ మేరకు కిరణ్ ఝా ఫైల్ స్మృతి ఇరానీ వద్దకు చేరింది. ఈ పేరును వెంకయ్య నాయుడు పొరపాటుగా ఏమీ చేర్చలేదు. ఆమె గతంలో కూడా కమిటీలో పనిచేశారు. అయితే ఈ కొత్త పేరును స్మృతి తిరస్కరించారు. అంతటితో ఊరుకోలేదు. మొత్తాన్ని మొత్తం కమిటీనే రద్దు చేసి పడేశారు. ఇప్పటికే 150 సినిమాల స్క్రీనింగ్ అయిపోయిందని, మళ్లీ ఇవన్నీ చూడాలంటే చాలా సమయం పడుతుందని అధికారులు ఎంత చెప్పినా స్మృతి ససేమిరా అన్నారు.

పాత కమిటీని రద్దు చేసిన స్మృతి వెంటనే 40 మందితో కొత్త కమిటీని ఏర్పాటు చేశారు. బాలీవుడ్ సినీ నిర్మాత వివేక్ అగ్నిహోత్రి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో ఆయన భార్య పల్లవి జోషి, పద్మశ్రీ అవార్డు గ్రహీత రచయిత నరేంద్ర కోహ్లీ, నటి హృషితా భట్, సినీ ఎడిటర్ ఆర్తి బజాజ్, రచయిత సినీ విమర్శకుడు ఖలీద్ మహమ్మద్, సినీ దర్శకుడు అనిరుద్ధా రాయ్ చౌదరి తదితరులు సభ్యులయ్యారు. ఈ కమిటీలో దక్షిణ భారత సినీ పరిశ్రమకు చెందిన జీవిత రాజశేఖర్, గౌతమి తాడిమళ్లను కూడా చేర్చారు.

సెన్సార్ బోర్డులోనూ మార్పులు

కేవలం ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాతోనే సరిపెట్టకుండా స్మృతి ఇరానీ తన మార్కు అన్ని విభాగాల్లోనూ చూపుతున్నారు. ఇఫ్ఫీ గురించి ఓవైపు వివాదం చెలరేగుతుండగానే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) చీఫ్‌గా ఉన్న పహ్లాజ్ నిహ్లానీపై వేటు వేశారు. ఆయన పోతూ పోతూ నేరుగా స్మృతి ఇరానీనే నిందిస్తూ వెళ్లారు.

ఇందుకు 'ఇందు సర్కార్' సినిమా విషయంలో మంత్రితో ఏర్పడ్డ విభేదాలే కారణమని ఆరోపించారు. అసలు కట్స్ లేకుండా ఇందు సర్కార్ సినిమాను ఎందుకు అనుమతించలేదని స్మృతి తనను ప్రశ్నించారని, తాను ప్రొసీజర్ ప్రకారమే కొన్ని సీన్లను కట్ చేయాల్సిందిగా సూచించానని చెప్పుకొచ్చారు. ఇది నచ్చకనే తనను తొలగించారని నిహ్లానీ విమర్శించారు. అంతే కాదు, గతంలో భజరంగీ భాయిజాన్ సినిమా విషయంలోనూ హోంశాఖ తనపై ఒత్తిడి చేసిందని, ఉడ్తా పంజాబ్ సినిమా విషయంలోనూ తనపై అనేక ఒత్తిళ్లు వచ్చినా రివైజింగ్ కమిటీ ఓకే చెప్పాకనే తాను క్లియరెన్స్ ఇచ్చానని చెప్పారు. ఈ వివాదాల విషయం ఎలా ఉన్నా నిహ్లానీని తొలగించిన వెంటనే పక్కా సంఘ్ అభిమాని ప్రసూన్ జోషిని సీబీఎఫ్‌సీ చీఫ్‌గా స్మృతి ఇరానీ నియమించారు.

ఎందుకీ మార్పులు?

స్మృతి ఇరానీ ఈ మార్పులన్నీ ఎందుకు చేస్తున్నారన్న ప్రశ్న ప్రతి ఒక్కరినీ వేధిస్తోంది. కేవలం తన వ్యక్తిగత ప్రాభవం కోసమే చేస్తున్నారా అంటే కాదనే తెలుస్తోంది. ప్రభుత్వాధినేత నరేంద్ర మోడీకి అత్యంత విధేయురాలిగా స్మృతి ఇరానీకి పేరుంది. అధినేతల మనసెరిగి ప్రవర్తించడంలో ఆమెకు మరెవరూ సాటిలేరని చెప్పుకుంటారు.

ఇంతకాలం పాటు ఇఫ్ఫీ, సెన్సార్ బోర్డు సహా పలు సంస్థల కూర్పుపై అధినేతలిద్దరూ అసంతృప్తిగా ఉన్నారని సమాచారం. నేరుగా ఈ విషయాన్ని నాటి సమాచార ప్రసారాల శాఖ మంత్రి వెంకయ్య నాయుడుకు చెప్పలేకపోయారు. పార్టీలో, ప్రభుత్వంలో అమిత్ షా, మోడీ కంటే సీనియర్ అయిన వెంకయ్య నాయుడు తన శాఖల విషయంలో స్వతంత్రంగానే వ్యవహరించేవారు. మోడీని పొగడ్తలతో ముంచెత్తుతూనే తనశాఖకు సంబంధించి ఇతరుల సూచనలను ఆయన పెద్దగా పట్టించుకునే వారు కాదు. ఆయన సీనియారిటీని చూసి నేతలెవరూ ఒత్తిడి చేయలేకపోయేవారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే వెంకయ్య నాయుడు హయాంలో తీసుకున్న నిర్ణయాలన్నింటిపైనా ఇప్పుడు పునఃసమీక్ష జరిపి తమకు అనుకూలమైనవారిని కీలకమైన పదవుల్లో నియమించేందుకు ప్రధాని మోడీ, అమిత్ షా సిద్ధమయ్యారని తెలుస్తోంది. వారి ఆలోచనలకు అనుగుణంగా వ్యవహరించే స్మృతి ఇరానీ సమాచార ప్రసారాలశాఖలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టారని అర్థమవుతోంది.

కేసీఆర్‌కు అర్హతలున్నాయి.. అవార్డిచ్చాం

దాసోజు శ్రవణ్‌కు ఐసీఎఫ్ఏ ఈడీ రంధ్వా లేఖ



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ముఖ్య మంత్రి కే చంద్రశేఖరరావుకు తమ సంస్థ పరంగా అన్ని అర్హతలు న్నందుకే ప్రతిష్టాత్మకమైన అగ్రికల్చర్ లీడర్ షిప్ అవార్డు ప్రకటించినట్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ (ఐసిఎఫ్ఎ) సంస్థ ప్రకటించింది. కేసీ ఆర్ ఎంపిక తమ సంస్థ నిబంధనల మేరకే జరిగిందని స్పష్టం చేసింది. వ్యవ సాయ పరిశోధనలో పేరు ప్రఖ్యాతులున్న తమ సంస్థపై దుష్ప్రచారం చేసినందుకు వెంటనే భేషరతుగ మీడియా సమావేశం నిర్వహించి క్షమాపణ చెప్పాల ని టీపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్‌కుమార్‌ను డిమాండ్ చేసింది. ఒక పథకం ప్రకారం నిరాధార, కల్పిత, రాజకీయ ప్రేరేపితంగా విమర్శ లు చేశారని ఆరోపించింది. సంస్థ విశ్వసనీయత దెబ్బతీసే విధంగా ఆరోపణలు చేశారని మండిపడింది. ఈ మేరకు ఇక్ఫా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్ఎస్ రంధ్వా బుధవారం దాసోజు శ్రవణ్‌కు లేఖ రాశారు. శ్రవణ్‌తో పాటు ఏఐసీసీ చైర్ పర్సన్ సోనియాగాంధీ, టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్ రెడ్డికి కూడా లేఖ ప్రతులు పంపారు. 2008 లో అగ్రికల్చర్ లీడర్‌షిప్ అవార్డులను తమ సంస్థ ప్రకటిస్తోందని, వ్యవసాయ రంగం, గ్రామీణ రంగాన్ని సుసంపన్నం చేసిన సంస్థలు, వ్యక్తులకు అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఫిక్కీ, సీఐఐ మాదిరిగానే సెక్షన్ 8 ప్రకారం తమ సంస్థ నమోదైందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో ఆర్థికాభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం సానుకూలంగా కృషి చేసిన వారికే అవార్డుల ప్రదానం జరుగుతుంది. ది గ్లోబల్ అవార్డ్స్ కమిటీ చైర్మన్‌గా2008 -09 లో నాటి కాంగ్రెస్ నాయకుడు, హర్యానా గవర్నర్ డాక్టర్ ఎఆర్ కిద్వాయ్ ఉన్నారు. ఆయన తదుపరి ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ చైర్మన్‌గా 24 మంది సభ్యులతో గ్లోబల్ కమిటీ ఏర్పాటైన విషయం తెలిసిందే.

హైదరాబాద్ సిగలో మణిహారమై!

తెలంగాణ వ్యాప్తంగా ప్రకాశించనుంది లలితా జ్యువెల్లరి

దక్షిణ భారతదేశంలో అగ్రగామి జ్యువెల్లరి అయిన లలితా జ్యువెల్లరి

ప్రపంచంలోనే అతిపెద్ద షోరూంను

ఆదివారం, 27.8.2017

హైదరాబాద్‌లోని సోమాజిగూడలో ప్రారంభించనుంది!

1,30,000 చదరపు అడుగుల విస్తీర్ణంతో..

ప్రపంచంలోనే అతిపెద్ద షోరూంలలో ఒకటైన ఈ బ్రహ్మాండమైన షోరూం 6-3-883, రాజీవ్‌గాంధి విగ్రహం ఎదురుగా, SBR సౌక్ (రాజీవ్‌గాంధి విగ్రహం ఎదురుగా), సోమాజిగూడ, హైదరాబాద్, తెలంగాణ - 500 082 అనే చిరునామాలో ఉంది. తెలంగాణ, భారతదేశం, ప్రపంచంలోనే ఓ ల్యాండ్‌మార్క్‌గా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అంతేకాదు.. నగల సామ్రాజ్యానికే ఇది ఓ చక్కని ఉదాహరణగా ఉంటుంది.

'మొబైల్‌లో నగ ఫొటో మరియు ఎస్టిమేట్ స్లిప్' ఛాలెంజ్:

ధరలు పోల్చి నగలు కొనండి!

ఎస్టిమేట్‌స్లిప్ ఛాలెంజ్.. నగల సామ్రాజ్యంలో తొలిసారిగా ఈ ఛాలెంజ్‌ను తీసుకొచ్చింది లలితా జ్యువెల్లరినే. వినియోగదారులు ఏ నగకైనా సరే ఎస్టిమేట్ స్లిప్ మరియు ఆ నగను మొబైల్‌లో ఫొటో తీసుకుని నాలుగైదు షోరూంలలో ధరలు చెక్ చేసి, ఎక్కడ సరసమైన ధరకు నగలు లభిస్తాయో అక్కడే కొనుగోలు చేయవచ్చు. హైదరాబాద్, తెలంగాణ ప్రజలకు సరసమైన ధరకు, ఎలాంటి జిమిక్కులు లేని పారదర్శకమైన పద్ధతిలో బంగారు నగలు అందించి వారిని సంతోషింపజేయడమే లలితా జ్యువెల్లరి చైర్మన్ మరియు ఎండీ డాక్టర్ కిరణ్‌కుమార్ ప్రధాన ఉద్దేశం.

తొలిసారిగా.. బంగారం, వజ్రాభరణాలు తయారీధరకే!

బంగారం, వజ్రాభరణాలు, వెండి, ప్లాటినం మరియు పలురకాల ప్రత్యేక ఆభరణాలు తయారీ ధరకే అందిస్తోంది లలితా జ్యువెల్లరి. అంతేకాదు.. అత్యంత తక్కువ తరుగుకే లభ్యమవుతుంది. నమ్మకమైన గుర్తింపు పొందడం మాత్రమే కాకుండా, తయారీధరకే నగలను విక్రయించడంలో దక్షిణ భారతదేశంలో విప్లవాన్ని తీసుకొచ్చింది.

బంగారు నగలు 1% నుంచి 9% తరుగుకు హైదరాబాద్‌లోనే తొలిసారిగా లభ్యమవుతుంది. కొన్ని ప్రత్యేక నగలకు మాత్రం 10% నుంచి 16% తరుగు ఉంటుంది. వజ్రాభరణాలు క్యారెట్‌కు రూ.48,000కే లభ్యమవుతుంది. తరుగు కేవలం రూ.975 మాత్రమే. అలాగే అధునాతన, ఆకర్షణీయమైన వెండి వస్తువులకు ఏమాత్రం తరుగు లేదు. బంగారు ఆభరణాలకు BIS 916 హాల్‌మార్క్ సర్టిఫికెట్ మరియు వజ్రాభరణాలకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సర్టిఫికెట్ ఉంటుంది.

ప్రాచీన అందాలను చాటే నగలు, నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా అధునాతన ఆభరణాలకు ఏమాత్రం కొదువలేదు. అలాగే కస్టమర్లకు అనువుగా నగల కొనుగోలు పథకాలను తీసుకొచ్చాం. నగలు కొనుగోలు ప్రక్రియలు సరికొత్త మార్పును తీసుకురానుంది లలితా జ్యువెల్లరి.



మీరు కష్టపడి సంపాదించిన నగదు విలువను

మేం అర్థం చేసుకోగలం..!

లలితా జ్యువెల్లరి చైర్మన్ డాక్టర్. యం.కిరణ్‌కుమార్ ఏం చెబుతున్నారంటే, "ప్రజలు ఎన్నో శ్రమల కోర్చి డబ్బు సంపాదిస్తారు. అలా వాళ్లు చెల్లించే డబ్బుకు గరిష్టస్థాయి బంగారాన్ని ఇవ్వాలన్నదే నా ప్రధాన ఉద్దేశం. ఎలాంటి దాపరికం (హిడన్ ఛార్జీలు) లేకుండా సరసమైన ధరలకు నగలను అందజేస్తాం. నగల విక్రయాలు మరింత పారదర్శకంగా, కస్టమర్లకు ఉపయోగార్థంగా ఉంటుంది. ప్రజలు అవగాహనతో నగలు కొనాలన్న ఉద్దేశంతో మా వైపు నుంచి వారికి 'నగలు కొనడం ఎలా?'.. అన్న విషయంపై రూపొందించిన పుస్తకాన్ని ఉచితంగా అందజేస్తున్నాం. చైన్, గాజులు, నెక్లెస్, చోకర్లు, హారాలు, వంకీ, ఒడ్డాణం, ఉంగరాలు, జుమ్కీలు... ఇవన్నీ పనితనం పరంగానూ, విస్తృత శ్రేణిపరంగా మునుపెన్నడూ చూసి ఉండరు. అందమైన, అద్వితీయమైన వెండివస్తువులు ప్రత్యేక సెక్షన్‌గా కలదు. షోరూంకు ఇది మరో ఆకర్షణీయం. హైదరాబాద్, తెలంగాణ ప్రజలు లలితా జ్యువెల్లరిలో నగలు కొనడంలో సరికొత్త అనుభూతిని పొందుతారని తప్పకుండా చెప్పగలను."

ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక సదుపాయం - ఇది అత్యంత పరిమితకాలమే.

అన్ని బంగారు నగలకు	అన్ని వజ్రాభరణాలకు క్యారెట్‌కు
తరుగులో 1% రాయితీ	రూ.2000 తగ్గింపు

ఓ ఉత్తమమైన చరిత్ర

లలితా జ్యువెల్లరి.. దక్షిణభారతదేశంలో మరింత ప్రాచుర్యం, గుర్తింపు పొందిన నగల సంస్థ. నగల సామ్రాజ్యానికి ప్రతిరూపం. ఇది 1983లో స్థాపితమైంది. తమిళనాట తయారీధరకే నగలు అందించడంలో ఎనలేని గుర్తింపు పొందింది. అంతేకాకుండా లక్షలాది వినియోగదారుల విశ్వసనీయతను, ఆదరాభిమానాలను సొంతం చేసుకుంది. సొంత తయారీ వెసులుబాటు, హోల్‌సేల్ నెట్‌వర్క్, సరసమైన ధరకు నగలు కొనాలని వినియోగదారులకు అవగాహన కల్పించే ఏకైక సంస్థ. లలితా జ్యువెల్లరి!



నగలు కొనేముందు లలితావారి 'స్వర్ణ నియమాలు'

బంగారు నగలు కొనేముందు కింద పేర్కొన్న స్వర్ణ నియమాలను దయచేసి దృష్టిలో ఉంచుకోవాల్సిందిగా లలితా జ్యువెల్లరి కోరుకుంటోంది.

- బంగారు నగలపై BIS 916 హాల్‌మార్క్ గుర్తు, వజ్రాభరణాలకు అంతర్జాతీయ స్థాయి సంస్థచే ఆథెంటిసిటి సర్టిఫికెట్ ఉందా అని సరిచూసుకోవాలి.
- ఉచితాలను చూసి మోసపోకండి. భేరమాడటంలో వేలాది రూపాయలను కోల్పోకండి.
- నగలు కొనేముందు నాలుగైదు షోరూంలలో ధరలు పోల్చిచూడండి.
- కాస్టింగ్ డిజైన్, ఆంటిక్ కలెక్షన్స్, సూపర్ ఆంటిక్ కలెక్షన్, డైమండ్ చక్రి, పోల్కి, నగాజ్ వంటి ఫ్యాన్సీ నగలకు అధిక తరుగు చెల్లించకండి.
- ఏదైనా నగల కొనుగోలు చేరినప్పుడు ఆ స్కీమ్ గురించి క్షుణ్ణంగా అర్థం చేసుకోండి. ప్రతినెల బంగారం రూపంలో మీ ఖాతాలో చేర్చుతారు.
- నగలకు ఎంత తరుగు చెల్లిస్తున్నామోనన్న విషయాన్ని లెక్కగట్టండి. ఎక్కువ తరుగు ఛార్జీలు చెల్లించేటప్పుడు అధిక నగదు చెల్లించాల్సి వస్తుందన్న విషయాన్ని మరిచిపోకండి.
- నగలు కొనేముందు బిల్లులో పూర్తి వివరాలు ఉండేలా అడగండి. నగ బరువు, ఆరోజు బంగారం విలువ, తరుగు ఛార్జీలు, రాళ్ల ధర.. వంటి వివరాలు వివరణాత్మకంగా ఉండాలి.
- 'బిల్లులేదు, ట్యాక్స్‌లేదు' వంటి విషయాలను మిమ్మల్ని పక్కదోవ పట్టిస్తాయి. బిల్లులో అన్ని వివరాలు ఉన్నప్పుడే.. నగ అసలైన విలువను మీరు సరిగ్గా లెక్కగట్టగలరన్న విషయాన్ని నగలు కొనేటప్పుడు గుర్తుంచుకోండి.

ముఖ్యమైన అంశం: మీరు తక్కువ తరుగుకు నగలు కొనేటప్పుడు మాత్రమే అధికంగా ఆదా చేయగలరు.

నాణ్యతైన వజ్రాభరణానికి ఎక్కువ ధర చెల్లించక్కర్లేదు!



వజ్రాభరణాలన్నీ ఖరీదైనవని భావిస్తున్నట్లయితే మళ్లీ ఓ సారి ఆలోచించండి. ఎందుకంటే లలితా జ్యువెల్లరి ఆ తరహా అభిప్రాయాన్ని సవరించింది.

వజ్రాభరణాలను ఎంచుకునేటప్పుడు దానికి అదే షోరూం ఇచ్చే 'ఇన్‌హౌస్ సర్టిఫికెట్' కాకుండా అంతర్జాతీయ స్థాయి సంస్థ ఇచ్చే ఆథెంటిసిటి సర్టిఫికెట్ ఉందా అని సరిచూసుకోండి. వజ్రాభరణాన్ని వెలకట్టాలంటే దాన్ని ప్రిన్సిపల్‌ను ముందుగా అర్థం చేసుకోవాలి. అందులో నాలుగు 'సి'లు ఉన్నాయి.

- కలర్ : ప్రముఖమైన జెమొలొకాలజికల్ ఇండస్ట్రీ సంస్థలు ప్రతి వజ్రాన్ని గ్రేడ్ చేస్తుంది. మంచి వజ్రాలు రంగురహితంగా ఉంటుంది. అయినప్పటికీ చాలా వజ్రాలు కొంత రంగు అయిన ఉంటుంది.
- కట్: వజ్రాల కట్ అనేది స్టైల్ లేదా డిజైన్‌ను సూచించేది. ఆకారాన్ని నిర్ణయించేది కాదు.
- క్యారెట్: వజ్రాల విలువ దాని సైజ్ మీదే ఆధారపడి ఉంటుంది. వజ్రం పెద్దదిగా ఉంటే విలువ ఎక్కువగా ఉంటుంది.
- క్లారిటీ : వజ్రం విలువను మదించేటప్పుడు వజ్రం అసంపూర్ణత, నాణ్యతలే కీలకంగా ఉంటాయి.

హైదరాబాద్‌లోనే తొలిసారిగా ప్రజలు అత్యంత తక్కువగా క్యారెట్‌కు రూ.48,000కు, తరుగు రూ.975కు లలితా జ్యువెల్లరి అందించనుంది. అంతేకాకుండా E-F కలర్‌గ్రేడ్ మరియు VVS క్లారిటీతో అందిస్తుంది. కస్టమర్లకు అనువైన బైబ్యాక్ పాలసీ ద్వారా 100% ఎక్స్‌ఛేంజ్ చేసుకునే సౌకర్యం లేదా నగదుగా అయితే 85% పొందే అవకాశం ఉంది. అందువల్ల ఇతర షోరూంలతో పోల్చితే క్యారెట్‌కు లక్షలాది రూపాయలను ఆదా చేయవచ్చు.

కనువిందైన వెండివస్తువులు!



సంప్రదాయ మరియు వినూత్నమైన వెండి సామగ్రి కలిగిన అతిపెద్ద సెక్షన్‌ను లలితా జ్యువెల్లరి కలిగి ఉంది.

దీపస్తంభాల నుంచి ప్రతిమలతో పాటు పలురకాల పూజ వస్తువులు ఎంతో ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. వెండిగిన్నెలు, గ్లాసుల సెట్, పంచపాత్ర, పూజ సామగ్రి సెట్, అష్టలక్ష్మి కలశం, ప్లేట్లు, కుంకుమభరిణ, వెండిదీపాలు ఇవన్నీ సంప్రదాయానికి ప్రతిరూపంగా నిలుస్తున్నాయి. కనువిందు చేయడం మాత్రమే కాకుండా చాలా వరకు వస్తువులకు ఏమాత్రం తరుగు లేకపోవడమే లలితా జ్యువెల్లరి ప్రత్యేకత.

స్వర్ణ ఉదయం

నగలు కొనేందుకు తెలివైన మార్గం



తక్కువ తరుగు కాకుండా ఉపయోగకరమైన చిట్‌స్కీమ్ మరియు అడ్వాన్స్ నగల బుకింగ్ స్కీమ్‌లో చేరడమే నగలు కొనేందుకు ఉత్తమమైన దారి. మార్కెట్‌లో చాలా రకాల స్కీమ్‌లు ఉన్నాయి.

అయితే లలితా జ్యువెల్లరి వారి స్వర్ణ ఉదయం మాదిరిగా ప్రయోజకరమైన స్కీమ్ మరొకటిలేదు. ఇది 11నెలల నగల కొనుగోలు పథకం. తొలినెల వాయిదా పూర్తిగా ఉచితం.ఈ వెసులుబాటు మీకు నగ కొనుగోలు పథకానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. అంతేనా?.. ఈ స్కీమ్ కింద కొనే నగలకు ఏమాత్రం తరుగు లేదు.

ఉజ్వల భవిష్యత్తు

Lalithaa™

ఒక షోరూంతో చెన్నైలో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన లలితా జ్యువెల్లరి ఇప్పుడు అతిపెద్ద, గుర్తింపు పొందిన సంస్థగా ఎదగడంతోపాటు దక్షిణ భారతదేశంలో ఏకంగా 14 సుందరమైన షోరూంలను కలిగి ఉంది. అంతేకాకుండా ఏడాదికి రూ.10700 కోట్ల టర్నోవర్‌ను చేస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సోమాజిగూడ, కూకట్‌పల్లిలో తన 15షోరూంను ప్రారంభించింది. త్వరలో విజయవాడ మరియు రాజమండ్రిలో షోరూంలను ప్రారంభించనుంది.

మరిన్ని విశేషాలు

తక్కువ తరుగు, అద్భుతమైన పనితనం, హిడన్ ఛార్జీలు వేయకపోవడం, సరసమైన ధర.. ఇవన్నీ లలితా జ్యువెల్లరి ప్రతిష్టాత్మకమైన నియమాలు.

ప్రారంభం కాలం నుంచి దాదాపు మూడు తరాలుగా ఈ నియమాలను తప్పకుండా పాటిస్తోంది. అలాగే సరైన అవగాహనతో నగలు కొనాలన్న ఉద్దేశంతో ప్రజలను ప్రోత్సహిస్తోంది. నగలు కొనేందుకు లక్షలాది మంది ప్రజలు లలితా జ్యువెల్లరి మార్గాన్నే ఎంచుకున్నారు. అదేవిధంగానే హైదరాబాద్, తెలంగాణ ప్రజలు కూడా ఎంచుకుంటారు. సుస్వాగతం !

ఇదో అపూర్వం!

'అడ్వాన్స్ నగల బుకింగ్ స్కీమ్'

లలితా జ్యువెల్లరి మరో అద్భుతమైన నగల కొనుగోలు పథకాన్ని అందిస్తోంది. అదే.. 'అడ్వాన్స్ నగల బుకింగ్ స్కీమ్'! నగలు కొనేటప్పుడు తరుగు ఏమాత్రం లేదు!! ఒకసారి నగదు చెల్లించి 7 నెలల తర్వాత తరుగు లేకుండా మనసుకు నచ్చిన నగలు కొనుగోలు చేయవచ్చు. 7% తరుగు ఉన్న నగలను 7 నెలల తర్వాత, 8% తరుగు ఉన్న నగలను 8 నెలల తర్వాత తరుగు లేకుండా కొనొచ్చు. 8% కన్నా ఎక్కువగా తరుగు ఉన్న నగలకు వ్యత్యాసమున్న తరుగు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. మరో ప్రత్యేకత ఏంటంటే.. మీ పాత నగలను ఇచ్చి కూడా ఈ స్కీమ్‌లో చేరొచ్చు.

అదనపు వివరాల కోసం: లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్, 6-3-883, SBR సౌక్, సోమాజిగూడ సర్కిల్ (రాజీవ్‌గాంధి విగ్రహం ఎదురుగా), హైదరాబాద్ - 500 082, తెలంగాణ. ఫోన్: 040-6748 6677.

లలితా జ్యువెల్లరి వారి ప్రతిష్టాత్మకమైన ఇతర షోరూంలు చెన్నై, మదురై, తిరుచ్చి, పుదుచ్చేరి, కుంభకోణం, రామనాథపురం, బెంగళూరు, కోయంబత్తూరు, తిరుపతి, విశాఖపట్నంలో ఉన్నాయి.




అఫ్రిది 43 బంతుల్లో.. 101

లండన్: దూకుడు బ్యాటింగ్‌కు మారుపేరైన పాకిస్థాన్ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిది మరోసారి రికార్డు స్కోరు సాధించాడు. ఈ సారి వేదిక.. ఇంగ్లాండ్ కౌంటీ పోరు. హాంప్‌షైర్ తరఫున ఓ టీ20 మ్యాచ్‌లో మెరుపు వేగంతో 43 బంతుల్లోనే 101 పరుగులు బాదేసి జట్టును గెలిపించాడు. మంగళవారం జరిగిన ఈ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో హాంప్‌షైర్ 101 పరుగుల భారీ తేడాతో డెర్బీషైర్‌పై గెలిచింది. అఫ్రిది స్కోరులో ఏడు సిక్స్‌లు, 10 ఫోర్లు ఉన్నాయి. అఫ్రిది చెలరేగడంతో ముందుగా హాంప్‌షైర్ 8 వికెట్లకు 249 పరుగులు సాధించింది. ఇది ఆ జట్టుకు అత్యధిక టీ20 స్కోరు కూడా. తర్వాత డెర్బీషైర్ 148 పరుగులకే కుప్పకూలింది.


అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు వేన్ రూనీ గుడ్‌బై


లండన్: ఇంగ్లాండ్‌ఫుట్‌బాల్ స్టార్ వేన్ రూనీ అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. బుధవారం అతనీ ప్రకటన చేశాడు. తన నిర్ణయాన్ని వెంటనే అమలులో పెడుతున్నట్లు ఇంగ్లాండ్ జట్టు మేనేజర్ గరెత్ సౌత్‌గేట్‌కు రూనీ తెలియజేశాడు. జట్టులోకి తిరిగి రావాలని సౌత్‌గేట్ కోరినపుడు రూనీ ఆ విషయాన్ని స్పష్టంచేశాడు. 31 ఏళ్ల రూనీ ఇంగ్లాండ్ తరఫున 119 మ్యాచ్‌లాడి రికార్డు స్థాయిలో 53 గోల్స్ చేశాడు. రూనీ ఇటీవలే కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కూడా కోల్పోయాడు. ''సౌత్‌గేట్ నాకు ఫోన్ చేయడం గొప్ప విషయం. అతను నన్ను తిరిగి జట్టులోకి రమ్మన్నాడు'' అని రూనీ చెప్పాడు.



సైనా సునాయాసంగా

• ప్రణీత్ పోరాడి.. శ్రీకాంత్ అలవోకగా ప్రి క్వార్టర్స్‌కు







గ్లాస్గో: భారత బ్యాడ్మింటన్ సూపర్‌స్టార్ సైనా నెహ్వాల్.. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో సునాయాస విజయం సాధించింది. సాయి ప్రణీత్ రెండో రౌండ్లో చెమటోడ్చి గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టాడు. తొలి రోజు స్ఫూర్తిదాయక విజయం సాధించిన కిదాంబి శ్రీకాంత్ రెండోరౌండ్లో కూడా తిరుగులేని విధంగా ఆడి గెలిచాడు. సాయి ప్రణీత్ ఓటమి నుంచి తృటిలో తప్పించుకున్నాడు. బుధవారం మహిళల సింగిల్స్ రెండో రౌండ్ పోరులో సైనా 21-11, 21-12 తేడాతో స్విస్ షట్లర్ సబ్రినా జాక్వెట్‌పై అలవోకగా గెలిచి ప్రి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకుపోయింది. ఈ పోరు 33 నిమిషాల పాటు సాగింది. ప్రి క్వార్టర్స్‌లో రెండో సీడ్ కొరియా క్రీడాకారిణి సంగ్ జి హ్యూన్‌తో సైనా తలపడవచ్చు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ పోరులో శ్రీకాంత్ 21-9, 21-17తో ఫ్రాన్స్‌కు చెందిన లుకాస్ కోర్వీని ఓడించాడు. ఇండొనేషియా షట్లర్ ఆంథోనీతో జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ పోరులో సాయి ప్రణీత్ తొలి గేమ్‌లో ఓడినా చివరకు 14-21, 21-18, 21-19తో కష్టపడి గెలిచాడు.

సైనాకు నల్లేరుపై నడకే: సైనా ఆట ఆరంభం నుంచి ఆధిపత్యం చెలాయించింది. ఆదిలోనే 4-0తో ఆధిక్యంలో నిలిచిన సైనా అనతికాలంలోనే 11-6కు పెంచుకుంది. సబ్రినా కోలుకొని సైనా ఆధిక్యాన్ని 9-13కు తగ్గించినా హైదరాబాదీ 14 నిమిషాల్లో తొలి గేమ్‌ను వశం చేసుకుంది. రెండో గేమ్‌లోనూ సైనా జోరు కొనసాగింది. స్మాష్‌లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసి ఆరంభంలోనే 5-2 ఆధిక్యంలోకి వెళ్లింది. విరామానికి సైనా 11-7తో నిలిచింది. తర్వాత అదే ఊపును కొనసాగించి మ్యాచ్‌ను గెలుచుకుంది.

ప్రణీత్ కష్టపడి: ప్రణీత్.. ఆట ఆరంభంలో ఆంథోనీ దూకుడును రుచి చూశాడు. ఆంథోనీ ఆరంభంలోనే 8-0 ఆధిక్యంలోకి దూసుకుపోయాడు. తర్వాత ఆ ఆధిక్యాన్ని 16-6కు పెంచుకున్నాడు. పాయింట్ల తేడాతో అంతరం ప్రణీత్‌కు తొలి గేమ్‌ను దూరం చేసింది. రెండో గేమ్‌లో ప్రణీత్ పుంజుకున్నాడు. విరామానికి 11-9 ఆధిక్యం సాధించాడు. 14-12 ఆధిక్యంలో ఉండగా సాయికి వైద్య సహాయం అవసరమైంది. ఇదే అదనుగా ఆంథోనీ 16-15 ఆధిక్యంలోకి దూసుకుపోయాడు. ఐతే సాయి అవకాశాన్ని విడిచిపెట్టకుండా హోరాహోరీగా పోరాడి రెండో గేమ్‌ను 21-18తో సొంతం చేసుకున్నాడు. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ప్రణీత్ ఆదిలోనే 6-2 ఆధిక్యం సాధించాడు. అదే ఊపులో ఆధిక్యాన్ని 11-9కు పెంచుకున్నాడు. విరామానికి ఆంథోనీ 18-12 ఆధిక్యం సాధించాడు. కానీ ప్రణీత్ ఆరు పాయింట్ల ఆధిక్యాన్ని అధిగమించి చివరకు రెండు పాయింట్ల ఆధిక్యంలోకి దూసుకుపోయాడు. ఆంథోనీకి మరో అవకాశం ఇవ్వకుండా గేమ్‌ను, మ్యాచ్‌ను ప్రణీత్ దక్కించుకున్నాడు. మహిళల సింగిల్స్ రెండోరౌండ్లో తన్వి లాడ్ 9-21, 19-21 తేడాతో కొరియా షట్లర్ సంగ్ జి హ్యూన్ చేతిలో ఓడింది. మహిళల డబుల్స్ రెండో రౌండ్ పోరులో అశ్విని, సిక్కి రెడ్డి జోడీ 22-24, 21-17, 15-21తో పోరాడి కమిల్లా, క్రిస్టియానా (డెన్మార్క్) చేతిలో ఓడింది. సంజనా సంతోష్, ఆర్తి సారా సునీల్ 14-21, 15-21తో బావో యింగ్జి, యు జియోహాన్ (చైనా) చేతిలో ఓడారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో మేఘన జక్కంపూడి, పూర్విష ఎస్ రామ్ జోడీ 21-13, 16-21, 8-21 తేడాతో నెదర్లాండ్స్ జంట మస్కీన్స్, సెలెనా చేతిలో ఓడింది. పురుషుల డబుల్స్‌లో అర్జున్, రామచంద్రన్ 14-21, 21-19, 14-21తో చైనీస్ తైపీ జోడీ లియో మిన్ చున్, చెంగ్ హెంగ్ సు చేతిలో ఓటమి పాలయ్యారు.



పోరాడి ఓడిన దబాంగ్

లక్నో: ప్రో కబడ్డీ లీగ్ పోరులో హర్యానా స్టీలర్స్ బుధవారం దబాంగ్ ఢిల్లీపై చమటోడ్చి గెలిచింది. ఈ పోరులో హర్యానా 27-25 తేడాతో విజయం సాధించింది. రెండో అర్థంలో ఓ దశలో దబాంగ్‌దే విజయం వరిస్తుందనిపించింది. తొలి అర్థంలో నిరాశాజనకంగా ఆడడం వల్లే దబాంగ్ ఓటమి చవిచూసింది. దీపక్ కుమార్ దహియా ఏడు రైడ్ పాయింట్లు సాధించి స్టీలర్స్‌ను విజయపథంలో నడిపించాడు. ఆట ఆరంభంలోనే దబాంగ్ 2-0 ఆధిక్యం సంపాదించింది. హర్యానా మాత్రం నిదానంగా పాయింట్ల సాధన ఆరంభించింది. దీపక్ నాలుగో నిమిషంలో రెండు పాయింట్లు సంపాదించడంతో హర్యానా 5-3 ఆధిక్యంలోకి దూసుకుపోయింది. తొలి అర్థం ముగిసేసరికి హర్యానా ఆలౌట్ చేసి దబాంగ్‌పై ఒత్తిడి పెంచింది. హర్యానా డిఫెన్స్ దుర్భేధ్యంగా ఉండడంతో దబాంగ్‌కు పాయింట్లు సంపాదించడం తీవ్రంగా కష్టపడాల్సి వచ్చింది. తొలి అర్థం ముగిసేసరికి హర్యానా 17-9 ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్థంలో 25వ నిమిషంలో దబాంగ్,.. హర్యానాను ఆలౌట్ చేయడంతో ఆధిక్యం 14-18కి తగ్గించగలిగింది. ఆ జోరును కొనసాగిస్తూ దబాంగ్.. హర్యానాపై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నించింది. అబుల్ ఫజల్ రెండు రైడ్ పాయింట్లు తేవడంతో రెండు జట్లు 19-19తో సమానంగా నిలిచాయి. మరికొద్ది నిమిషాల్లోనే హర్యానా తేరుకొని ఆధిక్యాన్ని 24-20కి పెంచుకుంది.

కానీ దబాంగ్ మళ్లీ ఊపులోకి వచ్చి 37వ నిమిషంలో స్కోరును 24-24తో సమం చేసింది. 38వ నిమిషంలో సుర్జీత్ సింగ్ రెండు పాయింట్లు సాధించడంతో హర్యానా 27-25తో గెలిచి ఊపిరిపీల్చుకుంది. యోధా, తలైవాస్ మధ్య పోరు 33-33తో టైగా ముగిసింది.

ఐపీఎల్ బ్రాండ్ విలువ 530 కోట్ల డాలర్లు

ముంబయి: క్రికెట్ అభిమానుల్లో విపరీత ఆదరణకు నోచుకున్న ఐపీఎల్ బ్రాండ్ విలువ అమాంతం పెరిగిపోయింది. పదో ఏడాది టోర్నీ అనంతరం ఐపీఎల్ బ్రాండ్ విలువ 530 కోట్ల డాలర్లకు పెరిగింది. ఈ విషయాన్ని అంతర్జాతీయ కార్పొరేట్ ఫైనాన్స్ సలహాదారు డఫ్ అండ్ ఫెల్ప్స్ తెలిపింది. గత ఏడాది ఐపీఎల్ బ్రాండ్ విలువ 420 కోట్ల డాలర్ల నుంచి 530 కోట్ల డాలర్లకు పెరిగిందని ఈ సంస్థ తన నివేదికలో తెలిపింది.

ముంబయి ఇండియన్స్ జట్టు బ్రాండ్ విలువ 2017లో 10.6 కోట్ల డాలర్లకు పెరిగింది. బ్రాండ్ విలువలో అంబానీ జట్టుదే అగ్రస్థానం. కోల్‌కత విలువ 9.9 కోట్ల డాలర్లు కాగా బెంగళూరు 8.8 కోట్ల డాలర్లతో మూడో స్థానంలో నిలిచింది.

ఆ ఇద్దరు అక్కడ తలపడితే..

వారిద్దరి మధ్య మైదానంలో శత్రుత్వం 13 ఏళ్లుగా కొనసాగుతోంది. అయినా ఒకరంటే ఒకరికి గౌరవమే. ఎన్నో గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో వారిద్దరి పోరు రసవత్తరం. అభిమానులకు కనుల పంటే. చివరికి ఎవరు గెలిచినా ఇద్దరు గెలిచినట్లు సంబరాలే. ఎన్నో గ్రాండ్‌స్లామ్ ఫైనళ్లు టెన్నిస్ అభిమానులకు విందు భోజనం వడ్డించాయి. ఐతే వారిద్దరు ఒకచోట మాత్రం ఎదురు కాలేదు. వారు.. వింబుల్డన్‌లో తిరుగులేని రోజర్ ఫెదరర్.. ఫ్రెంచ్ ఓపెన్‌లో ఎదురులేని రఫెల్ నాదల్. వీరిద్దరు ఎదురుకాని వేదిక.. యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్.





న్యూయార్క్: స్పెయిన్ బుల్ నాదల్, స్విస్ చిన్నోడు ఫెదరర్ ఇంతవరకు 37 మ్యాచ్‌లలో తలపడ్డారు. కానీ యుఎస్ ఓపెన్‌లో మాత్రం ఢీకొనలేదు. 2017లో మాత్రం ఆ అవకాశం వారికి లభించబోతోంది. మూడేళ్ల తర్వాత నెంబర్ వన్ ర్యాంకును అందుకున్న 31 ఏళ్ల నాదల్ నూతనోత్సాహంతో తొణికిసలాడుతు న్నాడు. మునుపటి కంటే ఇపుడు నెంబర్ వన్ కావడం ఎంతో ప్రత్యేకమని కూడా అంటున్నాడు. యుఎస్ ఓపెన్‌లో 2010, 2013లో రెండు సార్లు విజేతగా నిలిచిన నాదల్ ఈ ఏడాది నూతనోత్సాహంతో బరిలోకి దిగనున్నాడు. ఈ మట్టికోట మహరాజు గతజూన్‌లో పదో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ కైవసం చేసుకొని తన గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను 15కు పెంచుకు న్నాడు. మరోవైపు యుఎస్ ఓపెన్‌లో 2004-2008 మధ్య కాలంలో ఐదు సార్లు విజేతగా నిలిచిన ఫెదరర్ .. 20వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం సమాయత్తమ వుతున్నాడు. ఈ ఏడాది ఫెడెక్స్ ఇప్పటికే ఆస్ట్రేలియన్ ఓపెన్, వింబుల్డన్ టైటిళ్లు గెలిచి ఊపుమీదున్నాడు. సెప్టెంబరు 10న జరిగే యుఎస్ ఓపెన్ ఫైనల్లో 36 ఏళ్ల ఫెదరర్ విజేతగా నిలిస్తే ఆధునిక యుగంలో పెద్ద వయసులో గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచిన ఆటగాడిగా చరిత్ర సృష్టిస్తాడు.

నొవాక్ జకోవిచ్ తప్పుకోవడంతో...: రెండు సార్లు విజేత, చెక్ ఆటగాడునొవాక్ జకోవిచ్ మోచేతి గాయంతో యుఎస్ ఓపెన్ నుంచి తప్పుకోవడంతో నాదల్, ఫెదరర్‌కు అరుదైన అవకాశం లభించినట్లయింది. డిఫెండింగ్ ఛాంపియన్ వావ్రింకా కూడా మోకాలి గాయంతో పోటీ నుంచి వైదొలగడం కూడా ఈ దిగ్గజాలకు కలిసి వచ్చింది. గాయంతో బాధపడుతున్న 2012 ఛాంపియన్ ఆండీ ముర్రే కూడా యుఎస్ ఓపెన్లో ఆడేది అనుమానం కావడంతో నాదల్, ఫెదరర్ పోరుకు లైన్ క్లియర్ అయినట్లే. తుదిపోరులో ఈ వీరులిద్దరూ ఎదురయ్యే అవకాశాలే మెండు.

ఐతే నాదల్ 2013 నుంచి యుఎస్ ఓపెన్‌లో నాలుగో రౌండ్ దాటింది లేదు. ''యుఎస్ ఓపెన్ పూర్తిగా భిన్నమైంది. భిన్నమైన ఆట. న్యూయార్క్‌లో మెరుగ్గానే ఆడాను. ఈ ఏడాది బాగానే ఆడానని భావిస్తాను. యుఎస్ ఓపెన్‌లో కఠిన పోరుకు సిద్ధంగా ఉన్నాను'' అని నాదల్ చెప్పాడు. మరోవైపు ఆరో టైటిల్‌తో పీట్ సంప్రాస్, జిమ్మీ కానర్స్‌లను దాటిపోవాలని 8 వింబుల్డన్ టైటిళ్లు వశం చేసుకున్న ఫెడెక్స్ తహతహలాడుతున్నాడు. నాదల్ 2009లో యుఎస్ ఓపెన్ ఫైనల్లో ఓటమి చవిచూశాడు. ఫెదరర్‌పై గెలిచి జువాన్ మార్టిన్ డెల్ పొట్రో సంచలనం సృష్టించాడు. ''2017లో మూడో టైటిల్ గెలిచి గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను 20కు పెంచుకుంటే ఎంతో ఆనందిస్తాను. ఆ క్షణం వచ్చినపుడు నూరు శాతం సిద్ధంగా ఉంటానని ఆశిస్తున్నాను'' అని ఫెదరర్ అన్నాడు.

ఎదురుందా?

• జోరుమీదున్న కోహ్లీసేన • విశ్వాసం సన్నగిల్లిన లంక • రెండో వన్డే నేడే

ధావన్ దూకుడు.. అటు టెస్టుల్లోనే కాకుండా ఇటు వన్డేల్లోనూ భీకర ఫామ్... బౌండరీలతో విరుచుకుపడుతూ అలవోకగా సెంచరీల బాదుడు. కెప్టెన్ కోహ్లీ అదే నిలకడ. తొలి వన్డేలో రనౌటై పరుగుల కోసం ఆకలిగొన్న పులిలా ఉన్న డబుల్ సెంచరీల వీరుడు రోహిత్. ఇంకా అసలుసిసలు పరీక్ష ఎదురుకాని యువకులు. తొలి వన్డేలో తిరుగులేని గెలుపును సొంతం చేసుకున్న భారత జట్టు తీరిది. జట్టులో చోటు కోసం తహతహలాడుతున్న యువకులు కూడా విరుచుకుపడితే లంక పరిస్థితి?. అసలే వరుస ఓటములతో ఆత్మవిశ్వాసం సన్నగిల్లి అయోమయంలో పడిన ఆతిథ్య జట్టు .. ఈ సారైనా భారత్ స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కోగలదా? టీమ్‌ఇండియాను ప్రతిఘటించగలదా? 2019 ప్రపంచకప్‌లో నేరుగా ప్రవేశించాలంటే కనీసం రెండైనా మ్యాచ్‌లు గెలవాల్సిన లంక.. గురువారం పల్లెకెలెలో జరిగే రెండో డేనైట్ వన్డేలో ఏమాత్రం రాణిస్తుందో చూడాలి.



పల్లెకెలె: తొలి వన్డేలో 9 వికెట్ల గెలుపుతో జోరుమీదున్న భారత్.. మరోసారి తిరుగులేని విజయాన్ని సాధించడానికి సమాయత్తమవుతోంది. ప్రపంచకప్‌కు యువకుల్ని పరీక్షించాలనుకున్నా.. తొలి వన్డేలో టీమ్‌ఇండియాకు కొంత మేరే ఆ అవకాశం కలిగింది. టెస్టుల్లో ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ కేఎల్ రాహుల్‌ను వన్డేలలో నాలుగో స్థానంలో ఆడించి పరీక్షించాలనుకున్నా ధావన్, కోహ్లీలే తొలి వన్డేలో చక్కబెట్టేశారు. ఈ నేపథ్యంలో కోహ్లీ రెండో వన్డేకు జట్టులో పెద్దగా మార్పులు తలపెట్టకపోవచ్చు.

కుల్‌దీప్ బెంచ్‌కే: తొలి మ్యాచ్‌లో ఇద్దరు లెగ్‌స్పిన్నర్లు కాని, ఇద్దరు ఎడమచేతి వాటం స్పిన్నర్లను కాని ఒకేసారి ఆడించడానికి ఇష్టపడని కెప్టెన్ విరాట్.. చచల్-అక్షర్ పటేల్‌లను తీసుకున్నాడు. లంక వికెట్లపై ముగ్గురు స్పిన్నర్లను ఆడించాల్సిన అవసరం లేదని కోహ్లీ భావిస్తున్నాడు. ఇక్కడి పిచ్ పొడిగా ఉంటే తప్ప కుల్‌దీప్ యాదవ్‌ను బెంచ్‌కు పరిమితం కావడానికే అవకాశాలెక్కువ. మనీష్ పాండే, అజింక్య రహానే, శార్దూల్ ఠాకూర్ కూడా బెంచ్‌కే పరిమితం కాక తప్పదు. జట్టులో మార్పులు చేయకపోయినా... రాహుల్, కేదార్ జాదవ్‌లకు అవకాశమిచ్చేందుకు బ్యాటింగ్ ఆర్డర్‌లో విరాట్ మార్పులు తలపెడతాడా అన్నదే ఆసక్తికర అంశం. టీమ్‌ఇండియా బ్యాట్స్‌మెన్‌ను ఏమాత్రం ఇబ్బంది పెట్టలేకపోయిన లంక బౌలింగ్‌లో వీరికి కాస్త బ్యాటింగ్ ప్రాక్టీసు ఉంటుందని అతను భావిస్తే మాత్రం ఆర్డర్‌లో మార్పులు జరుగుతాయి.

పిచ్

పల్లెకెలె పిచ్‌పై స్కోర్లు మూడొందలు దాటకపోవచ్చు. 18 మ్యాచ్‌లలో మూడింట 300 స్కోరు దాటింది. పిచ్ అటు బ్యాటింగ్‌కు, ఇటు బౌలింగ్‌కు అనుకూలంగా ఉండి సమతూకం ఉంటుంది. 2012 ఆగస్టులో చివరి సారిగా ఆడిన భారత్ 294 పరుగులను కాపాడుకోగలిగింది. మ్యాచ్ జరిగే రోజంతా ఆకాశం మేఘావృతమై ఉండే సూచనలున్నాయి. వేడి అత్యధికంగా 30 డిగ్రీల సెల్సియస్ ఉంటుంది.

లంక సెలెక్షన్ సమస్యలు: ఆటగాళ్ల పేలవ ప్రదర్శనతో పాటు లంక సెలెక్షన్ సమస్యలనెదుర్కొంటోంది. టెస్టు కెప్టెన్, దూకుడుకు మరోపేరైన దినేష్ చండిమాల్‌ను తుది జట్టు నుంచి పక్కన పెట్టి లంక మూల్యం చెల్లించింది. సాధారణంగా ఓపెనర్‌గా బరిలోకి దిగే ఉపుల్ తరంగ నాలుగో స్థానంలో రావడం జట్టు వ్యూహాలు ప్రశ్నార్థకమయ్యాయి. గత వన్డేలో ఆకట్టుకోలేని ధిసారా పెరెరా, లక్షణ్ సండకన్, హసరంగలకు తుది జట్టు నుంచి లంక తప్పించవచ్చు. సిరివర్దన, పుష్పకుమార, చమీర వారి స్థానంలో జట్టులోకి వస్తారు. జట్టు ఎంపికలో లుకలుకల మాటలా ఉంచి నెంబర్ వన్ జట్టుకు, 7వ ర్యాంకు జట్టుకు మధ్య అంతరం దంబుల్లాలో ప్రస్ఫుటంగా కనిపించింది. టీమ్‌ఇండియాకు లంక ఏ విభాగంలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. అందుకే అభిమానుల ఆగ్రహానికి గురవుతోంది. లంక కోలుకోవడం మాటెలా ఉన్నా 2019 ప్రపంచ కప్‌కు టీమ్‌ఇండియా సమాయత్తమవుతున్న నేపథ్యంలో అక్షర్, చచల్ వంటి యువకులకు రెండో వన్డే ఎంతో కీలకమైందనే చెప్పాలి.

తుది జట్లు:

భారత్ (అంచనా): రోహిత్, ధావన్, కోహ్లీ (కెప్టెన్), రాహుల్, ధోని (కీపర్), కేదార్ జాదవ్, పాండ్య, అక్షర్, భువనేశ్వర్, బుమ్రా, చచల్.

శ్రీలంక (అంచనా): డిక్వెల (కీపర్), గుణతిలక, మెండిస్, తరంగ (కెప్టెన్), మాథ్యూస్, కపుగెదెర, సిరివర్ధన, పుష్పకుమార, చమీర, మలింగ, ఫెర్నాండో.

7 రోహిత్ లంకపై గత ఏడు వన్డేల్లో 5,5,0,0,4,4,4 స్కోర్లు సాధించాడు. ఒకే సంఖ్య స్కోర్లలో జయసూర్యకు మరో మ్యాచ్ దూరంలో నిలిచాడు.

99 వన్డేల్లో కుమార సంగక్కర ప్రపంచ రికార్డు స్టంపింగ్‌లకు ధోని (98) మరో స్టంపింగ్ దూరంలో ఉన్నాడు. అతను 278 క్యాచ్‌లందుకున్నాడు.

Printed & Published by ***MOOTHA GOUTAM*** *on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.*